ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP కపిల్ చిట్స్ 40 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-1-2026 ఆదివారం సంపుటి: 31 సంచిక: 334 పేజీలు: 8+16 వెల: 8.00



## వెనిజులాపై అమెరికా దాడి

## కరాకస్‌పై భీకర దాడులు

యుద్ధ విమానాల గర్జనతో వణికిపోయిన రాజధాని

# మదురో బందీ

ధ్రువీకరించిన యుఎస్ అధ్యక్షుడు ట్రంప్

డ్రగ్స్‌ను అమెరికాలోకి పంపుతున్నారని ఆరోపణ

ఇక సైనిక దాడులు చేయబోమని స్పష్టీకరణ

వారి ఆధారాలు ఇవ్వండి: వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్

ఇది సైనిక దురాక్రమణే: రష్యా మండిపాటు 5




అమెరికా సైనికుల బందీగా వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో

# చుక్కనీటినీ వదలం!



## తెలంగాణ వాక్కులకు భంగం కలగనీయను

ప్రాజెక్టుల ప్లాన్ మార్చి రూ.వేల కోట్లు దోచుకున్నారు..

తోలు తీస్తా అన్న వాళ్ల నాలుక కోస్తా: అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డి ఫైర్

పాలమూరుకు అనుమతులు ఇవ్వాలి, బనకచర్లకు అనుమతులు ఇవ్వొద్దు

2 తీర్మానాలను కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం: ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి3:** 'తెలంగాణ నీళ్ల విషయంలో, అభివృద్ధి విషయంలో మేమంతా ఏకాభిప్రాయంతో పనిచేస్తాం, తెలంగాణ రావాల్సిన నీటి హక్కుల కోసం పోరాడుతాం చచ్చినా తెలంగాణ కోసం చస్తాం.. బ్రతికినా తెలంగాణ కోసం బ్రతుకుతాం.. ప్రాణమున్నంత వరకు తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తాం తెలంగాణ ప్రజలకు మేలు చేయాలన్నదే నా ఆలోచన. దేవుడి మీద ఆన.. నేను ఉన్నంత కాలం తెలంగాణ ప్రజల హక్కులకు భంగం కలగనీయను' అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ,రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వెల్లడించారు. కృష్ణా నదీ జలాలపై అసెంబ్లీలో సిఎం సుదీర్ఘ ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర నాయకులతో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కొట్లాడి పాలమూరు రంగారెడ్డిని సాధించుకున్నారు.ఆ సమయంలో మహబూబ్ నగర్ ఎంపీగా ఉన్న కేసీఆర్ పాలమూరు ఎత్తిపోతల ఇవ్వాలని అడగలేదు ఏ నైతిక హక్కుతో కేసీఆర్ ఇవాళ మాట్లాడుతున్నారు? అని ప్రశ్నించారు. కృష్ణా జలాలపై బహిరంగ సభలు కాదు.. సభలోనే చర్చించాలని మేం కేసీఆర్, హరీష్‌ను ఆహ్వానించామని తెలపారు.పదేళ్లు కృష్ణా నీటిని ఏపీ తరలించుకుపోయేందుకు సహకరించి తెలంగాణకు తీరని అన్యాయం చేశారు.వివరాలతో సభలో చర్చిద్దామంటే సభకు రాకుండా వెళ్లిపోయారని ఆగ్రహించారు.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కట్టాలని మొట్ట మొదట 2009 లో ఆనాటి ఎంపీ విఠల్ రావు వైఎస్ రాజశేఖరరెడ్డికి లేఖ రాశారు.చరిత్రలో పాలమూరు రంగారెడ్డికి ఎలా పునాదులు పడ్డాయో తెలంగాణ సమాజానికి తెలియాల్సిన అవసరం ఉంది విఠల్ రావును ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జూరాల నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున 70 టీఎంసీల వరద జలాలను మళ్లించి సాగునీటిని అందించేందుకు పాలమూరు ప్రాజెక్టు నిర్మించాలని ఉమ్మడి రాష్ట్ర ఆమోదం తెలిపింది.జూరాల నుంచి 70 టీఎంసీల వరద జలాలతో పాలమూరు ప్రాజెక్టు సర్వేతో పాటు డీపీఆర్ తయారు చేయాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా వాళ్లకు ఈ జీవో ద్వారా బాధ్యతలు అప్పగించింది. జూరాల సోర్స్‌గా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మించాలని ఆనాడు తెలంగాణ ఉద్యమకారులు, తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ ఫోరంకు చెందిన నిపుణులు, ఇంజనీర్లు సూచించారు. 26 రోజుల తర్వాత ఈ ప్రాజెక్టును కేసీఆర్ పథకం >>2

## కెసిఆర్ హయాంలోనే పాలమూరుకు అన్యాయం

ప్రాజెక్టుల అంచనాలు పెంచారు.. వేలకోట్లు దోచుకున్నారు

అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్



బిఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్య మండలిలో ప్రైవేటు వర్సిటీల సవరణ బిల్లు ఆమోదం లోపలి పేజీల్లో

శీతకాల సమావేశాలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించిన బిఆర్ఎస్

## సిపిఐ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోండి

అసెంబ్లీ స్పీకర్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి3:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు హేయమైనవని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తప్పు పట్టారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికై, దేశాభివృద్ధికి అహోరాత్రులు కష్టపడుతూ, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ గౌరవాన్ని పెంచుతున్న దార్శనిక నాయకుడి పట్ల.. ప్రజాప్రతినిధిగా ఉన్న వ్యక్తి, అసభ్యమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు శనివారం ట్విట్టర్ ద్వారా తెలిపారు. ఈ వ్యాఖ్యలు కూనంనేని రాజకీయ దివాళాకోరుతనాన్ని బయటపెట్టాయి.

రాజకీయాల్లో హుందాతనం, పరిణితి అవసరమన్నారు. అంతేకానీ ప్రధానమంత్రిపై వ్యక్తిగత దూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరం. ప్రజలు అన్నీ గమనిస్తుంటారనే విషయం గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో వారికి ప్రజాస్వామ్య విలువలపై, రాజకీయ వ్యవస్థపై ఏవగింపు కలుగుతోందన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు గానూ.. కూనంనేని సాంబశివరావు బేషరతుగా క్షమాపణ చెప్పాలి డిమాండ్ చేశారు. లేకపోతే శాసనసభ స్పీకర్ దీనిపై జోక్యం చేసుకుని మరెవరూ.. ఇలాంటి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చర్య తీసుకోవాలని కోరారు.

## అంజన్న దయతోనే నాకు పునర్జన్మ

ఆంజనేయ స్వామి మా ఇంటి ఇలవేల్పు

కొండగట్టు గిరిప్రదక్షిణ మార్గానికి కృషి

అవసరమైతే తానే కరసేవకుడిగా మారుతా



ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి అండగా ఉంటా

రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలి

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న సిఎం రేవంత్‌కి కృతజ్ఞతలు

ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

కొండగట్టులో వాయుపుత్ర సదన్ ధర్మశాల నిర్మాణానికి శంకుస్థాపన 3




శనివారం హైదరాబాద్‌లో డిజిపి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దేవా

## గెరిల్లా ఆర్మీ చీఫ్ దేవా లొంగుబాటు

తెలంగాణ కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి సహా 20 మంది మావోయిస్టులు కూడా

డిజిపికి భారీగా ఆయుధాలు అప్పగింత

రూ.20 లక్షల నగదు పోలీసులు స్వాధీనం

లొంగిపోండి: నక్సల్స్‌కు శివధర్ రెడ్డి పిలుపు

దేవాపై ఎన్ఐఎ రూ.75 లక్షల రివార్డు 2

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

సుక్మా జిల్లాలో 12 మంది మావోలు మృతి

మృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు

ఎకె-47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలు స్వాధీనం

అటు బీజాపూర్‌లోనూ ఎదురుకాల్పులు

ఇద్దరు మావోయిస్టులు మృతి

**చర్ల, జనవరి 3, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి వరస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఒకపక్క డిజిపి శివధర్ రెడ్డి ఎదుట పిఎల్‌జిఏ కమాండర్ మావోయిస్టు కీలకనేత బాడ్సే సుక్కా అలియాస్ దేవా తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకనాల రాజిరెడ్డితో సహా 21మంది మావోయిస్టులు లొంగిపోయిన సమయంలోనే ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుక్మా, బీజపూర్ జిల్లాలలో జరిగిన రెండు వేర్వేరు ఎన్ కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టు ఉద్యమం చివరి దశకు చేరుకున్నదన్న చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఒకేరోజు కీలక నేతల లొంగుబాటు, ఎన్ కౌంటర్లలో 14 మంది మృతిచెందడం సంచలనంగా మారింది.కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విధించిన గడువుకు ఇంకా తొమ్మిది నెలల సమయం ఉండగా ఇప్పటికే అగ్రనేతలు అందరూ లొంగిపోతున్నారు.మరికొందరు ఎన్‌కౌంటర్లలో మృతిచెందారు.కాగా మావోయిస్టు చీఫ్ తిప్పరి తిరుపతి (దేవ్‌జీ) గణపతి పాపారావు దామోదర్‌తో పాటు మరో ఇద్దరు నాయకులే మావోయిస్టు పార్టీని నడిపిస్తున్నారు. వీరుసైతం లొంగిపోయే ఆస్కారం ఉందని >>2



2 మొన్న పోస్టింగ్.. నిన్న సస్పెన్షన్..

## బళ్లారి ఎస్పీ ఆత్మహత్యాయత్నం

PATANJALI®
సింథటిక్ దగ్గు సిరప్‌లు అమాయక బిడ్డల ప్రాణాలు పోవటానికి కారణం అవుతున్నాయి...
సింథటిక్ మందులు మన జీవకణాల స్మరణ మరియు ప్రకృతి సహజ చట్టాలకు విరుద్ధం. సింథటిక్ మందులు, విటమిన్‌లు, సబ్బులు, షాంపూలు వగైరాలు మన ఆరోగ్యానికి పూర్తిగా రక్షణ ఇవ్వలేవు.
దగ్గు మరియు జలుబు కొరకు, 100% సురక్షితం మరియు సత్ఫలితం




బ్రోన్‌కోమ్, స్వసారివటి, స్వసారి గోల్డ్, స్వసారి ప్రవాహి మరియు స్వసారి అవలేహ
రసాయనిక సంయోజనిక & జంతు-ఆధారిత న్యూట్రాస్యుటికల్స్ రిప్లేస్ చేయండి. బదులుగా న్యూట్రీలా యొక్క ప్రకృతి పోషక సత్తువ శ్రేణి ఎంచుకోండి




సింథటిక్‌కు ఒక ప్రత్యామ్నాయం-దంత, కేశ మరియు చర్మ సంరక్షణ, పతంజలి నుండి ప్రకృతి సహజ ఉత్పత్తులను ఎంపిక చేసుకోండి




పతంజలి బాడీ క్లీన్సర్, దంత్ కాంతి, కేశ్ కాంతి & చర్మ సంరక్షణ శ్రేణి



రిపబ్లిక్‌డే రిహార్సల్స్‌ను శనివారం న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న ఎన్‌సిసి క్యాడెట్లు

మొన్న పోస్టింగ్.. నిన్న సస్పెన్షన్..

# బళ్లారి ఎస్పీ ఆత్మహత్యాయత్నం

**బళ్లారి,జనవరి 3:** కర్ణాటకలో సంచలనం సృష్టించిన బళ్లారి కాల్పుల ఘటన కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ సస్పెన్షన్‌కు గురైన జిల్లా ఎస్పీ పవన్ నెజ్జూర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనను సస్పెండ్ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, తుమకూరు జిల్లాలోని తన స్నేహితుడి ఫామ్‌హౌస్‌లో నిద్రమాత్రలు మింగినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈనెల ఒకటోతేదీ బళ్లారిలో జరిగిన హింసాత్మక ఘటనకు కేవలం రెండు గంటల ముందే పవన్ నెజ్జూర్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. 11 ఏళ్ల సర్వీసులో ఆయనకు ఇదే తొలి ఎగ్జిక్యూటివ్ పోస్టింగ్. ఈ ఘటనలో ఓ కాంగ్రెస్ కార్యకర్త మరణించడంతో, ప్రభుత్వం ఆయనపై నిర్లక్ష్యం ఆరోపణలతో వేటు వేసింది. ఈ పరిణామంపై ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ సర్కార్ ఒక హంతక ప్రభుత్వంగా మారిందని ప్రతిపక్ష నేత ఆర్.అశోక ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఈ ఘటనలో ఎస్పీని బలిపశువును చేశారు. బళ్లారిలో ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డిని హత్య చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలే ప్రయత్నించి, తమ సొంత కార్యకర్తనే కాల్చి చంపుకున్నారు. అధికారులపై ఒత్తిడి పెంచి వారి ఆత్మహత్యలకు ఈ ప్రభుత్వం కారణమవుతోంది. ఇది ఆత్మహత్య గ్యారెంటీ ఇచ్చే ప్రభుత్వమని అశోక తీవ్ర విమర్శలు చేశారు. అయితే, ఎస్పీ సస్పెన్షన్‌ను కర్ణాటక ప్రభుత్వం సమర్థించుకుంది. ఘటనా స్థలానికి వెంటనే వెళ్లడంలో ఎస్పీ విఫలమయ్యారని, అందుకే ఆయనపై చర్యలు తీసుకున్నామని న్యాయశాఖ మంత్రి హెచ్.కె. పాటిల్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన 30 నిమిషాలైనా సరే, ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అధికారి వెంటనే స్పందించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# డ్రగ్స్‌తో పట్టుబడ్డ ఎపి ఎమ్మెల్యే కుమారుడు

**నానక్‌రాంగూడలోని ఓ ఇంటిపై ఈగల్ టీం దాడి**

**సుధీర్‌రెడ్డిని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించిన పోలీసులు**

**నార్సింగి, జనవరి 3 ప్రభాతవార్త :** డ్రగ్స్ కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డిని నార్సింగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నానక్‌రాంగూడలో ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సుధీర్‌రెడ్డి డ్రగ్స్‌తో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ సమయంలో ఇంట్లో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. ముగ్గిరిని పోలీసులు అదుపులోకి తీసుకొని పరీక్షలు చేయగా సుధీర్‌రెడ్డికి పాజిటివ్, మిగితా ఇద్దరికి నెగెటివ్ వచ్చినట్లు తెలిసింది. దీంతో సుధీర్‌రెడ్డిని నార్సింగి పోలీసు స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఆ తరువాత ఇతడిని బంజారాహిల్స్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. ఇతడిపై గతంలో రెండు డ్రగ్స్ కేసులు ఉన్నట్లు తెలిసింది. గత కొంత కాలంగా ఈగల్ టీం ప్రతినిధులు గంజాయి, డ్రగ్స్ విక్రేతలు, వాడకం దారులపై ప్రత్యేక నిఘాను ఉంచి తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీలలో భాగంగానే శనివారం సుధీర్‌రెడ్డి పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ అంశంపై అధికారికంగా పోలీసులు స్పందించడం లేదు. సుధీర్‌రెడ్డి కుటుంబ సమస్యల కారణంగానే మనస్థాపం చెంది డ్రగ్స్‌కు అలవాటుపడ్డట్లు తెలుస్తుంది. ఇతడికి డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తుంది? ఎవరు సరఫరా చేస్తున్నారు? ఇతడితో పాటు ఎవరెవెరూ డ్రగ్స్‌కు బానిసలుగా ఉన్నారు? అన్న అంశాలను విచారణ అనంతరం పోలీసులు వెల్లడించే అవకాశం కనిపిస్తుంది.

**డ్రగ్స్ కేసు విషయం నాకేమీ తెలియదు : ఇన్‌స్పెక్టర్**

డ్రగ్స్ కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యే కుమారుడు సుధీర్‌రెడ్డిని అరెస్టుచేశారా? అనిప్రభాతవార్త నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ అడిగితే... డ్రగ్స్ కేసు విషయం నాకేమీ తెలియదని వివరించారు. నేను చాలా ప్రశాంతంగా ఉన్నాను. ఎలాంటి డ్రగ్స్ కేసులు నమోదు చేయలేదు. ఓ ఎమ్మెల్యే కుమారుడిని అదుపులోకి తీసుకుంటే ఇంత ప్రశాంతంగా స్టేషన్‌లో ఎలా కూర్చుంటా అన్నారు. ఎవరు డ్రగ్స్ కేసును నమోదు చేశారో? ఎవరిని అరెస్టు చేశారో? నాకెలాంటి సమాచారం లేదు. నార్సింగి పోలీసు స్టేషన్‌లో అలాంటి కేసులు నమోదు చేయలేదని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.

# వెనిజులా ఆపరేషన్ స్వయంగా వీక్షించా!

**అమెరికా సైనికుల ఆపరేషన్ అమోఘం**

**అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కితాబు**

**వాషింగ్టన్, జనవరి 3:** వెనెజులాలో అమెరికా సైన్యం సంచలన సైనిక చర్య చేపట్టింది. ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకుంది. ఈ ఆపరేషన్‌ను తాను మార్‌ఎలాగో విడిది నుంచి ప్రత్యక్షంగా వీక్షించానని, ఇది వేగంగా, కచ్చితత్వంతో పూర్తి చేసిన ఒక అద్భుతమైన మిషన్ అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభివర్ణించారు. ఆపరేషన్ జరిగిన కొద్ది గంటల తర్వాత ఫాక్స్ ఫ్రెండ్స్ వీకెండ్ కార్యక్రమంతో మాట్లాడుతూ ఆయన ఈ వివరాలు వెల్లడించారు. అమెరికా సైనికులు చేసిన పని అమోఘం. సెకన్ల వ్యవధిలోనే ఉక్కు తలుపులను పగలగొట్టడం నేను ఎప్పుడూ చూడలేదని ట్రంప్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో అమెరికా సైనికులు ఎవరూ చనిపోలేదని, అయితే ఒక హెలికాప్టర్‌పై దాడి జరగడంతో కొందరు గాయపడి ఉండవచ్చని ఆయన సూచనప్రాయంగా చెప్పారు. మదురో దంపతులను హెలికాప్టర్‌లో కరేబియన్‌లోని యూఎస్ఎస్ ఇవో జిమా యుద్ధనౌకకు, అక్కడి నుంచి న్యూయార్క్‌కు తరలిస్తున్నట్లు ఆయన ధృవీకరించారు. మాదకద్రవ్యాల సంబంధిత నేరాలతో సహా పలు తీవ్రమైన ఆరోపణలపై మదురో దంపతులపై న్యూయార్క్‌లో ఇప్పటికే అభియోగాలు నమోదయ్యాయని అటార్నీ జనరల్ పామ్ బాండీ స్పష్టం చేశారు.

# మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో మహిళలకు డ్రైవర్ ఉద్యోగాల జాబ్ మేళా

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళా భద్రతా విభాగం (డబ్ల్యుఎస్ డబ్ల్యు) ఆధ్వర్యంలో మహిళలకు డ్రైవర్ ఉద్యోగాల జాబ్ మేళా శనివారం జరిగింది. అంబర్‌పేట్‌లోని పిటిసిలో జరిగిన ఈ కార్యక్రమాన్ని డబ్ల్యుఎస్‌డబ్ల్యు అదనపు డిజి చారు సిన్హా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఓడబ్ల్యు అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు సొంతం గా ఎదిగేందుకు ఈ జాబ్ మేళా కార్యక్రమం దోహదపడుతుందని ఆమె చెప్పారు. డ్రైవింగ్ తెలిసిన వారికి నేరుగా క్యాబ్ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పి ంచడం డ్రైవింగ్ రాని వారికి ఎంఓడబ్ల్యు చేత తర్ఫీదునిచ్చి ఉద్యోగాలు వచ్చేలా చేస్తామని ఆమె తెలిపారు. మార్చి తొమ్మిదవ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు ఉద్యోగాలకు సంబంధించిన కార్యక్రమం వుంటుందని ఆమె తెలిపారు. కాగా ఈ జాబ్ మేళాకు 700 మంది మహిళలు హాజరయ్యారు. వీరిలో వంద మందికి డ్రైవింగ్ లైసెన్స్ వుంది. మిగతా వారికి లైసెన్స్ లేదు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు డబ్ల్యుఎస్‌డబ్ల్యు ఏర్పాట్లు చేస్తోంది. ఈ జాబ్ మేళాలో పాల్గొన్న మహిళలు జంట నగరాలు, శివారు ప్రాంతాలకు చెందిన వారు కావడం గమనార్హం. మహిళలకు డ్రైవింగ్ వి భాగంలో జాబ్ మేళా ఏర్పాటవడం ఇదే తొలిసారి. ఈ జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన వా రికి షీ క్యాబ్స్‌తో పాటు మహిళలు ప్రయాణించే క్యాబ్‌లలో వుండేలా చూడాలని డబ్ల్యుఎస్‌డబ్ల్యు భావిస్తోంది.

## వారం - వర్జ్యం

04-01-2026, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,పూర్వాషాఢ కార్తె
కృ.పాడ్యమి మ.12.34
పునర్వసు మ.3.15
వర్జ్యం : ఉ.10.12-12.07
దు.సా.4.15-5.00
శుభసమయం : సా.6.25-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** ఎదుటివారు చెప్పేది ఆశాంతం వినండి. తొందరపాటు మాటలు, పరుష సంభాషలు తగాదాలు లాభించవు.

**వృషభం:** ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఋణం చేయడం, ఋణం ఇవ్వడం రెండూ కలిసి రావు.

**మిథునం:** సినీ, కళా రంగాలలోని వారు వస్త్ర వ్యాపారస్తులు జాగరూకతతో మెలగవలసి వుంటుంది. ప్రయాణాలు.

**కర్కాటకం:** ఒకటికి రెండు సార్లు ఆలోచించి విదానంగా అడుగులు వేయడం మంచిది. పనులు మందకొడిగా సాగుతాయి.

**సింహం:**పలురంగాల పట్ల మీకున్న అనుభవం ఉపకరిస్తుంది, వెనువెంటనే పూర్తవుతాయి. ఇంటా బయటా అనుకూలం.

**కన్య :** కరవమంటే కప్పకు కోపం విడవ మంటే పాముకు కోపం అన్న చందనంగా ఎవరికీ సర్ది చెప్పలేరు.

**తుల :** దైవం మీద భారం వేసి ఒక కీలక నిర్ణయాన్ని అమలు పరుస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**వృశ్చికం:** సాధ్యమైనంత వరకు పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. ప్రయత్నంలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**ధనుస్సు:** బాధ్యతలు అధికమవుతాయి. వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి. ఉద్యోగులకు బదిలీలువుంటాయి.

**మకరం:**రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి కొంతవరకు అనుకూలంగా వుంటుంది. నూతన ఒప్పందాలలో తొందరపాటు వద్దు.

**కుంభం:**ఉపయుక్తం లేని అంశాలు ఈరోజు కాలహరణానికి కారణం అవుతాయి. కోర్టు తీర్పులు అసంతృప్తికి గురిచేస్తాయి.

**మీనం :** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. వ్యవహారాలు నిదానంగా పూర్తి చేస్తారు. స్వల్ప ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## సవరణ

'వార్త' దినపత్రిక శనివారం సంచిక మొదటి పేజీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతున్న ఫొటో 'రైటప్'లో సీఎం రేవంత్‌రెడ్డి పేరుకు బదులుగా మాజీ సీఎం కెసిఆర్ పేరు తప్పుగా ప్రచురితమైంది. పొరపాటుకు చింతిస్తున్నాం.

- ఎడిటర్

# గెరిల్లా ఆర్మీ చీఫ్ దేవా లొంగుబాటు

**తెలంగాణ కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి సహా 20 మంది మావోయిస్టులు కూడా**

**డిజిపికి భారీగా ఆయుధాలు అప్పగింత**

**రూ.20 లక్షల నగదు పోలీసులు స్వాధీనం**

**బేషరతుగా లొంగిపోండి: నక్సల్స్‌కు శివధర్ రెడ్డి పిలుపు**

**దేవాపై ఎన్ఐఎ రూ.75 లక్షల రివార్డు**




శనివారం హైదరాబాద్‌లో డిజిపి ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఎపిలలో ఓ వైపు నిర్బంధం, మరోవైపు ఎదురు కాల్పులు, లొంగుబాట్లు జరుగుతుండగా తాజాగా శనివారం నాడు ఆ పార్టీ అగ్రనేత పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆ ర్మీ (పిఎల్‌జిఎ) కమాండర్ బడ్సె సుక్కా అలియాస్ దేవా, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి సహా 20 మంది నక్సలైట్లు ఆయు ధాలతో డిజిపి శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. వీరిలో ఆరుగురు మహిళలు వున్నారు. వీరి వద్ద నుంచి రెండు ఎల్ఎంజి, అమెరికాలో తయా రైన అధునాతన తుపాకి, ఇజ్రాయిల్‌లో తయారైన మరో తుపాకి. ఎనిమిది ఎకె 47 తుపాకులు, పది ఇన్సాస్ తుపాకులు, ఎనిమిది ఎస్ఎల్ఆర్ తుపాకులు, నాలుగు బిజిఎల్ తుపాకులు, 11 సింగిల్ షాట్స్ తుపాకులు, రెండు గ్రేనేడ్లు, ఒక ఎయిర్ గన్ పెద్ద ఎత్తున తూటాలను స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో తెలంగాణకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యుడు వుండగా మిగతా వారంతా ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన వారు.

వచ్చే మార్చి నెలాఖరుకు దేశంలో నక్సలైట్ల ఉనికి లేకుండా చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ దిశగా గట్టి చర్యలు తీసుకో వాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించిన నేపథ్యంలో తెలంగాణ సహ మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలు ఓవైపు కూంబింగ్ నిర్వహిస్తూనే మరోవైపు లొంగుబాట్లను ప్రోత్సహిస్తోంది. తెలంగాణలో గత ఏడాది 576 మంది నక్సలైట్లు ఆయుధాలతో పాటు లొంగిపోగా ఈ ఏడాదిలో మొదటి లొంగుబాటులో భాగంగా 20 మంది స రెండర్ అయ్యారు. లొంగిపోయిన వారిలో పిఎల్‌జిఎ కమాండర్ ఛత్తీస్‌ఘడ్‌లోని పువర్తికి చెందిన దేవాతో పాటు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి వున్నారు. ఇందులో దేవాపై 75 లక్షల రూపాయల రివార్డు వుంది. ఇతను మావోయిస్టు అగ్రనేత హిడ్మా స్వగ్రామానికి చెందిన వ్యక్తి. మావోయిస్టు పిఎల్‌జిఎలో దేవాల కీలకంగా వున్నాడు. కాగా దేవాతో పాటు లొంగిపోయిన వారిలో ఛత్తీస్‌ఘడ్‌కు చెందినమ అవులం సోమా (32), కుంజం పొడియా అలియాస్ శ్రీకాంత్ (30). కోవసి పైకు (20), మడకం లక్కో (20), కర్టం జోగ (20), మడవి అందు (31), కుంజం చోట (21), మడకం అండా (23), కుంజం భీమా (27), మడవి కోసి (25), వేముల రాజు (35), పొడియం చైతే (25) పునెం భీమా (25) మడ కం నందయ్య (22), పుల్సం (24)తో పాటు ఎపికి చెందిన కంకణాల రాజిరెడ్డి సతీమణి ఈశ్వరి (45), హనుమకొండకు చెందిన దార సారయ్య (49)లు వున్నారు. వీరంతా దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యులుగానూ, పార్టీ క్షేత్రస్థాయి సభ్యులుగానూ వున్నారు.

**తెలంగాణ నుంచి 17 మందే మిగిలారు..డిజిపి వెల్లడి**

గత ఏడాది తెలంగాణలో 576 మంది నక్సలైట్లు లొంగిపోయారని, వీరిలో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు, 11 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ముగ్గురు డివిజనల్ కమిటీ కార్యదర్శులు, 17 మంది డివిజన్ కమిటీ సభ్యులు, 57 మంది ఏరియా కమిటీ సభ్యులు వున్నారని డిజిపి శివధర్ రె డ్డి తెలిపారు. నక్సలైట్లు ఇంత భారీ సంఖ్యలో లొంగిపోవడం వెనుక పోలీసుల సమిష్టి వ్యూహం, ప్రభుత్వ ప్రోత్సాహం వుందని ఆయన తెలిపారు.ఇది మావోయిస్టులపై పోలీసుల విజయంగా డిజిపి తెలిపారు. గత అక్టోబర్ 21వ తేదీన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నక్సలైట్లను లొంగిపోవాలని సిఎం రేవంత్ ఇచ్చిన పిలుపుమేరకు మావోయిస్టులు లొంగిపోతున్నట్లు డిజిపి తెలిపారు. మావోయిస్టు పా ర్టీలో జాతీయ స్థాయిలో కేవలం అజ్ఞాత కేడర్‌లో వున్న వారు తెలంగాణకు చెందిన వారు కేవలం 17 మంది మాత్రమే వున్నారని ఆయన తెలిపా రు. పిఎల్‌జిఎ పతనం దిశగా సాగుతోందని ఆయన తెలిపారు. అజ్ఞాతంలో వున్న మావోయిస్టులు జనంలోకి రావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. లొంగిపోయిన వారికి రివార్డులు ఇవ్వడంతో పాటు సాధారణ జీవితం గడిపేందుకు అవకాశంకల్పిస్తామని, వారిపై ఎలాంటి కేసులు వుం డకుండా చూస్తామని ఆయన తెలిపారు. తాజాగా ఛత్తీస్‌ఘడ్ నుంచి తెలంగాణకు వచ్చి ఆయుధాలతో పాటు వారే లొంగిపోయారని డిజిపి తెలిపారు. వీరిని ఛత్తీస్‌గడ్‌కు పంపి అక్కడ పునరావాసం అమలయ్యేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. లొంగిపోయిన వారి పేరిట వున్న కోటీ 81 లక్షల రూపాయల రివార్డును వారికే ఇస్తున్నామని డిజిపి తెలిపారు. నక్సలైట్ల లొంగుబాటులో విశేషంగా కృషి చేస్తున్న ఎస్ఐబి పోలీసులను డిజిపి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్. గ్రే హౌండ్స్ అదనపు డిజి అనిల్ కుమార్, ఇంటెలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్, ఎస్ఐబి ఐజి సుమతి తదితరులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

>> వదంతులు అప్పుడప్పుడు వినిపిస్తున్నాయి.అదే జరిగితే మావోయిస్టు పార్టీ కనుమరుగు అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి..కాగాబస్తర్ రేంజ్ పరిదిలోని సుక్మా జిల్లా కిష్టారం అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్న సమాచారంతో డిఆర్జీ సిఆర్ పి ఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి.ఈ క్రమంలో శనివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు ఎదురుపడటంతో ఇరు వర్గాల మధ్య పలు దఫాలుగా హోరాహోరీగా కాల్పులు చోటుచేసుకోగా 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. మరోవైపు బీజపూర్ జిల్లా దక్షణ ప్రాంతంలో చోటు చేసుకున్న మరో ఎన్ కౌంటర్ లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. రెండు ఎన్ కౌంటర్ల నుండి మొత్తం 14 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాదీన పరుచుకున్నారు. వీరిని గుర్తించాల్సి ఉంది. ఎన్ కౌంటర్ ప్రాంతం నుండి ఏకే 47, ఇన్ సాస్ రైఫిల్స్, ఎస్ ఎల్ ఆర్ రైఫిల్స్, భారీ సంఖ్యలో ఆయుదాలు, పేలుడు పదార్ధాలు, ఇతర మావోయిస్టు వస్తువులను స్వాదీన పరుచుకున్నారు. ఎన్ కౌంటర్లను బస్తర్ రేంజ్ ఐజి సుందర్ రాజ్, సుక్మా జిల్లా ఎస్ పి గౌరవ్ రాయ్, బీజపూర్ జిల్లా ఎస్ పి డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ దృవీకరించారు.



'మాఘ మేళా' పండుగ ప్రారంభాన్ని సూచించే 'పౌష పూర్ణిమ' సందర్భంగా శనివారం ప్రయాగ్‌రాజ్ సమీపంలోని గంగానదిలో పవిత్ర స్నానం చేస్తున్న భక్తులు

# సాయుధ పోరాటం సాధ్యం కాదు

**కంకణాల రాజిరెడ్డి వెల్లడి**

**ఇష్టపూర్వకంగానే లొంగిపోయా: దేవా**

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిగా నియమితులైనట్లు ప్రచారం జరుగుతున్న తిప్పిరి తిరుపతి అలి యాస్ దేవ్‌జీ గురించి తనకు ఎలాంటి సమాచారం లేదని శనివారం నాడు డిజిపి ఎదుట లొంగిపోయిన పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేష్ తెలిపారు. చాలా కాలంగా ఆయనతో తనకు సంబంధాలు లేవని, ఆయన పార్టీలో వున్నాడా...? లేడా...? అనే విష యమై తన వద్ద ఎలాంటి సమాచారం లేదని ఆయన తెలిపారు. డిజిపి ఎదుట లొంగిపోయిన తరువాత వెంకటేష్ మీడియాతో కొద్దిసేపు మాట్లా డారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. మావోయిస్టు పార్టీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితుల గురించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో సాయుధ పోరాటం సాధ్యమయ్యే పనికాదని అన్నారు. టెక్నాలజి బాగా అభివృద్ది చెందిందని, దీనిని పోలీసులు బాగా వాడుతున్నారని, ఈ విషయంలో మావోయిస్టులు పోలీసులతో పోటీపడలేక పోతున్నారని ఆయన తెలిపారు. ఈ పరిస్థితు ల్లో మావోయిస్టులు జనంలోకి రావాలని, ప్రజలతో మమేకం కావాలని, వారితో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని, ఆ దిశగా ముందుకు సాగాలని ఆయన వెల్లడించారు. నక్సలైట్ల లొంగుబాట్ల విషయంలో పోలీసుల చర్యలు, ప్రభుత్వ విధానాన్ని ఆయన అభినందించారు. తాను కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నానని, ఈ కారణంగానే లొంగిపోతున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా మరో మావోయిస్టు అగ్రనేత దేవా మాట్లాడుతూ తాను ఇష్ట పూర్వకంగానే లొంగిపోయానని, ఇందులో ఎవరి ఒత్తిడి, ఇతరుల ప్రమేయం లేదని అన్నారు. ఈ విషయంలో పోలీసులకు, ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# చుక్కనీటినీ వదలం!

>> ప్రకారం డైవర్ట్ చేశారు. జూరాల నుంచి కాకుండా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు సోర్స్‌ను శ్రీశైలం నుంచి మార్చాలని ఆదేశాలు జారీచేశారని ఆరోపించారు.జూరాల వద్ద నిర్మిస్తే పంపులకు రూ.5,185 కోట్లు అంచనా వేస్తే .. సోర్స్ ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి పంపులు, లిఫ్టుల సంఖ్య పెంచారు.37 పంపులకు రూ.10,335 కోట్లకు అంచనాలు పెంచారని చెఉప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే అప్పటి ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంలో వీలైనన్ని సాగునీటి ప్రాజెక్టులు మంజూరు చేసింది. 2005 నుంచి 2014 నాటికే కృష్ణా బేసిన్‌లో ఎస్ఎల్‌బిసి, కల్వకుర్తి, నెట్టెంపాడు, పాలమూరు రంగారెడ్డి, డిండి, మక్తల్ నారాయణపేట కొడంగల్,కోయిల్ సాగర్ ప్రాజెక్టులు చేపట్టింది. 2014లో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాల్సి ందిపోయి అసంపూర్తిగా వదిలేసిందని తప్పుపట్టారు.490 టీఎంసీలు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు కేటాయిస్తే.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక.. కేసీఆర్, హరీష్ రావు బాధ్యతలు చేపట్టాక తెలంగాణ ప్రజలకు మరణ శాసనం రాశారు 2015 జూన్‌లో జరిగిన కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో జరిగిన అంతర్రాష్ట్ర సమావేశంలో 299 టీఎంసీలకు అంగీకరించారు. ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీలల్లో తెలంగాణకు 490 టీఎంసీలు అడగాల్సి ందిపోయి 299 టీఎంసీలకు ఒప్పుకుని సంతకం పెట్టారు 21.09.2016 న జరిగిన అపెక్స్ కమిటీ మీటింగ్‌లోనూ మనకు 299 టీఎంసీలు చాలు అని కేసీఆర్ తాత్కాలిక నీటి వాటాలకు ఒప్పుకొని వచ్చారు.06.10.2020లో జరిగిన రెండో అపెక్స్ మీటింగ్‌లోనూ ఈ కేటాయింపులే కొనసాగించండి. అని శాశ్వతంగా ఒప్పుకొని వచ్చారని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ద్వారా రూ.55వేల కోట్లు కొల్లగొట్టాలని కెసిఆర్ ప్లాన్ చేశారని సిఎం ఆరోపించారు.డిపిఆర్ లేకుండా రూ.25వేల కోట్లు ఖర్చు చేశారు. తుమ్మిహట్టి వద్ద ప్రాణహిత చేవేళ్ల కట్టకుండా మేడిగడ్డ దగ్గర కాళేశ్వరం నిర్మించి అంచనాను రూ.38వేల కోట్ల నుంచి రూ.లక్ష కోట్లకు పెంచారని,అలాగే జూరాల దగ్గర కట్టాల్సిన పాలమూరును శ్రీశైలానికి మార్చి రూ.32,800 కోట్ల నుంచి రూ.90వేల కోట్లకు పెంచారని తెలిపారు.

వలసల జిల్లా పాలమూరు బిడ్డగా కరువు కష్టాలు, పేదరికం ఎలా ఉంటుందో నాకు పూర్తిగా తెలుసు అని చెప్పారు. అయితే తెలంగాణ ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతుందని, ఇందుకు కాంగ్రెస్ కారణమని కేసీఆర్ విమర్శించారు గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు ఎలా ఉపయోగపడతాయో, ఈ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై తన అనుభవంతో సూచనలు ఇస్తారని అనుకున్నాం అని పేర్కొన్నారు. అందుకే కృష్ణా జలాలపై ఒకరోజు, గోదావరి జలాలపై ఒకరోజు సభలో చర్చిద్దామని ఆహ్వానించామని చెప్పారు. ఈ శాసన సభకు ఒక పవిత్రత ఉంది.ఈ సభలో జరిగే చర్చలను, విషయాలను, అందులోని వాస్తవాలను ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో నమ్ముతారు. ఎందుకంటే... ఇక్కడ అబద్దానికి ఆస్కారం లేదు. మాటల గారడీలకు స్థానం లేదు అని పేర్కొన్నారు. ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలే తప్ప రాజకీయ ప్రయోజనాలకు ఇది వేదిక కాబోదు.తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ప్రాతినిధ్యానికి ప్రతిరూపం ఈ సభ.ఈ సభలో మాట్లాడే ప్రతిమాట రాష్ట్ర ప్రయోజనాలే పరమావదిగా ఉంటుందన్న నమ్మకం ప్రజల్లో ఉంటుంది అని చెప్పారు. గడచిన రెండేళ్లుగా ప్రతిపక్ష నాయకుడు సభకు రావడం లేదు. సభకు రండి అని నేను పదే పదే విజ్ఞప్తి చేశా అని పేర్కొన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉంది అని చెప్పుకునే ప్రధాన ప్రతిపక్ష నేత సభకు రాలేదు సభలోకి రాము, చర్చలో పాల్గొనం అని హరీష్ రావు మాట్లాడటం చట్టసభలను అవమానించడమే అని పేర్కొన్నారు. మీరు సభ పెట్టండి మీ బట్టలు ఒడదీస్తామన్నారు తోలు తీస్తామని కేసీఆర్ మాట్లాడారువారు సభలో చర్చలో పాల్గొని ఉంటే.. ఎవరి బట్టలు ఎవరు ఊడదీస్తారు.. ఎవరి తోలు ఎవరు తీస్తారు అనేది తెలంగాణ ప్రజలకు తెలిసేది అని వ్యాఖ్యానించారు. కెసిఆర్ తోలు తీస్తా అన్నాడు కదా. తెలంగాణ రైతుల పట్ల తమ చిత్తశుద్దిని ఎవరైనా ప్రశ్నిస్తే తోలు తీయడం కాదు నాలుక కోస్తా,ఇంకేదైనా మాట్లాడు, అడ్డగోలుగా మాట్లాడితే తోలు తీస్తా అన్నవాళ్ల నాలుక కోస్తా, దేవుడిపై ఆన... తెలంగాణ ప్రజల హక్కులకు భంగం కలగనివ్వను అని స్పష్టం చేశారు. పదే పదే తనకు ఇంగ్లీష్ రాదంటూ హేళన చేస్తున్నారని, చైనా,జపాన్,జర్మనీ వాళ్లకు ఇంగ్లీష్ వచ్చా మెస్సీకి కూడా స్పానిష్ తప్ప ఏమి రాదు, ఆటగాడికి ఆట రావాలి, పాలకుడికి పాలన తెలియాలి. భాష అనేది మాట్లాడుకోవడానికి దాని వల్ల జ్ఞానం రాదు, అమెరికాలో బిచ్చం ఎత్తుకునేవాడికి, బాత్‌రూమ్‌లు కడిగేవాడికి ఇంగ్లీష్ వస్తుందని,వారికి వేరే భాష రాదు, తెలుగు మాట్లామనండీ చూద్దాం అని తెలిపారు. అసెంబ్లీలో సిఎం రేవంత్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఆపితేనే చర్చలకు వస్తామని చంద్రబాబుకు సూటిగా చెప్పినట్లు వెల్లడించారు. తాను తెలంగాణకు అన్యాయం చేయనని, ప్రాంతం తర్వాతే పార్టీ అంటూ నాడు బయటికొచ్చినట్లు చెప్పారు. రాష్ట్రం కోసం ఎవరితోనైనా పోరాడుతానని రేవంత్ తేల్చి చెప్పారు. నీటి వివాదాలపై అసెంబ్లీల్లో సుదీర్ఘ చర్చ పెట్టిన ప్రభుత్వం రెండు కీలక తీర్మానాలు చేసింది. పాలమూరుకు అనుమతులు ఇవ్వాలంటూ ఏకగ్రీవంగా తీర్మానించింది. అలాగే ఏపీ చేపట్టే పోలవరం-బనకచర్ల,పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్ట్‌లకు కేంద్రం అనుమతులు ఇవ్వవద్దంటూ తీర్మానం చేసింది. వీటిని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నఉట్ల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేశారు.

# ఉచిత విద్యుత్ డిస్కంకు రూ.9,032 కోట్ల రుణాలు

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉచిత విద్యుత్ నిమిత్తం కొత్తగా ఏర్పడుతున్న మూడో విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)కు ఆదిలోనే అప్పుల భారం తగులుకుంది. కేవలం ఉచిత పథకాలకే పరిమితమైన ఈ విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు తర్వాత అందుబాటులోకి వచ్చేందుకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటి వరకూ ఉన్న రెండు విద్యుత్ పంపిణీ సంస్థలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను మూడో డిస్కంకు కూడా కేటాయించారు ఇందులో భాగంగా 9,032 కోట్ల రూపాయల మేర రుణాలు సైతం మూడో డిస్కంకే బదలాయించారు. దీంతో కొత్త డిస్కంకు అప్పుల భారం తగులుకుంది. అలాగే ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలు విద్యుత్ వినియోగించినందుకు గాను బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచడంతో విద్యుత్ పంపిణీ సంస్థలకు భారీ మొత్తంలో బకాయిలు పడ్డాయి. వీటిని కూడా విభజించి మూడో డిస్కంకు 35,982 కోట్ల రూపాయలు కేటాయించారు.

# పాలమూరు-రంగారెడ్డిపై గత సర్కారు నిర్లక్ష్యం

## వచ్చే మూడేళ్లలో ప్రాజెక్ట్ పూర్తిచేస్తాం

## నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్



**హైదరాబాద్, జనవరి 3,ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై గత ప్రభుత్వ హయాంలో కేవలం 30 శాతం నిధులు మాత్రమే ఖర్చు పెట్టారని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతుల కోసం పెట్టిన శ్రద్ధ పాలమూరు ప్రాజెక్టుపై పెట్టలేదని విమర్శించారు. ఈమేరకు శనివారం శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు బిఆర్ఎస్ ప్రభుత్వం 2015లో జీవో ఇచ్చి 2022లో సమగ్ర ప్రాజెక్టు నివేదిక సమర్పించిందని ఆయన పాలమూరు ప్రాజెక్టు వాటర్ సోర్సును మార్చడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. కాళేశ్వరంపై రూ.90వేల కోట్లు ఖర్చు చేసిన గత బిఆర్ఎస్ ప్రభుత్వంపాలమూరుకు కేవం రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టులో ఒక మోటార్ ఆన్ చేసి జాతికి అంకితం చేశామని ప్రకటించి కెసిఆర్ మోటార్ ఆన్ చేయగా తెల్లారే మళ్లీ ఆఫ్ చేశారని ఎద్దేవా చేశారు.

**పాలమూరు అంచనాలు 1.5 టిఎంసీ నుంచి 1 తగ్గించారు**

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రోజుకు 3 టిఎంసీలు తరలించేలా అంచనాలు పెంచుకుంటూ పోయారని కానీ పాలమూరులో మాత్రం 1.5 నుంచి ఒక టిఎంసికి తగ్గించారన్నారు. జూరాల నుంచి అయితే రోజుకు 2.8 టిఎంసీలు తరలించే అవ కాశం ఉండేదని వివరించారు. 60 రోజుల్లో 121 టిఎంసీలు తీసుకునేవాళ్లమని వాటర్ సోర్స్ ను జూరాల నుంచి శ్రీశైల నికి మార్చడం వల్ల 68 టిఎంసిల స్థాయికి పడిపో యిందని ఆవేదన వ్యక్తం చేశా రు. ఆయకట్టు కాల్వల ప్రస్తా వన, భూసేకరణ లేకుం డానే డిపిఆర్‌ను రూపొందిం చారని బిఆర్ఎస్‌పై మండిపడ్డారు. ప్రాణ హిత చేవెళ్లను తుమ్మిడి హట్టి నుంచి మార్చి గోదావరిలో అన్యాయం చేశారన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పదేళ్లలో ఏపీ అక్రమంగా నీటిని తరలించు కుపోయిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాయల సీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కు ఆనాడు జగన్ కు సహకరిం చింది కెసిఆరేనని కృష్ణా నీటి వాటాలో తెలంగాణకు 299 టిఎంసి లు చాలని సంతకాలు చేసి తెలంగాణకు మరణ శాస నం రాశారని ఫైర్ అయ్యారు.

# రైతు సమస్యలపై గలమెత్తితే అరెస్టులా?

## కిసాన్ కాపాస్ యాప్ తొలగించాలి

## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి

## తీవ్రఉద్రిక్తల నడుమ మాజీమంత్రి అరెస్ట్

**ఆదిలాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** రైతు సమస్యలపై గలమెత్తుతే అక్రమ అరెస్టులు చేస్తారా...రైతు కుటుంబాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్రా ప్రభుత్వాలపై లేదా అని మాజీ మంత్రి జోగు రామన్న ప్రశ్నించారు. రైతులకు మద్దతుగా వారు ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వర పరిష్కారం చేయాలని కోరుతూ శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎమ్మెల్యే, ఎంపీ ఇళ్ల ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతలకు దారిచేసింది. మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో కలిసి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ క్యాంప్ ఆఫీస్ ముట్టడి చేశారు. దీంతో పోలీసులకు,బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ ఉద్రిక్తతలో పలువురికి గాయ్యాలయ్యాయి. ఈ నేపథ్యంలోమాజీమంత్రి అక్రమ అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ రంగు మారిన సోయాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని... కిసాన్ కాపాస్ యాప్. తొలగించాలని పలు డిమాండ్లు చేశారు. రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ శాంతి యుతంగా ధర్నా కార్యక్రమాని కొనసాగుతుంటే పోలీసులు వాగ్వేదానికి దిగుతూ అక్రమ అరెస్టులకు పాల్పడడం తగదన్నారు.. రైతు కుటుంబాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు... స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలకు రైతులపై చిత్త శుద్ధి లేదని, రైతాంగం ఎదురుకుంటున్న సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడంపై ఆ పార్టీ ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారని ఆరోపించారు.




నిందితున్ని అరెస్టు చూపిస్తున్న రూరల్ సీఐ కుమారస్వామి, ఎస్సై సందీప్

# అమాయక ప్రజలను మోసగించిన ఆర్‌ఎంపి అరెస్ట్

**కాగజ్‌నగర్‌రూరల్, జనవరి 3, ప్రభాతవార్త :** ఎలాంటి వైద్య అనుభవం లేకుండా అమాయక ప్రజలను మోసం చేసిన ఆర్‌ఎంపి వైద్యుడు బిక్షపతిని అరెస్ట్ చేసినట్లు శనివారం కాగజ్‌నగర్ రూరల్ సిఐ కుమారస్వామి పేర్కొన్నారు. సీఐ వివరాల ప్రకారం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీకి చెందిన తన్నీరు బిక్షపతి స్థానిక మధు నర్సింగ్ హోమ్ లో చేసిన అనుభవంతో అమాయకులను మోసం చేసి అధిక డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఎలాంటి అర్హత లేకున్న ప్రత్యేకంగా ఒక క్లినిక్ పెట్టుకోని 2010 సంవత్సరంలో కోయవాగులో స్నేహిత పేరిట ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. గతేడాది నవంబర్ 11న కోయవాగు గ్రామానికి చెందిన మాదరవేణి అక్షర అనే అమ్మాయికి కొన్ని రోజులుగా అధిక డోసులు గల ఇంజెక్షన్లతో చికిత్స చేశాడు. దీంతో అక్షర కిడ్నీలు చేడి పోయాయి. మెరుగైన చికిత్స గురించి హైదరాబాద్ లోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె డిసెంబర్ 29న మృతి చెందినట్లు వెల్లడించారు. మృతిరాలు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కాగజ్ నగర్ రూరల్ కేసు నమోదు చేసి ఆర్‌ఎంపిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

# అంజన్న దయతోనే నాకు పునర్జన్మ

## ఆంజనేయస్వామి మా ఇంటి ఇలవేల్పు.. కొండగట్టు గిరిప్రదక్షిణ మార్గానికి కృషి

## అవసరమైతే తానే కరసేవకుడిగా మారుతా

## కొండగట్టులో వాయుపుత్ర సదన్ ధర్మశాల నిర్మాణానికి శంకుస్థాపన

## ప్రత్యేకపూజలు నిర్వహించిన ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్



**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** కొండగట్టు ఆంజనేయ స్వామి మా ఇంటి ఇలవేల్పు అని గిరిప్రదక్షి ణ మార్గానికి నా వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామిని శనివారం ఏపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు. వీరితో పాటు టిటిడి బోర్డు చైర్మన్ బి.ఆర్ నాయుడు టి టి డి సభ్యులు పాల్గొన్నారు.మొదట హెలికాప్టర్ ద్వారా జేఎన్టీయూ కు చేరుకున్న పవన్ కళ్యాణ్ కు రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ వయోవృద్ధులు, వికలాంగులు మరియు ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్ టిటిడి సహకారంతో రూ 35.19 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూఆంజనేయ స్వామి తమ ఇంటి ఇలవేల్పు అని ఆయన దయతోనే తనకు పునర్జన్మ లభించిందని జనసేన అధినేత ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. గతంలో ఆలయ అధికారులు తన దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే అభివృద్ధి పనులకు మాట ఇచ్చినట్లు తెలిపారు.కొండగట్టు ఆంజనేయ స్వామి దయతో రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షి ంచారు. తెలంగాణ ప్రభుత్వం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టడం హర్షనీయం అన్నారు. కొండగట్టు గిరి ప్రదక్షణకు మార్గం సుగమం చేసేందుకు అవసరమైతే తానే స్వయంగా కర సేవకుడిని అవుతానని మాట ఇచ్చారు. భవిష్యత్తులో సైతం ఆలయ అభివృద్ధికి తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.కొండగట్టు ఆంజనేయ స్వామికి నిధులు కేటాయించినందుకు ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కు మరియు టిటిడి కి నా ధన్యవాదాలు అని అన్నారు. కొండగట్టు అంజన్న స్వామి అజ్ఞ వల్లే ...అందుకే టిటిడి వారు అమోదం లభించిందని తెలిపారు. కొండగట్టు అభివృద్ధి కి తెలంగాణ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించడం అభినందనియం అని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఘనంగా స్వాగతం తెలిపిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిప్రదిక్షణ తెలుగు రాష్ట్రాలకి, దేశానికి కూడ రక్ష అని అన్నారు. కొండగట్టు గిరి ప్రదిక్షణ కి అందరం కలిసి కరసేవా చేద్దాం అని తెలిపారు. అలాగే కొండగట్టు ఆలయ అభివృద్ధికి అందరు కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మరియు తన అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూఉత్తర తెలంగాణ పుణ్యక్షేత్రాల్లో ప్రధానమైన కొండగట్టు ఆంజనేయ స్వామి అలయంకు ఏపి ఉప ముఖ్యమంత్రి వచ్చి 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు అందివ్వడం కృతజ్ఞతలు తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి అలయం అభివృద్ధి చేయడంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి అలయంకు వచ్చే దీక్ష విరమణ, దర్శనం కొరకు వచ్చే భక్తుల కొరకు గదుల వసతి సముదాయానికి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని భవిష్యత్తులో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించి కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానం లాగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘటించారు. 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు సమకూర్చడానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం మాట్లాడుతూకొండగట్టు ఆంజనేయ స్వామి అలయంకు ఏపి డిప్యూటీ సిఎం సహకారంతో 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు అందివ్వడం కృతజ్ఞతలు తెలిపారు.కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం అభివృద్ధిలో పాలు పంచుకున్న ఏపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కు కొండగట్టు ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే గా ప్రభుత్వం నుండి నిధులు తెచ్చి మరింత ఆలయం అభివృద్ధి చేయడంలో నా వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్, టీటీడీ బోర్డు మెంబర్లు బి.ఆనందసాయి, బి.మహేందర్ రెడ్డి, టీటీడీ ఎల్.ఎ.సీ. చైర్మన్ ఎన్ శంకర్ గౌడ్, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజా గౌడ్ , జిల్లా అధికారులు, ఆలయ ఈ.వో, ఇతర అధికారులు, ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన గుండె రిధమ్‌కు నిమ్స్‌లో సంపూర్ణ చికిత్స

## త్రీడి మ్యాపింగ్‌తో ఇద్దరు రోగులకు విజయవంతమైన ఆర్‌ఎఫ్‌ఎ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 3, ప్రభాతవార్త:** తీవ్రమైన గుండె రిధమ్ లోపాలతో ప్రాణాపాయం ఎదుర్కొంటున్న ఇద్దరు యువ రోగులకు నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్యులు కొత్త జీవితం అందించారు. దాదాపు ప్రతి రెండో గుండెదడ అసాధారణంగా మారిన వెంట్రిక్యులర్ ప్రీమేచ్యూర్ కాంట్రాక్షన్స్ (వీపీసీస్) సమస్యను అత్యాధునిక త్రీడీ ఎలక్ట్రో-అనాటమికల్ మ్యాపింగ్, రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ (ఆర్‌ఎఫ్‌ఏ) సాయంతో పూర్తిగా నివారించారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం నిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో విజయవంతంగా చికిత్స నిర్వహించిన వైద్య బృందం వెల్లడించింది. ఈ ఇద్దరు రోగుల్లో 40-50 శాతం వరకు గుండె దడలు లోపభూయిష్టంగా ఉండటంతో గుండె క్రమంగా బలహీనపడిందని, దీర్ఘకాలంపాటు ఇలా కొనసాగితే గుండె కండరాలు దెబ్బతిని, వీపీసీ(ఇండ్యూస్డ్ కార్డియోమయోపతి)గా మారుతుందన్నారు. ఒక కేసులో ఐదేళ్లుగా వీపీసీలతో బాధపడుతున్న 31 ఏళ్ల యువతికి గుండె పనితీరు తీవ్రంగా తగ్గిందని, గర్భధారణ సమయంలో ఈ సమస్య ప్రాణాంతకంగా మారడంతో గర్భస్రావం చేయాల్సి వచ్చిందన్నారు. అనంతరం శాశ్వత చికిత్స కోసం ఆమె నిమ్స్‌ను



చికిత్స పొందిన రోగులతో నిమ్స్ ఆసుపత్రి వైద్య బృందం

ఆశ్రయించారన్నారు. మరోవైపు, ఆరు నెలలుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో బాధపడుతున్న 20 ఏళ్ల యువకుడికి కూడా తీవ్రమైన గుండె బలహీనతతో పాటు 40 శాతం వీపీసీ సమస్య ఉన్నట్లు నిర్ధారణైంది. అత్యాధునిక త్రీడి మ్యాపింగ్ ద్వారా గుండెలో లోపభూయిష్ట ప్రాంతాన్ని ఖచ్చితంగా గుర్తించారు. ఒక రోగిలో సమస్య రైట్ వెంట్రిక్యులర్ అవుట్‌ఫ్లో ట్రాక్ట్లో ఉండగా, మరొక రోగిలో లెఫ్ట్ కరోనా కస్ప్ వద్ద, అత్యంత కీలకమైన లెఫ్ట్ మెయిన్ కరోనా ఆర్టరీకు అతి సమీపంలో ఉన్నట్లు తేలిందన్నారు. ఈ ప్రాంతంలో అబ్లేషన్ చేయడం అత్యంత సున్నితమైన ప్రక్రియ అయినప్పటికీ, ఇక్కడ అందించిన చికిత్సతో అది విజయవంతమైం దన్నారు. సీనియర్ ప్రొఫెసర్ ఆఫ్ కార్డియాలజీ డా. ఓ సాయి సతీష్ నేతృత్వంలోని బృందం నిర్వహించిన ఈ చికిత్స అనంతరం, హోల్టర్ పరీక్షల్లో వీపీసీ భారం పూర్తిగా తగ్గిందన్నారు. త్రీడీ ఎకో పరీక్షల్లో గుండె పనితీరు గణనీయంగా మెరుగుపడిందన్నారు. ప్రస్తుతం ఇద్దరు రోగులూ లక్షణాల నుంచి పూర్తిగా ఉపశమనం పొందారన్నారు. ఈ చికిత్సలు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా అందించినట్లు వివరించారు. 2025లో నిమ్స్‌లో 111 మంది రోగులకు ఈపీఎస్, ఆర్‌ఎఫ్‌ఏ చికిత్సలు నిర్వహించామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ రంగంలో ఈ తరహా క్రియాశీల సేవలు అందిస్తున్న ఏకైక సంస్థగా నిమ్స్ గుర్తింపు పొందిందన్నారు. సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ ఆర్టీసీ, రైల్వే తదితర పథకాల ద్వారా అర్హులైన రోగులకు ఈ సేవలు ఉచితంగా అందుతున్నాయన్నారు. తరచూ వచ్చే గుండె దడలు, శ్వాస ఇబ్బంది, ఛాతీ నొప్పి, తలనిర్భంధం వంటి లక్షణాలను నిరక్ష్యం చేయరాదని వైద్యులు సూచించారు. తొందరగా వైద్య పరీక్షలు చేయించుకుంటే గుండె బలహీనతను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. సమావేశంలో చికిత్స నిర్వహించిన వైద్య బృందంలోని వైద్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ హేమంత్, డాక్టర్ సునీత, సినయర్ రెసిడెంట్స్ డాక్టర్ సాయిరాం, డాక్టర్ దీపక్‌పటేల్, సీనియర్ ఈపీ టెక్నీషియన్ ప్రమీల, నర్సింగ్ అధికారి ఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్టు పేరిట వృద్ధుడికి రూ. 7 కోట్ల టోకరా

## హైదరాబాద్‌లో సైబర్ నేరగాళ్ల భారీ మోసం

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై పోలీసులు ఎన్ని చైతన్య కార్యక్రమాలు చేస్తున్నా మోసపోతున్న వారి సంఖ్య ఆగడం లేదు. డిజిటల్ అరెస్టు అనేది లేనే లేదని పదే పదే పోలీసులు చెబుతు న్నా అమాయకులు సైబర్ నేరగాళ్లకు దాసోహమవడం సాగుతూనే వుంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో 81 ఏళ్ల ఓ వృద్ధుడి నుంచి డిజిటల్ అరెస్టు పేరిట ఏడు కోట్ల రూపాయలను కాజేశారు. వివరాలు ఇలావున్నా యి. నగరంలోని సోమాజిగూడకు చెందిన ఓ వృద్ధుడు కొంతకాలం వరకు వ్యాపారం చేసి ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. గత ఏడాది అక్టోబరు 27వ తేదీన ఆయన వాట్సాప్ నంబర్‌కు ఒక కాల్ వచ్చింది. మీరు ముంబాయి నుంచి బ్యాంకాక్‌కు చేసిన కొరియర్‌లో ఒక ల్యాప్‌టాప్‌తో పాటు మూడు కిలోల దుస్తులు, ఐదు పాస్‌పోర్టులు, కొంత డ్రగ్స్ వున్నాయని, ఇది చట్ట వ్యతిరేకమని సదరు వృద్ధుడిని ఫోన్ చేసిన వ్యక్తి బెదరగొట్టాడు. అయితే తాను ఎవరికి ఎలాంటి కొరియర్ పంపలేదని వృద్ధుడు చెప్పినా ఫోన్ చేసిన వ్యక్తి పట్టించుకోకుండా వెంటనే కాల్ డైవర్ట్‌లో వెళ్లి మరో వ్యక్తిని లైన్‌లో తీసుకున్నాడు. ఇత గాడు తనను తాను ముంబాయి పోలీసు అధికారిగా చెప్పుకుని మీరు మనీలాండరింగ్, డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్నట్లు మాకు పక్కా ఆధారాలు లభించాయి.

మిమల్ని డిజిటల్ అరెస్టు చేశాం. ఎక్కడా కదలకండి అం టూ బెదిరించి బ్యాంకు లావాదేవీలు తనిఖీ చేయాలని చెబుతూ 19.80 లక్షల రూపాయలు కాజేశాడు. దీని తరువాత అక్టోబరు 29వ తేదీన మరోసారి ఫోన్ చేసి మీ నగదు లావాదేవీల్లో ఏదో మోసం వుందని బెదిరించి ఒక లింకు పంపాడు. దీనిని ఓపెన్ చేయాలని కోరాడు. ఇది నిజమని భావించిన సదరు వృద్ధుడు లింకును ఓపెన్ చేయగానే మ్యూచువల్ ఫండ్‌లోని ఎఫ్‌డిల నుంచి ఏడు కోట్ల 12 లక్షల 80 వేల రూపాయ లను కాజేశాడు. నగదు లావాదేవీలు పరిశీలించాక ఈ నగదును తిరిగి జమాచేస్తామని ఫోన్ చేసిన వ్యక్తి చెప్పాడు. అనంతరం ఫోన్ చేసిన వ్యక్తి సెల్‌పోన్ స్విచాఫ్ చేయడంతో పాటు సిగ్నల్ యాప్‌ను తొల గించడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు దీనిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు.

# ధైర్యముంటే హైదరాబాద్ పేరు మార్చు

## సిఎం రేవంత్‌రెడ్డికి తలసాని శ్రీనివాస్ సవాల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 3:** హైదరాబాద్ మహా నగరాన్ని అడ్డగోలుగా విభజిస్తున్నారని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గూగల్ మ్యాప్ ఆధారంగా హైదరాబాద్‌ను విభజించినట్లు ఉన్నా రని ఆయన ఎద్దేవా చేశారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో కేపీ వివేకానందతో కలిసి తలసాని శనివారం మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉందని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కానీ ఎంతో చరిత్ర ఉన్న సికిందరాబాద్‌ను ఇష్టమొచ్చినట్లు విభజిస్తు న్నారని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 17వ తేదీన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఇతరత్రా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రకటించారు. మద్దతిచ్చే పార్టీలతో కలిసి నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. టెక్నికల్ స్టడీ లేకుండానే ప్రాంతాలను విభజిస్తున్నారని అన్నారు.




జంట నగరాల ఉనికి లేకుండా కుట్ర చేస్తున్నారని తలసాని ఆరోపించారు. సికింద్రాబాద్ చరిత్రను, సంస్కృతిని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధైర్యం ఉంటే హైదరాబాద్ పేరు మార్చి చూడమని సీఎం రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. మహానగర విభజన పై కాంగ్రెస్ నాయకులకు కనీసం అవగాహన లేదని తలసాని విమర్శించారు. డివిజన్లను కూడా సరిగా విభజించలేదని అన్నారు. 24 నియోజకవర్గాలు ఉన్న మహానగరాన్ని విభజిస్తున్న ప్పుడు ప్రజాప్రతినిధుల అభిప్రా యాలు తీసుకోలేదని తెలిపారు. ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం బిఆర్ఎస్ హయాంలో 150 డివిజన్లు చేశామని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహానగరాన్ని ఇష్టమొచ్చినట్లు విభజిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ పనుల కోసం ప్రజలు నగరం మొత్తం తిరిగే పరిస్థితి తీసు కొస్తున్నారని తెలిపారు. దీనిపై చట్టపరంగా, న్యాయ పరంగా పోరాడ తామని తెలిపారు. అసెంబ్లీలో కూడా ఇష్ట మొచ్చినట్లు వ్యవహరిస్తు న్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎంతోమంది ముఖ్య మంత్రులను, స్పీకర్లను చూశాం.. కానీ ఇలాంటి ముఖ్యమంత్రి, స్పీకర్‌ను చూడలేదని అన్నారు. స్పీకర్ కనీసం ప్రతిపక్ష సభ్యుల వైపు చూడటం లేదని మండిపడ్డారు. గంటన్నర పాటు రేవంత్ రెడ్డి బూతు పురాణం మాట్లాడుతున్న స్పీకర్ అడ్డు చెప్పలేదని మండిపడ్డారు.శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు కూడా వత్తాసు పలికేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

# గాడిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

## ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాత వార్త :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్రమేపీ గాడిన పడుతోందని తెలంగాణ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సం దీప్‌కుమార్ సుల్తానియా చెప్పా రు. ముఖ్యంగా రాష్ట్రంలో పన్నుల ఆదాయంలో మెరుగుదల కనిపిస్తోందన్నారు. శనివారం అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతి నిధులతో మాట్లాడుతూ పలు కీలక విషయాలు వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27కు సంబంధించిన రాష్ట్ర అం చనా బడ్జెట్ రూపకల్పనపై కసం ్తత్తు జరుగుతోందని తెలిపారు. రాష్ట్రానికి కేటాయించే నిధుల విషయంలో వచ్చే ఫిబ్రవరి తొలి రోజు కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్ కూడా చూస్తామన్నారు. కేంద్రం అమలు చేస్తున్న ప్రాయోజిత తదితర పథకాలను పూర్తి స్థాయిలో వాడుకుంటు న్నామ న్నారు. రాష్ట్రంలో వివిధ విభాగాల ద్వారా వచ్చే పన్నుల రెవెన్యూలో పెరుగుదల చోటు చేసుకుందని వెల్లడించారు. ఇందులో భాగంగా గడిచిన రెండు నెలలుగా రియల్ ఎస్టేట్ గ్రోత్ ఉందని, దాని పర్యవసానంగా రిజిస్ట్రేషన్ ద్వారా వచ్చే పన్నుల ఆదాయం పెరిగిందన్నారు. రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో పెద్ద ఎత్తున నకిలీ ఉద్యోగులు ఉన్నట్లు ఇటీవల ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ విషయంలో తాజాగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

# ఆదిలాబాద్ జిల్లా రైతుల చలో అసెంబ్లీని అడ్డుకున్న పోలీసులు

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లా రైతులు తమ ప్రాంతంలో సుధీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న చనాక కోరాట ప్రాజెక్టును వె ంటనే పూర్తి చేయాలని కోరుతూ శనివారం నాడు ఛలో అసెంబ్లీ చేబట్టారు. ఆదిలాబాద్ నుంచి 300 కిలోమీటర్లకు పైగా గల దూరాన్ని కొందరు రై తులు పాదయాత్ర చేస్తూ వారంతా హైదరాబాద్‌కు చేరుకున్నారు. మరికొందరు ఎడ్ల బండ్లపై వచ్చారు. మొత్తం మీద హైదరాబాద్‌కు వచ్చాక అంద రు రైతులు ఎడ్ల బండ్లపై అసెంబ్లీకి వచ్చేందుకు ప్రయత్నించగా నాంపల్లి, ట్యాంక్‌బండ్ ప్రాం తాలలో వారిని పోలీసులు అడ్డుకున్నారు. రైతులకు మద్దతుగా బిజెపి ఎంఎల్‌ఎ పాయల్ శంకర్ ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నడుం బిగించారు. ఈ క్రమంలో అసెంబ్లీకి స మీపంలో రైతులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. తాము అసెంబ్లీ వద్దకు వెళ్లితీరతామని రైతులు మొండికేయగా పోలీసులు ససేమిరా అ నడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ సమయంలో బిజెపి కార్యకర్తలు కూడా అక్కడికి రావడంతో ఉద్రిక్తత పెరిగింది. అయితే పోలీసులు రైతుల తో పాటు బిజెపి కార్యకర్తలను బలవంతంగా అరెస్టు చేసి సమీప పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా అరెస్టయిన రైతులు సర్కారు తీరును విమర్శించారు.ఈ విషయంలో సర్కారు వెంటనే రైతులను ఆదుకునేం దుకు ముందుకు రావాలని వారు కోరారు.

# ఆరేళ్లలో సైబర్ నేరాల్లో భారతీయులు పోగొట్టుకున్న సొమ్ము రూ.52,976 కోట్లు

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరాలు ఎంతగా పెచ్చరిల్లాయో తెలిసిందే. సైబర్ నేరాలు జరగని దేశం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ విషయంలో భారతదేశం కూడా వేల కోట్ల రూపాయల నష్టాన్ని చవిచూసింది. గడచిన ఆరేళ్ల కాలంలో సైబర్ నేరగాళ్లు భార తీయుల నుంచి అక్షరాల 52 వేల 976 కోట్ల రూపాయలను కొల్లగొట్టారు. ఇండియన్ సైబర్ కో..ఆర్డినేషన్ సెంటర్ ఈ నివేదికను వెల్లడించింది. ఈ సంస్థ వెల్లడించిన నివేదిక ప్రకారం ఒక్క 2025 ఏడాదిలోనే 19 వేల 813 కోట్ల రూపాయలను భారతీయులు సైబర్ నేరాలలో పోగొట్టుకున్నా రు. దీనికి సంబంధించి దేశ వ్యాప్తంగా 21.77 లక్షల కు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. గత ఏడాది అత్యధికంగా సైబర్ నేరాల వల్ల నష్టపోయి న రాష్ట్రాలను పరిశీలిస్తే మహారాష్ట్రలో 3203 కోట్ల రూపాయలు, కర్నాటకలో 2413 కోట్ల రూపాయలు, తమిళనాడు లో 1897 కోట్ల రూపాయ లు, ఉత్తరప్రదేశ్‌లో 1443 కోట్ల రూపాయలగా వుంది. ఇక తెలంగాణలో 1372 కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారు. దీనికి సంబంధి ంచి రాష్ట్రంలో 95 వేల ఫిర్యాదులు అం దాయి. ఇక సైబర్ నేరాలను పరిశీలిస్తే పెట్టుబడుల పథకాల (ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్) పేరుతోనే ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయి. మొత్తం నేరాల్లో 77 శాతం ఈ తరహా కేసుల్లోనే వుంది. డిజిటల్ అరెస్టు పేరుతో ఎనిమిది శాతం, క్రెడిట్ కార్డు ఫ్రాడ్స్ ద్వారా ఏడు శాతం, సెక్స్‌టార్షన్ ద్వారా నాలుగు శాతం కేసులున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. డిజిటలైజేషన్ వేగవంతం కావడం, ఆన్ లైన్ లావాదేవీలు పెరగడాన్ని సైబర్ నేరగాళ్లు తమ కు అనుకూలంగా మార్చుకున్నట్లు ఇండియన్ సైబర్ కో..ఆర్డినేషన్ సెంటర్ తన నివేదికలో వెల్ల డించింది. ఇక 2025లో నమోదైన ఫిర్యాదుల్లో 45 శాతం కాంబోడియా, మయన్మార్, లావోస్ వంటి ఆగ్నేయాసి యా దేశాల నుంచి వచ్చినట్లు తేలింది. కాగా సైబర్ నేరాల నివారణకు కేంద్రం నేషనల్ సైబర్ క్రైం పోర్టల్‌తో పాటు ఆన్‌లైన్‌లో వెంటనే ఫిర్యాదుకు 1930 అందుబాటులో తెచ్చి నా ఇవేవి నేరగాళ్ల ఆగడాలను నిలువరించలేక పోతోంది.

జిల్లాల మార్పులు అధికారికంగా అమల్లోకి గత నెలాఖరు నుంచే వచ్చాయి. జిల్లాల పునర్విభజన, రెండు కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు ప్రజలకుమరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయని సీఎం చంద్రబాబు కేబినెట్ భేటీలో స్పష్టం చేసినట్లు సమాచారం. కొత్తగా ఏర్పడిన జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు స్థానిక అభివృద్ధి, పాలనా సమన్వయానికి కీలకంగా మారనున్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర పరిపాలనా వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడం, అభివృద్ధి వికేంద్రీకరణ, పాలనా వేగం పెంచడం లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గూడురులోని మూడు మండలాలను నెల్లూరు జిల్లాలోకి తీసుకువచ్చినట్లు వివరించారు. రంపచోడవరం ప్రాంతంలో గిరిజనుల అభివృద్ధి కుటుంపడకుండా ఉండేందుకు, ఒకే పార్లమెంట్ పరిధిలో మూడు జిల్లాలు ఉన్నా కూడా ఈ జిల్లా ఏర్పాటు చేశామని వివరించారు. సామర్లకోట మండలాన్ని పెద్దాపురం నియోజకవర్గానికి మార్చినట్లు తెలిపారు. అలాగే పెనుగొండ గ్రామానికి వాసవి పెనుగొండగా పేరు మార్చినట్లు వెల్లడించారు. అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాకు మార్చినట్లు వివరించారు. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలను కలిపి మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలోకి చేర్చామని తెలిపారు. రాజంపేటను ఎప్పటి నుంచో జిల్లా కేంద్రంగా చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రజల అభిప్రాయం మేరకు కడప జిల్లాలో కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. మదనపల్లిని జిల్లాగా చేయాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ అది సాధ్యం కాలేదని, అందువల్ల రాయచోటి నుంచి మదనపల్లికి హెడ్ క్వార్టర్ మార్చి అన్నమయ్య జిల్లాగా మార్పు చేశామని వివరించారు.

# సంస్కరణల బాటలో రెవెన్యూ వ్యవస్థ

**ఘంటా విజయకుమార్**

ఏపీలో రెవెన్యూ వ్యవస్థలో వినూత్న సంస్కరణలతో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సంచలనాలు సృష్టించింది. గత ఏడాది రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసం జిల్లా పునర్విభజన జరిగింది. ఈ అంశంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వంలో పార్లమెంటు నియోజకవర్గం పరిధి హద్దుగా 26 జిల్లాలను ఏర్పాటు చేసారు. అయితే ఈజిల్లాల ఏర్పాటుపై తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రాలకు దగ్గర ఉండే మండలాలను మరో జిల్లా చేర్చిన పరిస్థితి. వీటన్నింటిని గమనించి రాష్ట్రంలో కొత్తగా అయిదు రెవెన్యూ డివిజన్లు, కొత్తగా పోలవరం, మార్కాపురం జిల్లాలు ఏర్పడ్డాయి. దీంతో జిల్లాల సంఖ్య 28కి పెరిగింది. అత్యంతరంగా పలకడానికి కష్టంగా కొన్ని గ్రామాలు, మండలాల పేర్లను మార్చారు. రవాణా సదుపాయాలు, మౌలిక వసతులను దృష్టిలో పెట్టుకుని మొత్తం 17 జిల్లాల్లో మార్పులు చేసింది. జిల్లా కేంద్రాన్ని మార్చింది. రైతాంగం గత ప్రభుత్వంలో భూముల సమగ్ర సర్వే విధానం, పాస్‌పుస్తకాలపై నాటి సీఎం చిత్రం, సరిహద్దు రాళ్లపై నాటి సీఎం బొమ్మలు వివాదానికి గురయ్యాయి. ఈ క్రమంలో ప్రభుత్వం పట్టదారు పుస్తకాలను వెనుక తీసుకుంది. రాజముద్రతో దగ్గర,దగ్గరగా 22లక్షల మందికిపైగా రైతులకు పట్టాదారు పాస్‌లు అందజేస్తుంది. ఇందుకుగాను గ్రామ సభలు నిర్వహిస్తుంది. ఈ సందర్భంలోనే రాష్ట్రంలో 22ఏ జాబితాలో ఉన్న ఐదురకాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన దస్త్రంపై ఏపీ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కీలక ప్రకటన చేసారు. నూతన సంవత్సరం కానుకగా రైతులకు, భూయాజమానులకు ఉపశమనం కల్గించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశంతో ఐదు రకాల భూములను 22ఎ జాబితా నుంచి తొలగించామని చెప్పారు. మాజీ, ప్రస్తుత సైనిక ఉద్యోగులు, స్వాతంత్ర్య సమర యోధులు, రాజకీయ బాధితులకు కేటాయించిన భూములు, 1954 జూన్ 18కు ముందు అసైన్ చేసిన భూములు, ప్రైవేట్ పట్టా భూములను 22ఎ నుంచి తొలగించినట్లు చెప్పారు. భూ కేటాయింపులు కోసం జిల్లా సైనిక సంక్షేమ అధికారి చేసిన సిఫార్సుల రిజిస్టర్ గానీ 10(1) రిజిస్టర్, అడంగల్స్, ఎస్ఎఫ్ఎ వంటి పాత రెవెన్యూ రికార్డులు, ఎసైన్‌మెంట్ రిజిస్టర్లు లేదా డిఆర్ డికెటి పట్టాల్లో ఏదైనా ఒకటి ఉన్నా 22ఎ నుంచి తొలగించాలని అధికారులకు ఆదేశాలిచ్చామని చెప్పారు. అధిక పత్రాలు కావాలంటూ భూ




యజమానులను తిప్పుకోవద్దన్నారు. కొంత భూమి కోసం ఆ సర్వే నెంబర్‌లో ఉన్న మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంటే అటువంటి భూమిని సబ్ డివిజన్ చేసి నిషేధిత జాబితాలో ఉంచుతామని తెలిపారు. షరతులు గల పట్టా భూములు, సర్వీస్ ఇనామ్ భూములు, గతంలో నిషేధిత జాబితా నుంచి తొలగించినప్పటికీ సర్వే సమయంలో మరలా 22ఎ చేర్చిన చుక్కల భూములు, రాజముద్రతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ నూతన సంవత్సర కానుక అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అసంబద్ధంగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజలకు అభద్రతను దూరం చేశామని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని అదనపు సిబ్బందిని ఈ శాఖలోకి తీసుకునేందుకు ఒక కమిటీ నియమించినట్లు తెలిపారు. రెవెన్యూ వ్యవస్థ పూర్తిస్థాయిలో ప్రజలకు అనుకూలంగా మార్చేందుకు ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నామన్నారు. నకిలీ రిజిస్ట్రేషన్లను ఏమాత్రం ఉపేక్షించబోమని, వీటిని రద్దు చేసే అధికారం జిల్లాల కలెక్టర్లకు ఇస్తున్నామని వివరించారు. గ్రామసభలు నిర్వహించి పాస్ పుస్తకాలను అందజేస్తామని ఆయన తెలిపారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న వివరాల ప్రకారమే, ఎలాంటి తప్పులు లేకుండా పాస్‌పుస్తకాల పంపిణీ జరుగుతుందని స్పష్టం చేశారు. అయితే పాస్‌పుస్తకాలు ఇచ్చేటప్పుడు రైతుల వద్ద నుంచి తప్పకుండా వేలిముద్ర తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆ పాసు పుస్తకాల్లో తప్పులు ఉంటే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికారులే స్వయంగా రైతుల ఇళ్లకు వచ్చి తప్పులు సరి చేస్తారని మంత్రి వెల్లడించారు. అన్ని జిల్లాల్లో రెవెన్యూ క్లినిక్‌లను విస్తరించి భూసమస్యలను త్వరగా పరిష్కారిస్తామని తెలిపారు. ప్రభుత్వ చర్యలవల్ల ఈసంవత్సరం భూమి నామ సంవత్సరంగా ఉంటుందని ఆయన అన్నారు. రంపచోడవరం డివిజన్‌లో రంపచోడవరం, దేవీపట్నం, వైరామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, మండలాలున్నాయి. చింతూరు రెవెన్యూ డివిజన్‌లోఎటపాక, చింతూరు, కూనవరం, వర రామచంద్రాపురం మండలాలు ఉన్నాయి. మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లా మార్కాపురం కేంద్రంగా నూతనంగా ఏర్పాటైన జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లుఉన్నాయి. మార్కాపురం డివిజన్ పరిధిలో గిద్దలూరు, బేస్త వారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు, మార్కాపురం, తర్లుపాడు, యర్రగొండపాలెం, పుల్లల చెరువు, త్రిపు రాంతకం, దోర్నాల, పెద్దారవీడు, పొదిలి, కొనకనమిట్ల మండలాలు, కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో హనుమంతుని పాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు మండలాలు ఉన్నాయి. కొత్త రెవెన్యూ డివిజనలలో అడ్డరోడ్డు జంక్షన్ (7 మండలాలు)లో యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, ఎస్ రాయవరం. అద్దంకి (10మండలాలు)లో అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడు, ముండ్ల మూరు, తాళ్లూరు, దర్శి, దొనకొండ, కురిచేడు పీలేరు, అన్న మయ్య జిల్లా (8 మండలాలు)లో సదుం, సోమల, పీలేరు, గుర్రం కొండ, కలకడ, కంభంవారిపల్లి, కలికిరి, వాల్మీకీపురం మడకశిర, సత్యసాయిజిల్లా (5మండలాలు)లో మడకశిర, గుడిబండ, రోళ్ల, అమరాపురం, అగలి బనగానపల్లి, నంద్యాల జిల్లా (5 మండలాలు)లో బనగానపల్లి, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల కొత్త మండలం ఆదోని మండలం రెండుగా విభజన ఆదోని1 (29 గ్రామాలు), ఆదోని2 (17 గ్రామాలు) అన్నమయ్య జిల్లా సర్దుబాటుల్లో రైల్వే కోడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలోకి చేరింది. కందుకూరు డివిజన్‌లోని వరికుంటపాడు, కొండాపురం మండలాలను కావలి డివిజన్‌లో కలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని 5మండలాలను బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాలోకి మార్చారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం రెవెన్యూ డివిజన్‌లోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కలిపారు. తిరుపతి జిల్లాలోని గూడూరు రెవెన్యూడివిజన్‌లో మార్పులు, చేర్పులు చేశారు. గూడూరు, చిల్లకూరు, కోట మండలాలతో కూడిన గూడూరు రెవెన్యూడివిజన్‌ను నెల్లూరు జిల్లాలో కలిపారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లోకి కలువాయి మండలాన్ని కలిపారు. నెల్లూరు డివిజన్‌లో రాపూరు, సైదాపురం మండలాలు కొనసాగనున్నాయి. సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలు కడప జిల్లాలోనే ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఆదోనిలో పరిపాలనా సౌలభ్యం కోసం మండలాల సంఖ్యను పెంచి ఆదోని-1, ఆదోని-2గా విభజించినట్లు ప్రకటించారు. రాయచోటి జిల్లాకేంద్రం అంశంపైప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. రాయచోటి నియోజకవర్గాన్ని జిల్లాస్థాయి అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి హామీఇచ్చారు. ముఖ్యంగా జిల్లాలపునర్విభజన, పరిపాలనా మార్పులు, రెవెన్యూ, పోలీస్‌వ్యవస్థల సరిపోలిక, అలాగే కొన్ని ప్రాంతాల అభివృద్ధి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. సీఎం చంద్రబాబు ఈ సమావేశంలో మంత్రులకు, ఉన్నతాధికారులకు కీలక సూచనలు చేశారు. రాష్ట్రపరిపాలన మరింత సమర్థవంతంగా ఉండాలంటే భౌగోళిక, జనాభా, పరిపాలనా అవసరాలకు అనుగుణంగా జిల్లాలనిర్మాణం ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. ●

మహారాష్ట్ర

పోరు నష్టం, పొందు లాభం.. అన్నారు. ఎన్నికల విజయమే పరమావధి అయినప్పుడు ఎలాంటి సైద్ధాంతిక అవరోధాలు ఉండవనడానికి ఇద్దరు పవార్‌ల తాజా ఎత్తుగడే ఉదాహరణ. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు కోసం థాకరే సోదరులిద్దరూ చేతులు కలుపుతున్నప్పుడు తామెందుకు దూరంగా ఉండడం అనుకున్నారో ఏమో! శరద్ పవార్, అజిత్ పవార్ కూడా ఒక్క పీటపైకి వచ్చేశారు. మహారాష్ట్ర రాజకీయాల్లో గతవారం ఇది కీలక పరిణామం. విడిపోయిన రాజకీయ కుటుంబాలు తిరిగి కలవడంలో తప్పులేకపోయినా ఎన్నికలే లక్ష్యంగా సాగడమే ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇప్పుడందరి దృష్టి ముంబయి కార్పొరేషన్ పైనే పడింది. అక్కడ పట్టు దొరికితే రాష్ట్ర రాజకీయాలను శాసించవచ్చని నాయకులు భావిస్తుండడంతో ప్రత్యర్థులు కూడా చేతులు కలిపి తమ సత్తా నిరూపించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. శివసేన ఒకవర్గం అధినేత ఉద్ధవ్ థాకరే, మహారాష్ట్ర నవ నిర్మాణ సేన అధినేత రాజ్ థాకరే రెండు వారాల క్రితం కార్పొరేషన్ ఎన్నికలకు పొత్తు కుదుర్చుకొనడంతో మిగిలిన పక్షాల్లో కూడా ఆలోచన మొదలయింది. 'కయ్యమెందుకు, కలిసి సాగుదాం' అనుకొంటూ ఒకరితో ఒకరు పొత్తులు కుదుర్చుకొంటున్నారు. అదే బాటలో ఎన్సీపి వర్గాల అధినేతలు అజిత్ పవార్, ఆయన బాబాయ్ శరద్ పవార్ జతకట్టడం తాజా విశేషం. కుటుంబ మంతా ఒక్కచోటకు చేరిందని అజిత్ పవార్ ప్రకటించడంతో ఇతర పార్టీల అధినేతలలోకూడా 'పునరేకీకరణ' ఆలోచనలు మొదలయ్యాయి. తమ గుర్తు గడియారం, శరద్‌పవార్ గుర్తు బాకా కలిసి పోయాయని అజిత్ అనడం భవిష్యత్ రాజకీయ పరిణామాలకు సూచిక అని చెప్పవచ్చు. పింప్రి చించ్వాడ్ కార్పొరేషన్ విషయంలో సీట్ల సర్దుబాటు జరిగిందనీ, పుణే, ముంబయి కార్పొరేషన్‌లకు సంబంధించి కూడా వారిద్దరి మధ్య లోపాయికారీగా ఒక అవగాహన కుదిరిందనీ తెలుస్తోంది. రాష్ట్రంలోని 29 కార్పొరేషన్లలో మెజారిటీ సంఖ్య దక్కించుకొనడానికి అటు అధికార మహా యుతితో పాటు ఇటు విపక్షాలు కూడా ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. అయితే

# మరో మలుపు!

**ఎ.వి.వి ప్రసాద్**

అధికార కూటమిలోనే ఉన్న అజిత్ ఎన్సీపి విపక్ష ఎన్సీపీతో చేతులు కలపడంతో కార్పొరేషన్ ఎన్నికలు చాలా ఆసక్తికరంగా మారాయి. 1999లో శరద్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని స్థాపించినప్పటినుంచి రాష్ట్ర రాజకీయాలలో కీలక పాత్రనే పోషిస్తోంది. అంతకు ముందు కాంగ్రెస్‌లో చక్రం తిప్పినశరద్ పవార్ సొంత పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కూడా జాతీయ రాజకీయాల్లో సైతం కీలక పాత్రనే పోషిస్తూ వచ్చారు. తర్వాత కాంగ్రెస్, బిజెపి కూడా ఆయనతో జతకట్టే ప్రయత్నాలు చేశాయి. అదే ఎన్సీపి చరిత్రను అనేక మలుపులు తిప్పింది. శరద్ సోదరుని కుమారుడైన అజిత్ పవార్ పార్టీలో సీనియర్ నాయకుడే గాక పలుమార్లు డిప్యూటీసీఎం కూడా కావడంతో ఆయన శరద్‌కు దీటుగా ఎదిగారు. 2023 జులైలో ఎన్సీపికి చెందిన పలువురు ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలు అజిత్ నాయకత్వంలో ఎన్డీయేతో చేతులు కలపడంతో ఇద్దరు పవార్‌ల మధ్య విభేదాలు తారస్థాయికి చేరి పార్టీలో చీలికకు దారితీశాయి. శరద్ పవార్ అంతకు ముందు బిజెపితో పొత్తుకు యత్నించినప్పుడు తీవ్రంగా వ్యతిరేకించిన అజిత్ తర్వాత అదే బాటపట్టడం అప్పట్లో తీవ్ర విమర్శలకు గురైంది. డిప్యూటీ సీఎం పదవి కోసమే ఆయన అలా ప్లేటు ఫిరాయించారని కూడా అప్పట్లో వినిపించింది. ఆయనకు అప్పటి లక్ష్యం (ఇప్పటికీ) ముఖ్యమంత్రి పదవి. కాంగ్రెస్, శివసేనతో పొత్తుల కారణంగా అజిత్ ఆ పదవిని సాధించలేకపోయారు. చివరికి బిజెపితో చేతులు కలిపినా మళ్లీ డిప్యూటీ సీఎం దగ్గరే ఆగిపోయారు. శరద్ కుమార్తె సుప్రియా సులే పార్టీలో కీలకం


అజిత్, శరద్

కావడాన్ని భరించలేకపోయిన అజిత్ పార్టీలో చీలిక తెచ్చినా, ఎన్డీయేలో చేరినా ఆశించిన ఫలితం దక్కకపోవడంతో ఇప్పుడు మళ్లీ శరద్‌తో చేతులు కలిపే ప్రయత్నాలు చేస్తున్నారు. కుమారునిపై గల వివిధ భూ కుంభకోణ ఆరోపణలు కూడా అజిత్‌ను ఆలోచింపజేస్తున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. కూటమిలోని షిండే శివసేన ఎన్నికలు జరిగినప్పటి నుంచీ అంటీ ముట్టనట్లుగానే ఉంటోంది. దానికి కారణం షిండేకు మళ్లీ సిఎం పదవి లభించకపోవడం. కూటమి నుంచి ఆయన బయటకు వెళ్లిపోవచ్చని అప్పుడే అంతా అనుకున్నారు కానీ ఎదురుదెబ్బలు తప్పవని గ్రహించి అలాగే కొనసాగుతున్నారు. అయితే తాజా స్థానిక ఎన్నికల్లో ఆయన వర్గానికి తక్కువ సీట్లు కేటాయించడంతో పొరుగు పార్టీల వైపు దృష్టి సారించడం ఆరంభించారు. ఇప్పుడుకార్పొరేషన్ ఎన్నికల కోసం శరద్ అజిత్ వర్గంతో చేతులు కలపడానికి షిండే నిర్ణయించడం మరో ఆసక్తికర పరిణామం. నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసినా ఆయా పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందాలు జరుగుతున్నట్లు సమాచారం. మునిసిపల్ కౌన్సిల్, పంచాయతీ ఎన్నికల్లో అధికార కూటమి ఘనవిజయం సాధించడంతో కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి బిజెపి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు వచ్చాయి. దానివల్లే షిండే, అజిత్ వర్గాలు బిజెపికి దూరమవుతున్నట్లుగా కనిపిస్తోంది. అజిత్ కుమారునిపై గల భూకుంభకోణం ఆరోపణలపై దర్యాప్తునకు ఫడ్నవీస్ ప్రభుత్వం సిద్ధం కావడం కూడా తాజా పరిణామాలకు కారణం కావచ్చు. సమీకరణాలు ఇలాగే మారితే మళ్లీ అసెంబ్లీ ఎన్నికల నాటికి చాలా రాజకీయ పరిణామాలే సంభవించవచ్చు. శివసేన వర్గాలు, ఎన్సీపి వర్గాలు, కాంగ్రెస్ తిరిగి ఏకమైతే అసెంబ్లీ ఫలితాలు కూడా తారుమారు కావొచ్చు. అయితే బిజెపి అలాంటి పరిణామాలను సాగనివ్వకపోచ్చని కూడా అంటున్నారు. ఏదిఏమైనా కార్పొరేషన్ ఎన్నికలతో మహారాష్ట్ర రాజకీయాలు కొత్త మలుపు తిరుగుతాయనే చెప్పాలి. ●

ఇరాన్

జెన్‌జడ్ ఉద్యమం ఇప్పుడు మరో దేశానికి పాకింది. మొదట శ్రీలంక, ఆ తర్వాత నేపాల్ తాజాగా బంగ్లాదేశ్ ఇప్పుడు పశ్చిమాసియా పర్షియన్‌దేశం ఇరాన్‌కు ఎగబాకింది. ఇరాన్ దేశ ప్రజలు ప్రత్యేకించి యువత ఆదేశ సుప్రీం అధినేత అయ్‌తొల్లా ఖమైనీ పేరుచెపితే చాలు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. దేశంలోని ప్రధాన నగరాల్లోకి ఎగబాకిన ఈఉద్యమం ఎటువైపు వెళుతుందోనన్న ఆందోళన పెరుగుతోంది. ఓపక్క అధికార పెద్దలు అయితే ఇదంతా అమెరికా ఎగదోస్తున్న కుట్రలని చెపుతున్నా దేశంలోని టీనేజిలోకం మొత్తం జెన్‌జడ్ ఉద్యమంవైపు పరుగులు తీసారు. అయొతొల్లాఖమైనీ శకం ముగిసిపోవాలని దేశం అభివృద్ధిలోకి రావాలని యువత కోరుతోంది. దేశంలో చమురు, సహజవాయునిల్వలు అపారంగా ఉన్నప్పటికీ అమెరికా ఆంక్షలు, యాజమాన్యలోపం, పెచ్చుమీరిన అవినీతి కారణంగా ఇప్పటికీ అల్పాదాయ దేశంగానే కొనసాగుతోంది. ద్రవ్యోల్బణం ముందెన్నడూ లేని విధంగా 42శాతానికి పెరిగింది. అంటే ఇక నిత్యావసర వస్తువులేవీ కూడా సామాన్య, మధ్య తరగతికి అందుబాటులో లేనట్లే. ఉపాధికొరవడి పేదరికం పెరిగిపోతోంది. అత్యధిక ఉన్నత విద్యావంతులున్నప్పటికీ ఆర్థికంగా ఎదిగేస్థాయి ఉన్నప్పటికీ అగ్రరాజ్యాల ఆంక్షలు ఇరాన్‌ను ఎదగనీయడంలేదన్న దుగ్ధ ఆదేశ యువతలో పేరుకుపోయింది. ఇందుకు ప్రధాన కారణం దేశంలో ఉన్న ఛాందసవాద ప్రభుత్వం మారాలనే కోరుకుంటున్నది. దేశంలోని లార్గెడాన్, కుహ్‌దష్ట్, ఇస్ఫాహన్‌లో హింస ప్రజ్వరిల్లింది. నిరసనకారులకు భద్రతా సిబ్బందికి తీవ్రస్థాయిలో జరిగిన ఘర్షణల కారణంగా పదిమందికిపైగా ఈ ఆందోళనలకు బలైపోయారు. షియామతాధికారులున్న కోమ్‌కు సైతం ఈ నిరసనలు చేరాయి. టెహ్రాన్, మషద్, ఇస్ఫహాన్, లోరెస్తాన్, ఖుజెస్తాన్ వంటి నగరాల్లో ఈ ఆందోళనలు మరింతగాపెరిగాయి. దేశంలో ఉన్న పదికిపైగా యూనివర్సిటీల విద్యార్థులు ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నారు. దేశంలో నియంతలకు మరణశిక్ష విధించాలంటూపెద్ద పెట్టున నినాదాలతో వీధుల్లో ర్యాలీకి సైతం తెగబడ్డారు. ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, అమెరికా డాలర్‌తో ఇరాన్ రియాల్ విలువలు భారీగా

# 'జెన్‌జెడ్' వణుకు

**గన్ని మోహన్**

పడిపోయాయి. ఒక డాలరు విలువ ఏకంగా 1.38 మిలియన్ రియాల్స్‌గా మారింది. మూడేళ్ల క్రితం సెంట్రల్ బ్యాంకు గవర్నర్ మహ్మద్ రెజా ఫర్జీన్ బాధ్యతలు చేపట్టినపుడు కరెన్సీ విలువ డాలరుకు 4.30లక్షల రియాల్స్‌గా ఉండేది. మూడేళ్లలోనే విలువలు మిలియన్ దాటిపోయాయి. సగటు ఉద్యోగి నెలకు 100 డాలర్లు అంటే 9 వేలు సంపాదించగలుగుతున్నారు. కేవలం నిత్యావసర సరుకుల కొనుగోలుకే సరిపోతున్నాయి. చమురు ఉత్పత్తి, విక్రయాలపై అమెరికా ఆంక్షలతో ఇప్పుడు ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ రాజీనామా కూడా చేసారు. ఆహారం, మందులు కొనలేనిపరిస్థితి. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు వంటి వాటితోప్రజలు విసిగిపోయారు. ముఖ్యంగా 1997 నుంచి 2010 మధ్య జన్మించిన జెనరేషన్ జూమర్స్‌లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. ఫలితంగానే కొత్తసంవత్సరం ముందు నుంచే ఆందోళనలు మిన్నంటాయి. దీనికితోడు గత ఏడాదిఇరాన్ ఇజ్రాయెల్ మధ్య జరిగిన యుద్ధం కూడా ఇరాన్‌కు షాక్ తగిలింది. ఇరాన్ రక్షణ వ్యవస్థ, అణుకేంద్రాలు ధ్వంసం అయ్యాయి. ఖమేనీ ఇక ఉనికిలో ఉండకూడదన్న ఇజ్రాయెల్ వ్యాఖ్యలతో ఇరాన్‌మనుగడకు సైతం గండిపడే పరిస్థితి దాపురించింది. ప్రస్తుత సుప్రీం లీడర్ ఖమేనీకి 86 ఏళ్లు. ఖమేనీ వారసుడుగా ఎవరు వస్తారన్న అంశంపైనా దేశంలో అంతర్గతపోరు సాగుతోంది. నిరసనలు తీవ్రం అయితే ఖమైనీ అధికారం నుంచి అనివార్యంగా తప్పుకుంటారని వినిపిస్తోంది. అయితే అదేమీ అంత సులువేమీ కాదని, భద్రతా సంస్థలు, మతపరమైనసంస్థల్లో ఆయనకు మంచి పట్టుఉందని అందువల్లనే ఇప్పట్లోవారసుడు అనేప్రశ్న ఉత్పన్నం కాదన్నవాదన వస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్నపరిస్థితుల దృష్ట్యా తలసరి ఆదాయం 4300 డాలర్లుగా ఉంది. పేదరికం36శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా పెరిగింది. కేవలం కొద్ది మంది చేతుల్లోనే సంపద కేంద్రీకృతమైంది. సుపరిపాలన కొరవడి, అవినీతి పెచ్చుమీరడం, వనరులు బదలాయింపు పెరిగిపోవడం వల్లనేఇరాన్ పతనం అంచున ఉన్నట్లు తెలుస్తోంది. చమురు రాబడులు సంక్షేమం కంటే ఎక్కువగా మిలిటరీ, ప్రాంతీయ కార్యకలాపాలకే కేటాయింపులు జరుగుతుండటంతో యువతలో ఆక్రోశం పెరిగిపోయింది. విద్యుత్, మంచినీటి కొరత కూడా మరో పక్క ప్రజలనుపీడిస్తోంది. మూడేళ్లక్రితంమెహాసా అమ్నిఅనే యువతి బురఖా సరిగ్గా వేసుకోలేదని మొరాలిటీ పోలీసులు కస్టడీలోకి తీసుకున్న తర్వాత ఆమె కస్టడీలోనే మరణించింది. ఆనాడే పెద్దఎత్తున నిరసనలు పెరిగాయి. ఈపరిస్థితిలోనే అమెరికా జోక్యం తప్పదంటూ అధ్యక్షుడు ట్రంప్ చేసిన హెచ్చరికలు మరింత అగ్గిరాజేస్తున్నాయి. ప్రజలను కాల్చిచంపుతుంటే ఉపేక్షించేదిలేదని అమెరికా జోక్యం అనివార్యమంటూ ట్రంప్‌చేసిన హెచ్చరికలు ఇరాన్ పాలకుల్లో ఆగ్రహం రప్పించాయి. దేనికైనా రెడీయేనని ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలన్నీ కూడా ఈ పాశ్చాత్య కుట్రలేనని ప్రత్యారోపణలు చేసారు. కేవలం 9.28 కోట్లమందికి మించిన జనాభాలేని ఇరాన్‌లో 90 శాతం షియాముస్లింలే ఉన్నారు. సున్నీముస్లింలు మైనార్టీలు, స్వల్పమోతాదులో క్రైస్తవులు, జ్యూష్ తెగలు, జోరాష్ట్రియన్లు, బహైయిస్ ఉన్నారు. అధికారం మొత్తం షియాల అధీనంలోనే ఉంది. దీనివల్లనే ఇప్పుడు గల్ఫ్‌దేశాలు కూడా ఇరాన్‌కు మద్దతిచ్చే అంశం కూడా అంటీముట్టనట్లుగా ఉన్నాయి. ఏదిఎలా ఉన్నా ఇప్పుడు ఇరాన్‌లో వెల్లువెత్తిన ఈ జెన్‌జడ్ నిరసనలు ప్రభుత్వ పతనంవైపు దారితీస్తున్నాయి. ఆ దిశగానే ఇప్పుడు పాలకుల్లోకూడా ఆందోళనలు పెరిగాయనడంలో ఎలాంటి సందేహంలేదు. ●


ఖమైనీ

# ఆరావళి ఆర్తనాదం ప్రమాదంలో పర్యావరణం


సుంకవల్లి సత్తిరాజు

మన దేశంలో ఆరావళి పర్వత పంక్తులు, పశ్చిమ కనుమలు, హిమాలయాలు పర్యావరణ, జీవవైవిధ్య పరిరక్షణలో విశేష భూమిక పోషిస్తున్నాయి. ఆరావళి పర్వత శ్రేణి సుమారు 2లేదా 3 బిలియన్ల సంవత్సరాల క్రితం ఏర్పడిన అత్యంత ప్రాచీనమైన భారతీయ సహజ సంపదగా పేర్కొంటారు. అయితే ఆరావళి పర్వత శ్రేణుల్లో ఖనిజ నిక్షేపాల కోసం తవ్వకాలు జరపడంవలన పర్యావరణం దెబ్బతింటుందనే ఆందోళన ప్రారంభమైనది. ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనాన్ని మార్చి, చట్టబద్ధత కల్పించి మైనింగ్ జరపడానికి ప్రయత్నాలు చేయడం సహించరాని విషయం. ఆరావళి పర్వత శ్రేణుల్లో ఎలాంటి తవ్వకాలు జరపకుండా, పాత తవ్వకాలతో పాటు, ఇక ముందు జరపబోయే కొత్త తవ్వకాలపై కూడా పూర్తిగా నిషేధం విధించాలి. పర్యావరణాన్ని పణంగాపెట్టి, ప్రజలకు ప్రాణసంకటంగా మారిన మైనింగ్‌కు స్వస్తిచెప్పాలి. ఈ సందర్భంగా మనం భారత దేశంలోని పర్వత శ్రేణులను, వాటి ఉపయోగాలను, పర్యావరణానికి, జీవ వ్యవస్థల రక్షణకు వాటివలన కలిగే లాభాలను కూలంకషంగా అధ్యయనం చేయాలి. భూగ్రహంపై ఏర్పడిన సహజసిద్ధమైన భౌగోళిక వ్యవస్థలు మానవ మనుగడకు, ఇతర ప్రాణుల రక్షణకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. ప్రకృతిలో ఏర్పడిన భౌగోళిక వ్యవస్థలను నాశనం చేయడం వలన అనేక విపత్కర పరిణామాలు సంభవిస్తాయి. యునెస్కో వారసత్వ సంపదగా ప్రకటించబడిన పశ్చిమ కనుమలు సుమారు లక్షా అరవై వేల చదరపు కిలోమీటర్ల మేర పలు రాష్ట్రాల గుండా విస్తరించి వాతావరణాన్ని, రుతువులను నిర్ణయించడంలో కీలక పాత్ర నిర్వహిస్తున్నాయి. పశ్చిమ కనుమలు గల కేరళలో అభివృద్ధి పేరిట జరిగిన విధ్వంసం వలన పర్యావరణం దెబ్బతిని వయనాడ్ జిల్లాఆకస్మిక వాతావరణ మార్పులతో, భారీ వర్షాలతో అతలాకుతలమైన సంగతి మన స్మృతి పథం నుండి ఇంకాచెరిగిపోలేదు. పశ్చిమ కనుమలకు సంబంధించి, పర్యావరణ పరిరక్షణకు చేపట్టవలసిన చర్యల గురించి గాడ్గిల్‌కమిటీ సిఫార్సులను పట్టించుకోకుండా, ఎకనామిక్ జోన్ల ఏర్పాటుకు, ఇసుక తవ్వకాలకు అనుమతులిచ్చిన కారణంగానే ప్రకృతి ప్రకోపించి విలయ తాండవం చేసిన వాస్తవాన్ని గమనించాలి. అలాగే హిమాలయాల్లో కూడా మానవ కార్యకలాపాల వలన, పర్యాటక ప్రాంతం పేరుతో జరుగుతున్న అటవీ నిర్మూలన, రహదారుల నిర్మాణంవలన అనేక పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. హిమాలయాలు ఎన్నో మిలియన్ల సంవత్సరాల క్రిందట సంభవించిన భౌగోళిక మార్పుల వలన ఏర్పడ్డాయి. ఇవి భారత దేశానికి శత్రుదుర్భేద్యమైన పెట్టని గోడగా "ఎబోడ్ ఆఫ్ స్నో'గా పిలవబడుతున్నాయి. వాతావరణ పరిస్థితులను నియంత్రించడంలోను, అపారమైన జల రాశులను అందించడంలోను హిమాలయాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గంగ, సింధు, బ్రహ్మపుత్ర వంటి నదుల ఉద్భవం హిమాలయాల్లోనే జరిగింది. గంగా నదికి ఉపనదియైన యమునా నదితోపాటు, సింధునదికి ఉపనదులుగా పంచనదులుగా పిలవబడే జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్‌లు కూడా హిమాలయాల్లోనే ఉద్భవించాయి. హిమాలయాల వలన బయోడైవర్సిటీ, పర్యావరణం పరిరక్షించబడుతున్నాయి. ఇప్పుడు ఆరావళి పర్వత శ్రేణులు వార్తా పత్రికల్లో పతాక శీర్షికలకెక్కడం గమనార్హం. 670 కి.మీ పొడువునా విస్తరించిన ఆరావళి పర్వత శ్రేణులు హస్తినలో ఆరంభమై, హర్యానా రాజస్థాన్ ల మీదుగా గుజరాత్ వరకు విస్తరించి అహ్మదాబాద్‌లో పరిసమాప్తమోతాయి. రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత శ్రేణుల్లోని పలు కోటలు విశేష ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యునెస్కో గుర్తింపు పొందిన రాజస్థాన్ హిల్ ఫోర్ట్స్ వారసత్వ సంపదగా విరాజిల్లుతున్నాయి. భారత దేశంలో రుతుపవనాలకు, వర్షాలకు అనుకూలత గల పర్వత శ్రేణులున్నాయి. ఇవి విభిన్నమైన భౌగోళిక స్వరూపాలతో సహజసిద్ధంగా ఏర్పడ్డాయి. ఎన్నో పర్వత శ్రేణులు భౌగోళిక, సాం



స్కృతిక, జీవవైవిధ్య ప్రాధాన్యతను కలిగి అంతర్జాతీయ వారసత్వ గుర్తింపును పొందాయి. ఆరావళి పర్వత శ్రేణులు, హిమాలయాలు, పశ్చిమ కనుమలు మొదలైనవి జీవ వైవిధ్యాన్ని కాపాడుతున్నాయి. ప్రపంచంలో పురాతన పర్వత శ్రేణులుగా ప్రసిద్ధిగాంచిన ఆరావళి పర్వత పంక్తులు జీవ వైవిధ్య రక్షణకు అనుకూలంగా ఉన్నాయి. గాలిలో నాణ్యత లోపించి, నరకప్రాయంగా మారిన ఢిల్లీ వాసులకు ఆరావళి పర్వత శ్రేణి వరప్రదాయినిగా పని చేస్తూ, పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తున్న విషయం విదితమే. ఆరావళి 'గ్రీన్ షీల్డ్ ఆఫ్ నార్త్ ఇండియా' గాను, 'గ్రీన్ బ్యాక్ బోన్' గాను పేరొందింది. రాజస్థాన్‌లోని ఎడారి నుండి వచ్చే ఇసుక మేఘాలు ఢిల్లీని కమ్మేయడం వలన అనేక అవస్థలు పడుతున్న నేపథ్యంలో ఆరావళి మైనింగ్ జరిగితేజరగనున్న నష్టాలను అంచనా వేయలేము. థార్ ఎడారి లోని ఇసుక తూర్పు వైపు పయనించకుండా అడ్డుకుంటూ, నగరాలను, వ్యవసాయ భూములను ఎడారులు కాకుండా ఆరావళి పర్వతశ్రేణులు కాపాడుతున్నాయి. ఆరావళి తవ్వకాల వలన పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందనే నిపుణుల వాదన వాస్తవం. పర్యావరణానికి పెట్టని గోడలా, మానవాళికి రక్షణ కవచంగా ఉన్న ప్రాచీనకాలం నాటిఆరావళి పర్వత శ్రేణుల్లో మైనింగ్ కోసం జరుగుతున్న చర్యలను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలుపుదల చేయడం, ఇంతకు ముందు తానిచ్చిన ఉత్తర్వులను, మార్గదర్శకాలను నిలుపుదల చేయడం పర్యావరణ ప్రేమికులకు దక్కిన తాత్కాలిక ఉపశమనంగా భావించాలి. ఆరావళి పర్వత శ్రేణులపై మైనింగ్‌కు అనుకూలంగా ప్రయత్నాలు చేస్తూ ప్రాచీన ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం మార్చడం, 100 మీటర్ల కంటే ఎత్తులో ఉన్న వాటినే ఆరావళి పర్వత శ్రేణులుగా నిర్వచిస్తూ, అంతకంటే తక్కువ ఎత్తులో ఉన్న పర్వతాలను మైనింగ్ రూపంలో విధ్వంసం చేసే చర్యలకు పూనుకోవడం పర్యావరణానికి పెను విఘాతం. సుప్రీం కోర్టు ఇందుకు తొలుత అంగీకరించినా, తిరిగి తన ఉత్తర్వులను రద్దు చేసి పునర్విచారణ చేపట్టాలని నిర్ణయించడం సమంజసం. పూర్తి స్థాయిలో ఆరావళిపై సుప్రీం తీర్పు వచ్చేవరకు పర్యావరణ ప్రేమికులు అప్రమత్తంగా ఉండాలి. అడవులను నరికివేయడం చూస్తున్నాం. దీని పరిణామాలను అనుభవిస్తున్నాం. ఇప్పుడు పర్వత శ్రేణులపై దాడికి ఉపక్రమించడం అనుచితం. వర్తమాన ప్రపంచంలో అనునిత్యం భూమిపై దాడి కొనసాగుతున్నది. పర్యావరణ సమస్యల వలన వేలాది జంతువులు, వృక్ష జాతులు అంతరిస్తున్న జాబితాలో ఉన్నాయి. ఎన్నో రకాల కీటకాలు, పక్షులు, వృక్షజాతులు అధికశాతం అంతరించిపోయే దశలో ఉన్నాయి. జీవులన్నీ ప్రకృతిలో మనతోపాటు జీవించే అవకాశాన్ని మనమే లేకుండా చేస్తున్నాం. జీవవైవిధ్యం మానవాళి మనుగడకు అవసరం. జీవ సమతుల్యత లోపిస్తే జరగబోయే పరిణామాలు మానవ వినాశనానికి దోహదం చేస్తాయి. 'ప్రకృతి' ఈ సమస్త సృష్టికి నిండైన అందాన్ని సమకూర్చిపెట్టింది. ఇలాంటి ప్రకృతిలో మానవులతోపాటు జంతుజాలం, వృక్షజాలం, క్రిమికీటకాలు, భౌతిక, రసాయనిక పదార్థాలు నిండి ఉన్నాయి. అరణ్యాలు, నదీనదాలు, పర్వతాలు, లోయలు, ఇతర అనేకమైన ఏర్పాట్లు సహజ సిద్ధంగా నెలకొని ఉన్నాయి. భూవాతావరణాన్ని నాశనం చేసి, కోట్లాది జీవరాశులను ప్రాణ సంకటంలోకి నెట్టడంలో గల ఔచిత్యమేమిటో అర్థంకావడం లేదు. జీవవైవిధ్యం దెబ్బతినడంతో ప్రకృతిలో అనేకఅవాంఛనీయ మార్పులు సంభవిస్తున్నాయి. మానవాళికి పలురకాలుగా ఉపయోగపడే జీవసంపద మానవ స్వార్థచింతన వలన నశించిపోయింది. ఒకవైపు ప్రకృతి విధ్వంసం వలన భూవాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కాలుష్యకారకాలు పెరిగిపోయాయి. పర్యావరణం దెబ్బతిన్నది. మనతో కలిసి జీవిస్తున్న జీవరాశులెన్నో ప్రకృతిలో చోటు చేసుకుంటున్న విపరీతమైన పోకడలకు నిలవలేక ఇప్పటికే అదృశ్యమైపోయాయి. ప్రస్తుత పర్యావరణ సమస్యలకు మూలకారణాన్ని అన్వేషించి, కాలుష్యభరిత వాతావరణంనుండి మానవాళిని కాపాడాలి. ప్రపంచ వ్యాప్తంగా భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తున్న వైరస్‌లు ముమ్ముందు మరింత విజృంభించవచ్చు. సకలజీవరాశుల ఉనికిని భూమండలంపై సుస్థిరం చేయడానికి ప్రయత్నాలు జరగాలి. ఈఅంశాలను పరిగణనలోకి తీసుకుని పర్వత పంక్తులను కాపాడాలి. భవిష్యత్తులో ఆరావళి పర్వత శ్రేణిలో మైనింగ్‌జరపకుండా పటిష్టమైనచట్టాలు తీసుకురావాలి. ●

# పేలుళ్లతో దద్దరిల్లిన వెనిజులా

## ఎమర్జెన్సీ విధింపు

**కారకాస్, జనవరి 3:** వెనుజులా బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరిట అగ్రరాజ్యం అమెరికా ఈ దాడులకు దిగింది. రాజధాని కరాకస్‌లో శనివారం తెల్లవారుజామున ఏడు చోట్ల భారీ పేలుళ్లు సంభవించాయి. దీంతో దేశంలో అత్యయిక పరిస్థితి విధించాల్సిన పరస్థితి తలెత్తింది. ట్రంప్ ఆదేశాలతోనే తమ సైన్యం ఈ దాడులు చేస్తోం దని అమెరికా ధ్రువీకరించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సైనిక స్థావరాలు, పౌర నివాసాలే లక్ష్యంగా అమెరికా శనివారం దాడులకు పాల్పడినట్లు వెనుజులా వెల్లడించింది. దీంతో సైనిక స్థావరాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపింది. దాడులు జరిగిన ప్రదేశాల్లో పరిస్థితిని సమీక్షించడానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. ఈ దాడులతో దేశంలో జాతీయ అత్యయిక పరిస్థితి విధిస్తున్నట్లు ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురో ప్రకటించారు. ఈ దాడులకు వ్యతిరేకంగా వీధుల్లోకి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**అమెరికన్ ఎయిర్‌లైన్లకు నోటమ్**

ఈ దాడులకు ముందు అమెరికా విమానయాన సంస్థలకు యు ఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ నోటమ్ జారీ చేసింది. అమెరికా విమానాలు వెనుజులా గగనతలాన్ని వినియోగించొద్దని హెచ్చరించింది. తాజా పరిణామాలపై కొలంబియా ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనుజులా ముఠాల నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. ఈ ముఠాలతో వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ఆరోపిస్తుండడంతో అక్కడి ప్రభుత్వాన్ని కూల్చడానికి ట్రంప్‌కార్యవర్గం ప్రణాళికలు రచిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ఇప్పటికే కరేబియన్ సముద్రంలో అమెరికా భారీగా బలగాలు, యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించింది.





**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనిచేశాడు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి కోసం అవసరమైతే వెనిజులాపై సైనిక చర్యకు దిగుతామని ప్రకటించినట్లుగా దాడికి పాల్పడింది. వెనిజులా రాజధాని కరాకస్‌పై వైమానిక దాడులకు పాల్పడింది. దేశ వ్యాప్తంగా సైనిక స్థావరాలు లక్ష్యంగా విరుచుకుపడింది. అంతేగాక వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను, అతని భార్యను అమెరికా సైన్యం అదుపులోకి తీసుకుని తమ దేశానికి తరలించింది. ఈ విషయాన్ని యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ ధ్రువీకరించారు. మదురో తమ అదుపులో ఉన్నందున ఇక సైనిక దాడులు చేయబోమని స్పష్టం చేశారు. అంతకు ముందు అమెరికా వైమానిక దాడుల నేపథ్యంలో వెనిజులా ప్రభుత్వం దేశంలో అత్యయిక పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించింది. చమురు నిల్వల కోసమే దాడి చేశారని ఆరోపణలు గుప్పించింది. మదురోను అమెరికా సైన్యం బందీగా పట్టుకోవడంపై వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆధారాలు ఇవ్వాలని అమెరికాకు విజ్ఞప్తి చేశారు. అటు రష్యా, అమెరికా చర్యను తీవ్రంగా తప్పుపట్టింది. ఇది సైనిక దురాక్రమణేనని ఆరోపించింది.**

**వెనుజులా అధ్యక్షుడు మదురో మా కస్టడీలోనే: ట్రంప్:** అమెరికా-వెనుజులా మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. యుఎస్ సైన్యం శనివారం తెల్లవారుజామున వెనుజులా రాజధాని కరాకస్‌పై భీకరదాడులు జరిపిన సంగతి తెలిసిందే. వాటిని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ధ్రువీకరించారు. అలాగే ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి తమ కస్టడీలో ఉన్నారని వెల్లడించారు. వారిద్దరిని వెనుజులా వెలుపలకు తరలించినట్లు వెల్లడించారు. దీనిపై అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 11 గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నామని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పోస్టు చేశారు. అమెరికా సైన్యానికి చెందిన డెల్టా ఫోర్స్ ఈ ఆపరేషన్‌లో భాగమైంది.

**ఆధారాలు ఇవ్వండి : ఉపాధ్యక్షురాలు**

తమ అధ్యక్షుడిని అమెరికా కస్టడీలోకి తీసుకోవడంపై వెనుజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ స్పందించారు. మదురో, ఆయన సతీమణి ఇప్పుడు ఎక్కడున్నారో తమకు తెలియనదని చెప్పారు. వారు సజీవంగా ఉన్నారని తెలియజేసేలా ఆధారాలు ఇవ్వాలని అమెరికాను డిమాండ్ చేశారు. 1989 తర్వాత ఒక లాటిన్ అమెరికన్ దేశంలో అమెరికా నేరుగా జోక్యం చేసుకోవడం ఇదే తొలిసారి. ఈ పరిణామాల వేళ వెనుజులా పక్క దేశమైన కొలంబియా అప్రమత్తమైంది. ఆ దేశ సరిహద్దుల్లో బలగాలను మోహరించింది.

**ఇక సైనిక దాడులు చేయబోం: అమెరికా**

మదురో అమెరికా కస్టడీకి చిక్కడంతో వెనుజులాలో తమ సైనిక చర్య పూర్తయిందని యుఎస్ సెనెటర్ మైక్ లీ వెల్లడించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోను ఉటంకిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరిట అమెరికా ఈ దాడులు చేసిన సంగతి తెలిసిందే. అయితే తమ చమురు కోసమే అమెరికా దాడులు చేయనుందని గతంలో వెనుజులా ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా గతంలోనే తాను దేశాన్ని వీడేందుకు సిద్ధమని మదురో చెప్పినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి. తాను, తనకుటుంబంతో సహా దేశాన్ని వీడేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే తనకు, తన కుటుంబానికి ఆంక్షల నుంచి పూర్తి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారని వారి సారాంశం. యుఎస్ విధించిన అన్ని ఆంక్షలను ఎత్తివేయడంతో పాటు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి తాను ఎదుర్కొంటున్న కేసులను మూసివేయడం వంటి వాటి గురించి వాషింగ్టన్ వద్ద ప్రస్తావించినట్లు వెల్లడించాయి.



## బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్య

**ఢాకా,జనవరి 3:** బంగ్లాదేశ్‌లోని షరియత్‌పూర్ జిల్లా, క్యూర్‌బంగా బజార్‌లో మరో హిందూ వ్యక్తిపై దాడిచేసి హత్యచేసారు. రానురాను బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీలపై దాడులు పెచ్చుమీరుతున్నాయి. సజీవదహనం చేయాలనిచూస్తే నిప్పంటుకున్న ఈ వ్యాపారి తప్పించుకుని చెరువులో దూకాడు. ఫార్మసీ నిర్వహిస్తున్న హిందూ వ్యాపారి ఖోకన్ చంద్ర దాస్, ఢాకాలోని నేషనల్ బర్న్ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించారు. ఖోకన్ చంద్ర దాస్‌పై కొందరు దుండగులు దాడి చేసి నిప్పంటించగా, వారి నుంచి తప్పించుకునేందుకు ఆయన చెరువులో దూకారు. పోలీసులు, స్థానికులు ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు. చంద్రదాస్ క్యూర్‌బంగా బజార్‌లో ఔషధాలు, మొబైల్ బ్యాంకింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. దుకాణం మూసి ఆటోలో ఇంటికి వెళుతుండగా, మార్గ మధ్యంలో కొందరు దుండగులు ఆటోను ఆపి, పదునైన ఆయుధాలతో ఆయనపై దాడి చేశారు. అనంతరం ఆయన తలపై పెట్రోల్ పోసి నిప్పంటించగా, వారి నుంచి తప్పించుకునేందుకు ఖోకన్ రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దూకారు. స్థానికులు ఆయనను కాపాడి ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో హిందువులపై హత్యాకాండా సాగుతోంది. ఇటీవల దీపూ చంద్ర దాస్ హత్య జరిగింది. ఆ తర్వాత సామ్రాట్ అనే వ్యక్తి గ్రామస్థుల మూకదాడిలో మృతి చెందాడు. అనంతరం బజేంద్ర బిశ్వాస్ అనే మరో వ్యక్తిని సహోద్యోగి కాల్చి చంపాడు. ఆ తర్వాత ఖోకన్‌పై దాడి జరిగింది.

## కెనడాలో వలసదారులకు 'వర్క్ పర్మిట్ల' ముప్పు
### సగం మంది భారతీయులే



**ఒట్టావా, జనవరి 3:** కెనడాలో లక్షల మంది వలసదారులు 'వర్క్ పర్మిట్ల' ముప్పును ఎదుర్కొంటున్నారు. 2025 డిసెంబరుతో దాదాపు 10లక్షల మంది పర్మిట్ల కాలపరిమితి తీరిపోగా 2026లో మరో 9లక్షల మందికి ఆ గడువు ముగియనుంది. దీంతో చట్టబద్ధత కలిగిన పత్రాలులేకుండా ఆ దేశంలో నివసించే వారి సంఖ్య అమాంతం పెరిగిపోయింది. వీరిలో సగం మంది భారతీయులే ఉన్నా రని తెలుస్తోంది. ఇమిగ్రేషన్, రిఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సిసి) డేటా ఆధారంగా ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. దీని వల్ల వలసదారులు మరో వీసా పొందలేరు లేదా, శాశ్వత నివాసం పొందేవరకైనా చట్టబద్ధంగా నివాసం ఉండే హోదానైనా పొందలేరు లేదా, శాశ్వత నివాసం పొందేవరకైనా చట్టబద్ధంగా నివాసం ఉండే హోదానైనా కోల్పోతారు. వలసలకు సంబంధించిన నిబంధనలను కెనడా కఠినతరం చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో వీసా గానీ, శాశ్వత నివాసం పొందడం గానీ అంత సులభమేమీ కాదని తెలుస్తోంది.

## మెక్సికోలో భారీ భూకంపం: రెక్టార్ స్కేల్‌పై 6.5గా నమోదు

**మెక్సికో సిటీ, జనవరి 3:** మెక్సికోను భూకంపం వణికించింది. దక్షిణ-మధ్య మెక్సికో ప్రాంతాల్లో 6.5 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. గెరెరో రాష్ట్రంలోని శాన్‌మార్కోస్‌కు సమీపంలోని అకాపుల్కో నగరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దాదాపు 35 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీని వల్ల ఏకంగా 33 సెకండ్లపాటు భూమి కంపించింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. 50వరకు ఇళ్ల వరకు ధ్వంసమయ్యాయి. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం.. ఉదయం 8 గంటల సమయంలో అకాపుల్కో సమీపంలో భూకంపం సంభవించింది. ఈ భూప్రకంపనలు ఉత్తర దిశగా సుమారు 400 కిమీ దూరంలో ఉన్న మెక్సికో సిటీ వరకు వ్యాపించింది. భూకంపం హెచ్చరికల సైరన్లు మోగడంతో లక్షలాది మంది ప్రజలు ఇళ్లు, ఆఫీసులనుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. మెక్సికో సిటీలో జనాలు బయటకు పరుగులు తీస్తున్న క్రమంలో ఓ అపార్టుమెంట్‌లోని రెండో అంతస్తు నుంచి పడి 60 యేళ్ల వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో 12 మంది గాయపడ్డారని నగర మేయర్ క్లారా బ్రుగాడా తెలిపారు. అలాగే భూకంప కేంద్రానికి సమీపంలోని ఓ గ్రామంలో ఇల్లు కూలడంతో 50 యేళ్ల మహిళ మృతి చెందిందని గెరెరో గరవ్నర్ ఎవలిన్ సాల్గోడో పేర్కొన్నారు.

## సంక్షిప్తంగా..

### సైబర్‌నేరాల్లో అగ్రస్థానం మహారాష్ట్రదే..



**న్యూఢిల్లీ, జనవరి 3:** దేశంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు ప్రమాదకర స్థాయిలో కొనసా గుతున్నాయి.గడచిన ఆరేళ్లలో వివిధ రకాల మోసాల బారిన పడి భారతీయులు ఏకంగా రూ.52,976 కోట్లకు పైగా నష్టపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ నివేదిక ప్రకారం, ఒక్క 2025లోనే దేశవ్యాప్తంగా రూ.19,813 కోట్ల నష్టం వాటిల్లగా, 21.77 లక్షలకు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. గతేడాది అత్యధికంగా నష్టపోయిన రాష్ట్రాల జాబితాలో మహారాష్ట్ర రూ.3,203 కోట్లు అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక రూ.2,413 కోట్లు, తమిళనాడు రూ.1,897 కోట్లు, ఉత్తరప్రదేశ్ రూ.1,443 కోట్లు నిలిచాయి. ఈ జాబితాలో తెలంగాణ ఐదో స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

### దేశంలో పెరిగిపోతున్న వైట్‌కాలర్ ఉగ్రవాదం: రాజ్‌నాథ్‌సింగ్



**భోపాల్, జనవరి 3:** దేశంలో వైట్ కాలర్ ఉగ్రవాదం ఆందోళనకరంగా పెరుగుతోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. విలువలు లేని ఉన్నత విద్య సమాజానికి ప్రమాదకరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య అనేది వృత్తిపరమైన విజయం మాత్రమేకాదని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్ భోపాల్‌లోని నోబుల్స్ విశ్వవిద్యాలయం 104వ వ్యవస్థాపక దినోత్సవంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనను ప్రస్తావించారు.

### అద్దె ఇంట్లో ఉన్న బాలికపై ఇద్దరు లైంగిక దాడి




**లక్నో, జనవరి 3:** అద్దె ఇంట్లో నివసిస్తున్న ఇద్దరు వ్యక్తులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్ప డ్డారు. ఆ తర్వాత ఆమెను టెర్రస్ పైనుంచి కిందకు తోసేశారు. ఆ బాలిక ప్రమాదవశాత్తు కిందపడి మరణించినట్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సికంద్రాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలోని అద్దె ఇంట్లో రాజు, వీరు కశ్యప్ అనే ఇద్దరు వ్యక్తులు నివసిస్తున్నారు.ఈనెల 2న అదే బిల్డింగ్‌లోని వేరే పోర్షన్‌లో నివసించే ఆరేళ్ల బాలిక టెర్రస్‌పై ఆడుకుంటున్నది. ఇది గమనించిన ఆ వ్యక్తులు ఆ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత టెర్రస్ పైనుంచి ఆమెను కిందకు తోసేశారు. తీవ్రంగా గాయపడిన ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలికను ఆమె తల్లిండ్రులు గుర్తించారు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ చిన్నారి మరణించినట్లు డాక్టర్లు తెలిపారు.

### ప్రసవంకోసం ఆరు కిలోమీటర్లు నడిచివెళ్లిన గర్భిణి మృతి



**ముంబై, జనవరి 3:** మారుమూల గ్రామంలో ఎలాంటి వైద్య సదుపాలు లేకపోవడంతో నిండు గర్భిణీ పెద్ద సాహసం చేసింది. ప్రసవం కోసం భర్తతో కలిసి ఆరు కిలోమీటర్ల దూరం నడిచింది. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆమె మరణించింది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఈ విషాద సంఘటన జరిగింది. ఆల్దండి తోలా గ్రామానికి చెందిన 24 ఏళ్ల ఆషా సంతోష్ కిరంగ తొమ్మిది నెలల గర్భవతి. ఆ గ్రామంలో డెలివరీ సౌకర్యాలు లేవు. ఆ గ్రామం నుంచి ప్రధాన రహదారికి ఎలాంటి రోడ్డు మార్గం కూడా లేదు. ఈ పరిస్థితుల్లో నిండు గర్భిణీ అయిన ఆషా పెద్ద సాహసం చేసింది. ప్రసవం కోసం పెథాలోని తన సోదరి ఇంటికి బయలుదేరింది. ఈనెల 1న భర్తతో కలిసి అటవీ దారిలో ఆరు కిలోమీటర్ల దూరం నడిచింది. పెథాలోని సోదరి ఇంటికి చేరేసరికి ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించింది.

### నిజమే.. మా అబ్బాయి వివాహనిశ్చితార్థం జరిగింది: ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ, జనవరి 3:** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నట్లు గత కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ప్రియాంక, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా కుమారుడు రేహాన్ వాద్రా త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలపై ప్రియాంక గాంధీ స్పందించారు. మీడియాలో వస్తున్న వార్తలను ధృవీకరించారు. ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. రేహాన్‌కు తన చిన్ననాటి స్నేహితురాలు అవీవా బేగ్ తో ఎంగేజ్మెంట్ జరిగినట్లు ప్రకటించారు.



## బీహార్‌లో రూ.20వేలకే అమ్మాయిలు పెళ్లికి రెడీ
### ఉత్తరాఖండ్ మంత్రి భర్త వివాదాస్పద వ్యాఖ్యలు

**డెహ్రాడూన్:** బీహార్‌లో రూ.20,000కే అమ్మాయిలు పెళ్లికి అందుబాటులో ఉన్నారని ఉత్తరాఖండ్‌కు చెందిన మహిళా మంత్రి భర్తచేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. ఆయన చేసిన వ్యాఖ్యల విడియో క్లిప్ వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో విమర్శలు వెల్లువెత్తాయి. ఉత్తరాఖండ్‌కు చెందిన బీజేపీ మంత్రి రేఖా ఆర్య ఆ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రి. ఆమె భర్త గిరిధారి లాల్ సాహు, అల్మోరాలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. మీరు వృద్ధాప్యంలో పెళ్లి చేసుకుంటారా మీరు పెళ్లి చేసుకోలేకపోతే మీ కోసం బీహార్ నుంచి అమ్మాయిని తీసుకువస్తాం. రూ.20,000 నుంచి రూ.25,000కే అక్కడి నుంచి అమ్మాయిలను తెచ్చుకోవచ్చు అని అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో మహిళా, శిశు సంక్షేమ మంత్రి రేఖా ఆర్య భర్త గిరిధారి లాల్ సాహు వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. దేశంలోని మహిళలను ఆయన అవమానించారని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ విమర్శించింది. అధికార బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. మరో వైపు బీహార్ మహిళా కమిషన్ కూడా దీనిపై స్పందించింది. ఆ రాష్ట్ర అమ్మాయిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గిరిధారి లాల్ సాహుకు నోటీస్ జారీ చేస్తామని పేర్కొంది. అయితే ఆయన వ్యాఖ్యలతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని బీజేపీ తెలిపింది.

## బిజెపిని చూసి ఆర్‌ఎస్‌ఎస్‌ను అర్ధంచేసుకోవాలనుకోడం పొరపాటే
### ఆర్‌ఎస్‌ఎస్-చీఫ్ మోహన్ భగవత్



**భోపాల్,జనవరి 3:** యూనిఫాం, శారీరక వ్యాయామాలు ఉన్నప్పటికీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) పారామిలటరీ సంస్థ కాదని, బీజేపీని చూసి ఆర్‌ఎస్‌ఎస్‌ను అర్థం చేసుకోవాలనుకుంటే అది పెద్ద పొరపాటని ఆ సంస్థ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. సమాజాన్ని ఏకం చేయడం, భారతదేశం మరోసారి విదేశీ శక్తుల గుప్పిట్లోకి వెళ్లకుండా అవసరమైన లక్షణాలు, సద్గుణాలను నింపడానికి ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తుందని భోపాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన తెలిపారు. మేము యూనిఫాం ధరిస్తాం. కవాతులు, కర్రలతో ఎక్సర్‌సైజులు చేస్తాం. ఇది చూసి మమ్మల్ని ఎవరైనా పారామిలటరీ సంస్థ అనుకుంటే పొరపడినట్టే. సంఘ్ ఒక విలక్షణ సంస్థ. సంఘ్‌ను అర్థం చేసుకోవడం కష్టం అని భగవత్ అన్నారు. జన్‌సంఘ్, దాని నుంచి వచ్చిన బీజేపీకి ఆర్‌ఎస్‌ఎస్ మాతృసంస్థనే విస్తృతాభిప్రాయం ఉందని, అయితే అవి సంఘ్ కు వ్యతిరేకంగా అల్లుకున్న కథనాలేనని అన్నారు. ఇవాళ ప్రజలు సరైన సమాచారం కోసం లోతుగా వెళ్లడం లేదని, మూలాలకు వెళ్లరని, వికీపీడియాకు వెళ్తుంటారని, అయితే అక్కడి సమాచారం అంతా నిజం కాదని పేర్కొన్నారు. ఎవరైతే సంఘ్ గురించి విశ్వసనీయ వనరుల నుంచి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తారో వారికే సంఘ్ గురించి తెలుస్తుందని అన్నారు. ఇలాంటి అపోహల రీత్యా ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర, మిషన్ గురించి వివరించాల్సిన అవసరం ఏర్పడిందని సంఘ్ శాతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న భగవత్ తెలిపారు. స్వయం సేవకులకు సంఘ్ తీర్చిదిద్దుతుందని, భారతదేశ పరమ వైభవం కోసం పనిచేసేందుకు విలువలు, ఆలోచన, లక్ష్యాలను పెంపొందిస్తుందని, రిమోట్ ద్వారా నియంత్రించదని భగవత్ వివరించారు. దేశభక్తి వాతావరణాన్ని నిర్మించే కార్మికులను సృష్టించడానికి సంఘ్ తన శాఖల ద్వారా పనిచేస్తుందన్నారు. సంఘ్ అనేది ఒక ప్రతిచర్యగా పుట్టిందనే సాధారణ భావన ఉందని, అయితే అది నిజం కాదని చెప్పారు. సంఘ్ దేనికీ ప్రతిచర్య, వ్యతిరేకం కాదని, సంఘ్ ఎవరితోనూ పోటీ పడటం లేదని అన్నారు. దేశంపై మొదటగా దండెత్తిన వాళ్లు బ్రిటిషర్లు కాదని, భారతీయుల కంటే తక్కువ స్థాయిలో ఉన్న కొందరు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మనలను ఓడించారని చెప్పారు. ఇది ఏడుసార్లు జరిగిందని, ఎనిమిదవ ఆక్రమణదారులు ఆంగ్లేయులని వివరించారు. అలాంటప్పుడు స్వాతంత్ర్యానికి హామీ ఏమిటి ఇది పదే పదే ఎందుకు జరుగుతోందో మనం ఆలోచించాలని భగవత్ సూచించారు. మనను మనం అర్థం చేసుకుని స్వార్థానికి అతీతంగా ఎదగాలని, సద్గుణాలతో సమాజం ఏకతాటిపై నిలిస్తే దేశానికి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. రాజకీయ బానిసత్వానికి తెరపడినా, మానసిక బానిసత్వం కొంతవరకూ కొనసాగుతోందన్నారు. దానికి చరమగీతం పాడాలన్నారు. స్వదేశీ అంటే ప్రపంచంతో వాణిజ్యాన్ని తగ్గించుకోవడం కాదని, భారతదేశంలో తయారుకాని మందులు వంటి ముఖ్యమైన వస్తువులను మాత్రమే దిగుమతి చేసుకోవాలని అన్నారు. వాణిజ్యం అనేది ఒత్తిడి, సుంకాల భయంతో జరక్కూడదని, సొంత నిబంధనల ప్రకారమే జరగాలని సూచించారు. సంఘ్ ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని, సంఘ్ ఎప్పుడూ బయట నుంచి వచ్చే నిధులు, విరాళాలపై ఆధారపడదని భగవత్ చెప్పారు. సంఘ్‌ను బాగా అర్థం చేసుకోవాలకుంటే సంఘ్ శాఖలకు రావాలని కోరారు. చక్కెర రుచి గురించి తాను రెండు గంటల పాటు వివరించినా ఒక టీ స్పూన్ చక్కర తాగితేనే అర్థమవుతుందని, అదేవిధంగా శాఖలకు వస్తేనే సంఘ్ గురించి అర్థమవుతుందని చెప్పారు.



## విజయ్ స్నేహ 'హస్తం'

**చెన్నై, జనవరి 3:** తమిళ స్టార్ హీరో విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఈ ఏడాది జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై జోరుగా అంచనాలున్నాయి. పొత్తులతోవెలుతుందా లేక ఒంటరిగా పోటీచేస్తుందా లేక మరో పార్టీతో పొత్తు పెట్టుకుంటుందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం టీవీకే కాంగ్రెస్ పార్టీతో పొత్తు కోసం ప్రయత్నిస్తున్నట్లు ప్రచారంలోకి వచ్చింది. దీనిపై టీవీకే జాతీయ ప్రతినిధి గెరాల్డ్ కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీకే, కాంగ్రెస్ సహజ భాగస్వాములు అని చెప్పారు. రెండు పార్టీలు లౌకిక వాదానికి కట్టుబడి ఉన్నాయని,మత తత్వానికి వ్యతిరేకమని తెలిపారు. అందుకే రెండు పార్టీలు సహజ భాగస్వాములని, తమ అధినేత విజయ్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంచి మిత్రులని కూడా గెరాల్డ్ అన్నారు. అయితే, రెండు పార్టీలు కలిసి పనిచేసే విషయంలో కొన్ని సమస్యలున్నాయని, ముఖ్యంగా తమిళనాడు కాంగ్రెస్ విభాగంతో ఉన్న సమస్యల్ని పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు. భవిష్యత్ లో టీవీకే, కాంగ్రెస్ కలిసి పనిచేయొచ్చు. అయితే, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై టీవీకేతో చర్చించేందుకు అడ్డు పడుతుండొచ్చు అని గెరాల్డ్ అభిప్రాయపడ్డారు. కాగా, రెండు పార్టీల పొత్తు గురించి ఇటీవల ప్రచారం జరుగుతోంది. గత నెలలో జరిగిన టీవీకే సమావేశానికి కొందరు కాంగ్రెస్ నేతలు కూడా హాజరవ్వడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చినట్లైంది. ఒకవేళ టీవీకే, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకు చీలకుండా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు టీవీకేతో పొత్తు కోసం తమిళనాడులోని ఏఐఏడీఎంకే పార్టీ కూడా ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.



## రాజస్థాన్ స్కూళ్లలో దినపత్రికల పఠనం తప్పనిసరి

**జైపూర్, జనవరి 3:** ఉత్తరప్రదేశ్ దారిలోనే రాజస్థాన్ ప్రభుత్వంకూడా పాఠశాల విద్యార్థులకు దినపత్రికల పఠనం తప్పనిసరిచేసింది. అన్ని ప్రభుత్వ పాఠశాల్లలో రోజూ వార్తా పత్రిక చదవడం తప్పనిసరి చేసింది. ప్రభుత్వ సెకండరీ పాఠశాలలు, ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు కనీసం రెండు వార్తాపత్రికలు తీసుకోవాలని తెలిపింది. అందులో ఒక హిందీ, ఒక ఇంగ్లీష్ పేపర్ల తప్పనిసరిగా సభ్యత్వం ఉండాలని తెలిపింది. విద్యార్థులలో పఠన అలవాట్లను ప్రోత్సహించడానికి, పదజాలాన్ని మెరుగుపరచడానికి, సాధారణ అంశాలపై అవగాహనను పెంపొందించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రాజస్థాన్ విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం విద్యార్థులు ఉదయం అసెంబ్లీలో కనీసం 10 నిమిషాలు వార్తాపత్రికలు చదవాలి.

## యెమెన్‌పై సౌదీ వైమానిక దాడులు
### తీవ్రంగా ప్రతిఘటించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్
### దాడుల్లో 20 మంది వేర్పాటు వాదుల మృతి



**సనా,జనవరి 3:** గల్ఫ్‌లోని రెండు బలమైన దేశాల మధ్య ఇపుడు అంతర్గత పోరు ముదిరిపోయింది. గల్ఫ్‌సభ్యదేశం యెమెన్‌లోని కొన్ని ప్రత్యేకప్రాంతాలపై సౌదీ అరేబియా దాడులుచేయడంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తీవ్రంగా ప్రతిఘటించింది. యెమెన్‌లో చాలా కాలంగా కొనసాగుతున్న వివాదం మరోసారి హింసాత్మక మలుపు తిరిగింది. సౌదీ అరేబియా నేతృత్వంలోని సైనిక సంకీర్ణం సేనలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మద్దతు ఉన్న సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ (ఎస్టీసీ)స్థానాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు ప్రారంభించాయి. ఈ దాడుల్లో కనీసం 20మంది వేర్పాటువాద యోధులు మరణించినట్లు నిర్ధారించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇటీవల యెమెన్‌లో తన సైనిక ఉనికిని ముగించినట్లు ప్రకటించిన సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వైమానిక దాడులు హద్రామోత్ ప్రావిన్స్‌లోని సెయున్, అల్‌ఖాషా ప్రాంతాలలోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడులు ఒక సైనిక స్థావరం, విమానాశ్రయాన్ని కూడా లక్ష్యంగా జరిగాయి. దీంతో ఆ ప్రాంతంలో వైమానిక రాకపోకలు స్తంభించిపోయాయి. అనేక గంటల పాటు ఏ విమానమూ ఎగురలేకపోయింది. దీని వల్ల పౌరులలో భయాందోళనలు నెలకొన్నాయి. మరణించిన వారందరూ ఈ సైనిక స్థావరాలలో ఉన్న తమ యోధులని సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ అధికారులు తెలిపారు. ఈ వైమానిక దాడులకు ముందు, యుఎఇ యెమెన్ నుండి తన చివరి సైనిక దళాలను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించాలని అబుదాబి స్పష్టం చేసింది. ముకల్లా ఓడరేవుపై దాడికి సంబంధించి కూడా వివాదం తలెత్తింది. అక్కడ ఆయుధాల రవాణా లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. యుఎఇ ఈ ఆరోపణలను ఖండించింది. ఇది కేవలం వాహనాల రవాణా మాత్రమే అని పేర్కొంది. సౌదీ మద్దతుగల దళాలు నమ్మక ద్రోహం చేశాయని సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ నాయకులు ఆరోపించారు. సైనిక స్థావరాలను శాంతియుతంగా తమ ఆధీనంలోకి తీసుకుంటామని తాము హామీ ఇచ్చామని, కానీ వెంటనే వైమానిక దాడులు జరిగాయని వారు చెబుతున్నారు. సదరన్ ట్రాన్సిషనల్‌కౌన్సిల్ ఎస్టీసీ ప్రతినిధి ఈ పరిస్థితిని మనుగడ కోసం పోరాటంగా అభివర్ణించారు.

# టిపిఎస్ నియామకాల క్రమబద్ధీకరణ సవరణ బిల్లులు ఆమోదం

## ప్రభుత్వ బిల్లు ప్రవేశపెట్టిన ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

## అందెశ్రీ కుమారుడికి ఉద్యోగం ఇస్తూ అసెంబ్లీలో బిల్లు



**హైదరాబాద్, జనవరి 3,ప్రభాతవార్త:** జయ జయహే తెలంగాణ గీతంతో మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన అందెశ్రీని గౌరవించుకోవడమంటే మన యావత్ తెలంగాణ జాతిని మనకు మనంగా గౌరవించుకోవడమే అని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. ప్రభుత్వం ప్రముఖ కవి అందెశ్రీ కుటుంబానికి అండగా ఉండేందుకు ఆయన కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించడానికి వీలుగా 1994 ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, వేతన నిర్మాణ చట్టసవరణ బిల్లును శాసనసభలో శనివారం భట్టివిక్రమార్క ప్రవేశపెట్టారు. అందెశ్రీ కుమారుడికి ఉద్యోగం కల్పించడానికి చట్టపరమైన మద్దతు అవసరమని అందుకే అసెంబ్లీలో ఆమోదించామని తెలిపారు. ఈ క్రమంలో 1994 పబ్లిక్ సర్వీస్ కమిషన్ చట్టంలోని నిబంధనలు సవరించాల్సి ఉందని తెలిపారు. అందెశ్రీ కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించడం కోసం చేసిన సవరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టామని వెల్లడించారు. 1994 చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం 7991 మంది తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశామని తెలిపారు. అందులో కొందరు ఉద్యోగులు కోర్టుకు వెళ్లి గతం నుంచి రెగ్యులరైజ్ చేయాలని ఆర్డర్ తెచ్చారని ప్రస్తావించారు మల్లు భట్టి విక్రమార్క. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు 573/225, 1.1.1995కి ఇది విరుద్ధమని చెప్పుకొచ్చారు. వెనుక తేదీ నుంచి రెగ్యులరైజ్ చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై రూ.20వేల కోట్ల అదనపు భారం పడుతుందని వివరించారు. ఏపీలో ఇలాంటి సమస్య వచ్చినప్పుడు ప్రాస్పెక్టివ్‌గా చట్ట సవరణ చేశారని గుర్తుచేశారు.

తెలంగాణ ప్రభుత్వం 25నవంబరు,2025న ప్రాస్పెక్టివ్ రెగ్యులరైజేషన్ కోసం ఆర్డినెన్స్ 88 తెచ్చిందని తెలిపారు. ఈ ఆర్డినెన్సును బిల్ నంబర్ 7ద్వారా సభ ఆమోదం కోరుతున్నామని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. అందెశ్రీ సేవల్ల జయ జయహే తెలంగాణ గీతం ద్వారా రాష్ట్ర ప్రజలను ఏకం చేయడంలో ప్రభుత్వం గుర్తించింది, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయి ంచిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. అందెశ్రీగా పిలవబడే అందే ఎల్లయ్య తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా రేపర్తి గ్రామంలో అనాధ అయిన అందెశ్రీ పశువుల కాపరిగా ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకొని గీత రచయితగా ఎదిగారు అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఎటువంటి సాధికారత విద్య లేకున్నా తెలంగాణ గ్రామీణ మరియు అనగారిన వర్గాలను ప్రతిబింబించేలా ఆయన 3 వేల కవితలు రచించారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆశలు, పోరాటాలు వాటి స్ఫూర్తిని తెలియజేస్తూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రచించిన జయ జయహే తెలంగాణ గీతం రాష్ట్ర ప్రజలను ఏకం చేయడంలో ప్రముఖ పాత్ర వహించిందని తెలిపారు. అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా చేయాలని 2 జూన్ 24 న 783 జీవో ద్వారా ఆమోదించిందని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి వారు అందించిన అమూల్యమైన సేవలను దృష్టిలో పెట్టుకొని వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. వారి అకాల మరణంతో నష్టపోయిన వారి కుటుంబం సామాజికంగా, ఆర్థికంగా ఎదుర్కొనే సవాళ్లపై సకాలంలో మానవీయ దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాజిక న్యాయ సూత్రాలు, పరిపాలన సంబంధమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉందని వివరించారు. ఈ చర్య తెలంగాణ ఐక్యత, పురోగతికి తన జీవితాన్ని అంకితం చేసి సాంస్కృతికి ప్రతీకగా నిలిచిన అందెశ్రీని గుర్తించి గౌరవించి ప్రభుత్వం కుటుంబానికి హామీ ఇస్తుందని తెలిపారు. మానవత్వంతో ఈ ప్రభుత్వం అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం బాధ్యతగా భావించి వారి కుమారుడు దత్త సాయి కి ఉన్నత విద్యా శాఖలో డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా నియమించినట్టు తెలిపారు తెలిపారు. గద్దర్ అన్న తన జీవితాంతం ఆడి పాడి ప్రత్యేక రాష్ట్ర సాధనకు కృషి చేశారు రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత నాటి సీఎంను కలవడానికి గంటల తరబడి ఎండలో నిలబడితే గద్దర్ అన్నకు గత ప్రభుత్వం అవకాశం కల్పించలేదు ఈ ప్రభుత్వం వచ్చాక వారిని ఏ విధంగా గౌరవించుకుందో తెలంగాణ సమాజానికి తెలియంది కాదు అన్నారు. గతంలో సినిమా ఇండస్ట్రీ లో ఇస్తున్న నంది అవార్డు స్థానంలో గద్దర్ అవార్డ్స్ గా నామకరణం చేశాం, ఉద్యమ సమయంలో సేవలు అందించిన పాశం యాదగిరి, జయరాజు, గూడ అంజన్న, గోరటి వెంకన్న లాంటి వారిని సాంస్కృతిక శాఖ ద్వారా గుర్తించాం, వారి ఆటపాటల ద్వారా తెలంగాణ ప్రజల కోరికలను తెలియజేశారు అని తెలిపారు.

## ఊపర్ షేర్వానీ.. అందర్ పరేషానీలా

# విబి జిరాం జి చట్టం

### ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును కొనసాగించాలి

### చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలి

### తీర్మానం చేసిన శాసనమండలి

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ గ్యారంటీ యాక్ట్‌గా కొనసాగుతున్న చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని.. ఇందులో ఎటువంటి మార్పులు చేయరాదని.. కొత్తగా తీసుకురావాలని భావిస్తున్న జిరాంజి చట్టం ఊపర్ షేర్వానీ..అందర్ పరేషానీ లాగుందని తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఉపాధి హామీ చట్టంను మారుస్తూ చేసిన చట్టాన్ని వ్యతిరేకిస్తూ.. చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని పేర్కొంటూ శాసనమండలిలో శనివారం జరిగిన స్వల్పకాలిక చర్చ అనంతరం సభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ముఖ్యమంత్రి తరపున పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క శాసనమండలిలో స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. అనంతరం సభలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి పేదల పట్ల ప్రేమ ఉంటే బడ్జెట్ పెంచాలని, 10 దినాలు పెంచాలన్నారు. కొత్త చట్టం వల్ల పేదల బతుకులు చిత్రమైపోతాయి.. తిరిగి తక్కువ కూలి ఇచ్చే ఫ్యూడల్ వ్యవస్థ పురుడు పోసుకుంటుందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు చీప్ లేబర్‌ను సప్లై చేసేందుకే ఉపాధి చట్టాన్ని కేంద్రం రద్దు చేసిందని. ఉపాధి హామీ పనుల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని సులభతరమైన పనులు చేసే వెసులుబాటు ఉపాధి పనుల్లో ఉంటుంది కాబట్టి మహిళలు ఉపాధి పనుల్లో ఎక్కువగా వస్తున్నారని అన్నారు. కూలీలకు కనీస వేతనం, మహిళలకు ఆత్మగౌరవం కల్పించిన ఉపాధి చట్టాన్ని కొనసాగించాలని బిజెపి సభ్యులు బయటకు ఈ విషయాన్ని చెప్పలేకపోయినా.. అంతర్గతంగానైనా బిజెపి పెద్దలకు ఉపాధి చట్టాన్ని కొనసాగించాలని చెప్పాలన్నారు. గ్రామాలు పట్టణ స్వరూపాన్ని సంతరించుకున్నప్పుడు అర్బన్ సెంటర్లుగా మారుతున్నాయని, పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి చట్టాన్ని అమలు చేస్తామని బిజెపి హామీ ఇచ్చింది.. ఆ హామీని నిలబెట్టుకోవాలి వికసిత్త భారత్ పేరుతో పేదల జీవితాలను విధ్వంసం చేస్తున్నారని, ఉపాధి చట్టాన్ని బలహీనపరచడం వల్ల వికసిత్ భారత్ సాధ్యపడదన్నారు. జిరాంజి చట్టం ఊపర్ షేర్వానీ..అందర్ పరేషానీ లాగుందని.. జాతిపిత మాత్మ గాంధీని ద్వేషించాల్సిన అవసరం బిజెపికి ఎందుకని మంత్రి సీతక్క ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకానికి మాహాత్మ గాంధీ పేరును కొనసాగించాలని ఆదివాసి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున విధ్వంసం జరుగుతుందని, అక్కడ పనులు చేయడానికి కూలీలు లేరన్నారు. అందుకే చీప్ లేబర్లను సప్లై చేసేఎందుకు ఉపాధి చట్టాన్ని రద్దు చేశారని.. పేదలు సామాన్యులు మహిళలు అనగారిన వర్గాల సంక్షేమం కోసం ఉపాధి హామీ చట్టాన్ని యధావిధంగా కొనసాగించాలని ఈ సభ తీర్మానిస్తుందని ప్రకటించారు. తీర్మానం ఆమోదం పొందిన వెంటనే శాసనమండలిని సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.

## సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తగ్గడంపై

## సిఎం రేవంత్‌రెడ్డి తీవ్రఅసహనం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 3:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మూడోరోజు ప్రశాంతంగానే జరిగాయి. శనివారం ఉదయం 10 గంటలకు సభప్రారంభమైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభదృష్టికి తీసుకొచ్చారు. అనంతరం శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ప్రజెంటేషన్ జరుగుతున్న సమయంలో సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సరైన సంఖ్యలో లేకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజెంటేషన్ సమయంలో కొందరు ఎమ్మెల్యేలు సభలో లేకుండా లాబీల్లో తిరగడాన్ని సీఎం తీవ్రంగా తప్పుపట్టారు. ఇది మంచి పద్ధతి కాదని వ్యాఖ్యానించిన సీఎం, వెంటనే అందరినీ సభలోకి పిలిపించాలని ప్రభుత్వ విప్‌లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో విప్‌లు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేలకు ఫోన్ కాల్స్ చేసి సభలోకి రావాలని సూచించారు. ఆ తరువాత ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలు హాల్లోకి చేరుకున్నారు. శాసనసభ కార్యకలాపాల పట్ల సభ్యులు బాధ్య తాయుతంగా వ్యవహరించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు సమాచారం.

### అసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యేల గాఢనిద్ర

తెలంగాణ అసెంబ్లీలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. శనివారం కృష్ణా నదీ జలాలపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఓవైపు అత్యంత కీలకమైన పిపిటీ జరుగుతుంటే మరోవైపు బిజెపి ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్‌బాబు, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పవర్ రామారావు పటేల్ గాఢ నిద్రలోకి జారుకున్నారు. అసెంబ్లీ సమావేశాలను లైవ్ చూసిన అందరూ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసున్నారు. ప్రజా సమస్యలు ప్రస్తావించాల్సిన చట్ట సభల్లో నిద్రపోవడం ఏమిటని నెటిజన్లు వ్యాఖ్యలు చేశారు.

## అసెంబ్లీని రేవంత్ ప్యాలెస్‌లా నడిపిస్తున్నారు..

### స్పీకర్‌పై గంగుల కమలాకర్ ఫైర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 2:** ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇన్ని అవమానాలు ఎదుర్కోలేదని, కిరణ్‌కుమార్ రెడ్డి అప్పట్లో స్పీకర్‌గా ఉండే అని.. ఆ తర్వాత మనోహర్ అయ్యారని.. అయినా ఉద్యమ సమయంలో ఇలాంటి అవమానాలు జరగలేదని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న సభ్యులు అందరికీ సమాన హక్కులు ఉంటాయని అప్పటి స్పీకర్ మనోహర్ తమకు సమయం ఇచ్చేవారని గుర్తుచేశారు. కానీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ తీరు బాధాకరమని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలా నిర్బంధం చేయలేదని.. మా గొంతు నొక్కలేదని గంగుల కమలాకర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాలిపోయిన మోటార్లు, ఎండిపోయిన పంటలను అసెంబ్లీకి తీసుకొనిపోయామని గుర్తుచేశారు. పక్షపాత వైఖరితో ఉండకండి అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు హితవు పలికారు. మీ వ్యవహార శైలిని మార్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రికి ఎలాంటి హక్కు ఉంటుందో అందే అందరు సభ్యులకు ఉంటుందని తెలిపారు. మా హక్కుల కోసమే మాట్లాడామని చెప్పారు. నిన్న అసెంబ్లీలో గిల్లికజ్జాలు పెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చూశాడని గంగుల కమలాకర్ అన్నారు. మమ్మల్ని తిట్టేందుకే సభకు వచ్చాడని, కడుపునిండా తిట్టి వెళ్లాడని విమర్శించారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వమని చెప్పడమేంటని స్పీకర్‌పై గంగుల కమలాకర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రికి మేం భజన చేయాలా అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ హుందాగా నడిచిందని తెలిపారు. గత స్పీకర్ ప్రతిపక్షాలకు తగినంత సమయం ఇచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుత స్పీకర్ బీఆర్ఎస్ సభ్యుల గొంత నొక్కేందుకు పనిచేస్తున్నారని విమర్శించారు.

## సంక్రాంతి నుంచి వ్యవసాయ యాంత్రిక పనిముట్లు పంపిణీ

### వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి కేంద్రీకరించాలి

### 21వేల కోట్ల పంటరుణం మాఫీ

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, జనవరి 3,పభాతవార్త:** సంక్రాంతి పండుగ దినంన ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ యాంత్రిక పనిముట్లు పంపిణీ చేయబోతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. శనివారం వ్యవసాయం రంగంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానిమిస్తూ గత ప్రభుత్వం కారాణంగా వ్యవసాయ రంగంలో ఆగిన పథకాలను పునరుద్దరణ చేపడుతున్నామని చెప్పారు. కాటన్‌యాప్ కారణంగా పత్తి కొనుగోళ్ళు ఇబ్బంది కలుగుతోందని ఐతే అక్కడే ఒక వ్యవసాయాధికారిని నియమించి ఎక్కువ దిగుబడి జరిగిన రైతుకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్‌లో 3లక్షల మెట్రిక్ టన్నుల సోయా దిగుబడి కాగా కేంద్రం 70వేల మె.ట మాత్రేమ కొనుగోలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. సోయా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసినా, కేంద్రం కొనడం లేదని అన్నారు. ఈ విషయంపై బిజెపి రాష్ట్ర నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని మంత్రి సూచించారు. 21వేల కోట్లు పంటరుణాలు మాఫీ చేశామని చెప్పారు. వరిపంటకు ప్రత్యామ్నాయంగా పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలని కోరారు. మూడుసార్లురైతు భరోసా ఇచ్చామని అన్నారు.

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పండే సోయా పంటలో 28శాతం తన నియోజక వర్గంలో పండుతోందని ఏదైనా సోయా ఆధారిత పరిశ్రమ పెట్టాలని రైతు నుంచి సేకరణ చేయడం సాధ్యమవుతోందని అన్నారు. బాలునాయక్ పత్తి కొనుగోలు యాప్ రైతులను ఇబ్బందిపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమిటోగ్రఫీతో భూసారపరీక్షలు చేసి సాయిల్‌హెల్త్ కార్డులు అందజేయాలని పటోళ్ళ సంజీవరెడ్డి సూచించారు. అగ్రికల్చర్ టూరిజం పెంచాలని స్కూల్ విద్య నుంచే వ్యవసాయంపై శాస్త్రీయ విద్యావిధానం నేర్పాలని సూచించారు. వెటర్నీ డాక్టర్ల కొరత కూడా సంజీవరెడ్డి వివరించారు. గ్రామీణులను ఏ గ్రామాలకు ఆగ్రామాలుగా ప్రాతిపదికన నియామకం చేయాలని లేకపోతే వీళ్ళంతా వచ్చి పట్టణాలలో చేరుతున్నారని తెలిపారు.

## జనాభాతో దక్షిణాదిపై ఉత్తరాది రాజకీయ ఆధిపత్యం

### జనాభా నియంత్రణకు స్వీయనియంత్రణ అవసరం

### పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 21 సవరిస్తూ మంత్రి సీతక్క బిల్లు

### వ్యతిరేకించిన బిజెపి.. మద్దతు తెలిపిన సిపిఐ కూనంనేని సాంబశివరావు



**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** దక్షిణభారత ప్రజలు ముఖ్యంగా మహిళలు విద్యావంతులై చైతన్యంతో జనాభా నియంత్రణ చేయడం పొరుగున ఉన్న ఉత్తరాధిలో జనాభా నియంత్రణ లేక పోవడంతో రాజకీయ ఆధిపత్యం ఉత్తరాది నుంచి పెరిగిపోతుండటంతో జానాభా విధానంపై పునరాలోచన చేయాల్సి న పరిస్థితి ఏర్పడిందని పంచాయతీరాజ్ మంత్రి సీతక్క అలియాస్ డి అనుసూయ అన్నారు. పంచాయతీరాజ్ మంత్రి దనసరి అనుసూయ 2026తెలంగాణ బిల్లును సభ ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గరిష్ఠ సంతానంపై ఒక హద్దు కూడా ఉండాలని జనాభా పెరుగుదల వల్ల కలిగే సమస్యలను కూడా వివరించారు. ప్రస్తుతం 1.7 జనాభా పెరుగుదలశాతం ఉందని అయితే యువత కనుమరుగవడంతో దీనిని 2.8కు తీసుకొని రావాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలో ఇద్దరు పిల్లలు ఉంటేనే స్థానిక సంస్థల ఎన్నికలో పోటికి అనర్హులనే నియమం వల్ల పల్లెలో కూడా కుటుంబ నియంత్రణ పాటిస్తున్నారని అందుకే పంచాయతీరాజ్‌చట్టం సవరణ చేశామనితెలిపారు. మారుతున్న కాలానికి, రాష్ట్ర అభివృద్ధి పరిణామాలకు అనుగుణంగా జనాభా పెరుగుదల రేటును సమతుల్యం చేసుకోవాల్సి న అవసరం ఉందని స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలోనే ఈ నిబంధన తొలగింపును రాజకీయ పక్షాలతో పాటు సాధారణ ప్రజలు కూడా స్వాగతించారని ఆమె గుర్తు చేశారు. జనాభా పెరుడదల పడిపోతే వృద్ధుల సంఖ్యకూడా పెరుగుతోందని దీనితో జనాభాలో ఉండాల్సి అన్ని వయస్సు ల వారి అభిషాణీయమైన గుణం తగ్గిపోతుందని అన్నారు. జనాభా విషయంలో చైనా గతంలో ఎక్కువ నియంత్రణ పాటించి ఇప్పుడు ఇబ్బంది పడుతోందని తెలిపారు. గతంలో ఈ నిబంధనపై ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయగా, ఇప్పుడు దానికి చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేశారు. పంచాయతీరాజ్ చట్టంలోని 21వ సెక్షన్ ను సవరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ శనివారం అధికారికంగా ఆమోదం తెలిపింది. మొత్తంగా నాలుగు బిల్లులు సభలో ఆమోదం పొందాయి. కామారెడ్డి ఎమ్మెల్యే కెవి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఈ బిల్లును తిరస్కరించారు. కేవలం రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని బిల్లు చేయడం వల్ల ప్రకృతి వనరులపై కూడా ఇది ప్రభావం చూపుతోందని వారు ఆరోపించారు. జనాభా నియంత్రలో రాజకీయాలు తగదని వారు పేర్కొన్నారు. సిపిఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జనాభా మనదేశంలో ఒక విధంగా మంచే చేస్తోందని అత్యధిక మానవ వనరులు ఉండటంతో ప్రపంచం మనవైపు చూస్తోందని అన్నారు. ప్రజల్లో జనాభా నియంత్రణ చైతన్యం రావడంతో అనేక ఇళ్ళలలో పిల్ల సంఖ్య తగ్గింది జనాభా నియంత్రణ విషయంలో దక్షిణాధి రాష్ట్రాలు సఫలమైనా ఉత్తరాధిలో విఫలమైనారు దీనితో రాజకీయంగాకూడా అక్కడ ఎక్కువ లాభం పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా జనాభా పెంచాలని అంటున్నారని జనాభా విషయంలో మనం కూడా ఆదిశగా ఆలోచించాలని అన్నారు. పంచాయతీరాజ్ చట్టం సవరణ తో చదువుకొన్న వాళ్ళేకాకుండా చుదువులేని వాళ్ళుకూడా స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యం వహించేందుకు వీలవుతోందని గ్రామాల అభివృద్ధికి అందరి ఆలోచనలు అవసరం అన్నారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్




## ప్రజలకు క్షమాపణ చెప్పి కెసిఆర్ అసెంబ్లీలో చర్చకు రావాలి

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** కృష్ణా జలాలపై దమ్మూ, ధైర్యం ఉంటే అసెంబ్లీలో సమావేశం పెట్టమన్నారు కేసీఆర్. సమావేశం పెడితే, కేవలం సం తకం పెట్టీ రెండు నిమిషాల్లో వెళ్లిపోయారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ "అసెంబ్లీకి కెసిఆర్ రాకపోతే బిఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందని సాక్షాస్తూ కెసిఆర్ కూతురు కవిత చెబుతోంది. చేసిన తప్పులు, అవినీతి ఎక్కడ బయటపడుతాయో అని కెసిఆర్ జంకుతున్నారు. ప్రజలు అందరూ కేసీఆర్ చేతలతో ఆశ్చర్యపోతున్నారు. నిన్న మాట్లాడానికి సమయం ఇచ్చినా కావాలనే గొడవ చేసి హరీష్‌రావు వాకౌట్ చేశారు. బిఆర్ఎస్ భవన్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పెడుతున్నారు? కాంగ్రెస్ అడిగే ప్రశ్నలకు, కవిత అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి తోకముడిచి పారిపోయారు. కుటుంబ కథా చిత్రాన్ని రక్తి కట్టిస్తున్నారు.

కవిత మేము అడిగిన ప్రతి ప్రశ్నలకు అవినీతి జరిగింది వాస్తవం అని స్వయంగా చెపుతున్నారు. స్వయంగా కేసీఆర్ కూతురు కవిత కేసీఆర్ కృష్ణా జలాలపై అసెంబ్లీకి చర్చకు రాకపోతే వారి పార్టీని దేవుడు కూడా కాపాడలేదని అంటున్నది. ప్రజలకు క్షమాపణ చెప్పి కేసీఆర్ అసెంబ్లీలో చర్చకు రావాలి. అధికారంలో ఉంటేనే కేసీఆర్ సభకు వస్తారా"? అన్నారు. 'ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఉపాధి హామీ పథకంపై మాట్లాడాల్సి వస్తుందనే బిఆర్ఎస్ నేతలు వాకౌట్ చేశారు. మహాత్మా గాంధీ పేరు పథకం నుండి తొలగించ వచ్చు కానీ ప్రజల గుండెల్లో నుండి తీసివేయలేరు! భవిష్యత్తులో ఇండియన్ కరెన్సీపై ఉన్న మహాత్మా గాంధీ ఫోటో కూడా తొలగిస్తారేమో అని అనిపిస్తున్నది. ఉపాధి హామీ పథకం పేరులో గాంధీ పేరును యధాతథంగా కొనసాగించాలి. గాంధీ కుటుంబపై విష ప్రచారం బీజేపీ నేతలు మానుకోవాలి' అన అన్నారు.

### దోచుకొని తోకముడుచుకొని పారిపోయారు: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య




ప్రతిపక్ష నాయకులు తప్పులు బయట పడతాయని వాకౌట్ చేయడం దుర్మార్గమని ప్రభుత్వ విఫ్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ "అన్ని దోచుకొని తోక ముడుచుకొని పారి పోయారు. మాట్లాడడానికి సమయం ఇవ్వాలి బి.ఏ.సి సమావేశంలో అని అడిగి, తప్పులు బయట పడతాయని వాకౌట్ చేశారు. మూసి పునర్జీవనం చేద్దామని మంచి నిర్ణయం తీసుకుంటే చర్చకురారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చి, నిధులకు తూట్లు పొడుస్తుంటే కేంద్రంతో ఉన్న దోస్తానాతో బి.ఆర్.ఎస్ చర్చలో పాల్గొనలేదు. కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితం అయ్యారు. ఆరు అడుగుల ఆజానుబాహుడు వాకౌట్ చేస్తున్నారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం కేంద్రం చేస్తున్నది. కేంద్రం చేస్తున్న నష్టం బి.ఆర్.ఎస్ పార్టీకి కనిపించడం లేదా? గాంధీ కుటుంబం పేరు చెపితే మోడీకి వణుకు పడుతున్నది. కమిషన్ల కక్కృత్తితో పాలమూరు రంగారెడ్డి ఎండబెట్టారు" అని విమర్శించారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

### పెండింగ్ బిల్లులు రూ.661 కోట్లు చెల్లించాం

### 133 కాలనీల్లో నిరుపయోగ ఇళ్ల మరమ్మతుకు రూ.744 కోట్లు వ్యయం

### ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** డబుల్ బెడ్ ఇళ్లు అంటూ ఆర్భాటంగా ప్రచారం చేస్తూగత ప్రభు త్వం ని ర్మాణం మాత్రమే చేసింది కానీ అర్హులైన లబ్దిదారులకు వాటిని అందించకపోగా, కాంట్రాక్టర్లకు, ఇతర సంస్థలకు బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో మా ప్రభుత్వం వచ్చాక 2బిహెచ్‌కె సంబంధించి 204కోట్ల పెండింగ్‌బిల్లులు మూడులక్షల స్కీమ్‌కు చెందిన పెండింగ్ బిల్లులు రూ.457 కోట్లు వెరశిరూ.661 కోట్లు చెల్లించామని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం అసెంబ్లీలో 133కాలనీలలో 36వేల ఇండ్లు నిర్మించి సరైన మౌళిక వసుతులు కల్పించకపోగా వాటిని లబ్దిదారులకు పంపిణీ చేయకపోవడంతో శిథిలమైనాయనీ దీనితో ఉపముఖ్యమంత్రిని ఒప్పించి రూ.744కోట్లు మంజూరు చేయించి వాటిని మరమ్మతు చేసి లబ్ధి దారులకు పంపిణీ చేశామనితెలిపారు. మూడులక్షల రూపాయల నిర్మాణ వ్యయంతో చేపట్టిన 13లక్షల ఇళ్ళ విషయంలో కూడా పెండింగ్ లు చెల్లించి లబ్దిదారులకు ఎంపిక చేస్తున్నామని వివరించారు. ఇంకా 14కాలనీలలలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయినీ వాటిలో 52వేల ఇళ్ళను పంపిణీచేసి ఆ తరువాత మరమ్మతులు చేపడుతామని యుద్ధప్రాతిపదికన ఈ కార్యక్రమం జరుగుతోందని ఆయన సభకు తెలిపారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని వచ్చే మార్చి ఏప్రిల్లో రాష్ట్రంలో మరోవిడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. గతంలో మాదిరిగా ఎన్నికలప్పుడే హామీలు అమలు కాకుండా మరో ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నామని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పింక్ కలర్ షర్ట్ ఉంటేనే ఇండ్లు ఇచ్చేవారని కానీ మేము రాష్ట్రంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఆగిపోయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు నిధులు ఇస్తున్నామని కెసిఆర్ దత్తత తీసుకున్న వాసాల మర్రిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మేం కట్టించామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించే రూ.5 లక్షల్లో ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు నిధులు ఇస్తున్నామన్నారు. సింగరేణి ప్రాంతాల్లో 76 జీవో ప్రకారం పట్టాల పంపిణీ పెండింగ్లో ఉందని దీనిపై వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చించి పట్టాలు ఇస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రారంభించి మొండి గోడలతో వివిధ దశల్లో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 వేల ఇండ్లు ఉన్నాయని వీటి విషయంలో కేబినెట్ లో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని పెద్ద పట్టణ ప్రాంతంలో స్థలాలు లేని పేదలకు ప్రభుత్వ స్థలాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తుందని ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాక ఉమ్మడి జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, హౌసింగ్ సెక్రటరీతో కలిసి సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఎల్1, ఎల్2, ఎల్ 3 సమస్యను సైతం పరిష్కరిస్తామన్నారు. అటవీ ప్రాంతాల్లో గతం నుంచి నివసించే స్థలాల్లో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ తో ఇబ్బందులు ఉన్నాయనేది వాస్తవం అని ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోణంలోనే ఇళ్లను పంపిణీ చేసిందని ఆరోపించారు. మేము గిరిజన ప్రాంతాల్లో 12,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని చెంచులు అందరికీ మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. భేషజాలకు పోకుండా అందరికీ నిధులు ఇస్తున్నామన్నారు. పల్లెల్లో, పట్టణాల్లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెద్రూంలు పూర్తి చేస్తున్నామని మేం వచ్చేనాటికి 133 కాలనీల్లో 36 వేల ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని వీటి కోసం రూ.744 కోట్లు కేటాయించామని చెప్పారు. డబుల్‌బెడ్ ఇళ్ల పేరుతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్య పెట్టిందని విమర్శించారు. ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డి, ఠాగూర్ మక్కాన్‌సింగ్ బీర్ల ఐలయ్య, కసిరెడ్డి నారాయణరెడ్డి, పాయం వెంకటేశ్వరావు పాల్వాయి హరీష్‌రావు, ధనపాల్ సూర్యనారాయణ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ళు, ఇందిరమ్మ ఇళ్ళు నిరుపేదలకు మాత్రమే పంపిణీచేయాలని పార్టీను చూడదవద్దని చెప్పారు. పేదలకు పార్టీలు ఉండవని పేదరికం మాత్రమే ఉంటుందని అదే ప్రాతిపదికన ఇళ్ళు పంపిణీ చేఆయలని కోరారు.

## బిఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్య మండలిలో ప్రైవేటు వర్సిటీల సవరణ బిల్లు ఆమోదం

### శీతకాల సమావేశాలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించిన బిఆర్ఎస్

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** శాసనమండలి సమావేశాల్లో భాగంగా శనివారం ప్రైవేటు యూనివర్సిటీల సవరణ బిల్లును సభ ఆమోదించింది. శీతకాల సమావేశాల్లో భాగంగా శనివారం ప్రశ్నోత్తరాలు, స్పెషల్ మెన్షన్లు ముగిసిన అనంతరం ప్రైవేటు యూనివర్సిటీల సవరణ బిల్లును ప్రవేశ పెట్టాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదేశించారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రైవేటు యూనివర్సిటీల ఎస్టాబ్లిష్‌మెంట్ సవరణ చట్టం సవరణ బిల్లును ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు. ఇదే సమయంలో తాము యూరియాపై వాయిదా తీర్మానం ఇచ్చామని దానిపై చర్చించాలని బిఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. దీంతో రాష్ట్రంలో యూరియా అందుబాటులో లేనందున యూరియా సరఫరాపై చర్చించాలని బిఆర్ఎస్ సభ్యుడు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్టు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. దీంతో బిఆర్ఎస్ సభ్యులు యూరియాపై సభలో చర్చించాలని డిమాండ్ చేస్తూ సభలో నినాదాలతో నిరసన ప్రారంభించారు. బిఆర్ఎస్ సభ్యులు నిరసన తెలియజేస్తున్న సమయంలో మంత్రి దామోదర బిల్లును ప్రవేశ పెట్టారు. చైర్మన్ ఎన్నిసార్లు చెప్పినా బిఆర్ఎస్ సభ్యులు వినకుండా తమ నిరసనను కొనసాగించారు. బిఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్యనే బిల్లును ఆమోదింప చేశారు. బిల్లు ఆమోదం తెలపగానే భోజన విరామానికి సభను వాయిదా వేస్తున్నట్టు ఛైర్మన్ సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. దీంతో బిఆర్ఎస్ సభ్యులు తమ నిరసనను మండలిలో కొనసాగిస్తూ శాసనమండలి మీడియా పాయింట్ దగ్గరికి వెళ్లి శాసనమండలి శీతాకాల సమావేశాలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించి బయటికి వెళ్లిపోయారు.

## జానారెడ్డిని కలిసి పరామర్శించిన సుఖేందర్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 3:** మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, టి పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ పరామర్శించారు. వారి వెంట ఎమ్మెల్సీ శంకర్ నాయక్ కూడా ఉన్నారు. ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స అనంతరం జానారెడ్డి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వారిని ఆయన నివాసానికి వెళ్లి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పరామర్శించారు.


## ప్రభుత్వం మారినా కాంట్రాక్టర్లు మారట్లేదు.. సిబిఐ విచారణ జరగాలి

### అసెంబ్లీలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసి సంచలన వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 3:** తెలంగాణలో కాంట్రాక్టర్లపై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ కాంట్రాక్టర్లు మారడం లేదు, కాంట్రాక్టర్లపై విచారణ చేయాల్సిన అవసరం ఉంది అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో జల వివాదాలపై చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్టర్లు ఎంజాయ్ చేస్తున్నారు. ప్రభుత్వంలో ఏ ప్రాజెక్టు అయినా సేమ్ కాంట్రాక్టర్లు కొనసాగుతున్నారు. ప్రభుత్వ పథకాలు ఫెయిల్ అయినప్పుడు కాంట్రాక్టర్లపై బాధ్యత ఉంటుంది. కాంట్రాక్టర్లకు సైతం నిబంధనలు వర్తించాలి అని పేర్కొన్నారు, ఇరిగేషన్ ప్రాజెక్టులో ప్రభుత్వాలు మారినా కాంట్రాక్టర్లు మాత్రం వాళ్లే ఉంటున్నారు. గత ప్రభుత్వంలో పాఠశాలల్లో పెయింటింగ్, బెంచీల కాంట్రాక్టర్లు ఇప్పుడు సైతం కొనసాగుతున్నారు. కాంట్రాక్టర్లపై విచారణ చేయాల్సిన అవసరం ఉంది. కాంట్రాక్టర్లపై సిబిఐ విచారణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సమయంలో కెసిఆర్ గురించి మాట్లాడుతూ సభకు రాని కెసిఆర్ అజెండా డిసైడ్ చేస్తున్నారు. అయనే సభకు వస్తున్నాను... ఇరిగేషన్ మీద చర్చ చేస్తా అంటారు. చివరకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభను బహిష్కరించారు అని పేర్కొన్నారు.

## ఎబివిపి రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ రావుల కృష్ణ, కార్యదర్శిగా మాచెర్ల రాంబాబు

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎబివిపి) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ రావుల కృష్ణ ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా మాచెర్ల రాంబాబు ఎన్నికయ్యారు. శనివారం జరిగిన ఏబివిపి 44వ రాష్ట్ర మహాసభలో నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా అన్నాల్ దాస్ మురళి వ్యవహరించారు. 2025-26 సంవత్సరానికిగానూ నూతన రాష్ట్ర అధ్యక్షుడుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని విద్యావిభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ రావుల కృష్ణ, రాష్ట్ర కార్యదర్శిగా కాకతీయ యూనివర్సిటీలో పిహెచ్‌డీ చేస్తున్న మాచెర్ల రాంబాబు ఎన్నికయ్యారు. రాంబాబు రెండవసారి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రానున్న సంవత్సర కాలం విద్యార్థుల సమస్యలపై సమరశీల పోరాటాలను చేపట్టనున్నట్టు నూతన అధ్యక్ష, కార్యదర్శులు ప్రకటించారు.




## మాకు మైక్ ఇవ్వనప్పుడు అసెంబ్లీకి వెళ్లి లాభమేమిటి?: వేముల ప్రశాంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 2:** అసెంబ్లీలో స్పీకర్ పక్షపాత వైఖరిని తెలంగాణ సమాజం గమనించిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడుతూ పేర్కొన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో సుదీర్ఘ ప్రసంగం చేయడం శాసనసభ చరిత్రలో ఇప్పటివరకు లేదని తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో సీఎం రేవంత్ గంటన్నర పాటు మాట్లాడడం శాసనసభ నిబంధనకు విరుద్ధమని తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని చెబుతూనే.. మూసీ ప్రక్షాళనకు వేల కోట్లు ఎట్లా ఖర్చు చేస్తారని హరీశ్‌రావు అడిగారని.. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పకుండా అడ్డగోలుగా మాట్లాడారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి గంటన్నర పాటు మా సభ్యులపై అసభ్యంగా మాట్లాడటం దారుణమని వేముల ప్రశాంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. స్పీకర్ అడ్డు చెప్పకుండా.. ప్రతిపక్షాలకు అవకాశం కల్పించకుండా చేయడం అన్యాయమని అన్నారు. ప్రతిపక్షానికి కనీసం మాట్లాడటానికి అవకాశం ఇవ్వడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి తప్పులను ఎత్తిచూపేందుకు మైక్ ఇవ్వడం లేదని అన్నారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వను అని స్వయంగా స్పీకర్ చెప్పడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. మాకు మైక్ ఇవ్వనప్పుడు అసెంబ్లీకి వెళ్లి ఏం లాభమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సభ్యులకు మాట్లాడేందుకు కనీసం అవకాశం కల్పించడం లేదని.. అందుకే బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలని కోరారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఐ కేర్ క్లినిక్స్

### శాసనమండలిలో మంత్రి దామోదర రాజనర్సింహా

### ఆర్ఎంపి, పిఎంపిల అంశం కోర్టులో ఉంది

### వాడపల్లి దేవాలయ అభివృద్ధికి చర్యలు

## శాసన మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రుల సమాధానం



**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఐ కేర్ క్లినిక్స్‌ను నిర్వహించనున్నట్టు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనమండలిలో ప్రకటించారు. డే కేర్ క్యాన్సర్ సెంటర్ల తరహాలో ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి ప్రకటించారు. శాసనమండలిలో శనివారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. శాసనమండలి శీతకాల సమావేశాల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను చేపడుతున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. బిఆర్ఎస్ సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్ రావు .. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడానికి ఆర్ఎంపి, పిఎంపిలు ప్రాథమిక శిక్షణను ఇచ్చి, వారికి ధృవపత్రాలను జారీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా అని ప్రశ్నించారు. అందుకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానమిస్తూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల బలోపేతానికి ఆసుపత్రులను అనుసంధానం చేస్తున్నామని, పేదవారి ఆరోగ్య భద్రత ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఆర్ఎంపి, పిఎంపిల అంశం న్యాయస్థానం పరిధిలో ఉన్నదని, వారి సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గామీణ ప్రాంతాల్లో సేవలను అందిస్తున్న సబ్ సెంటర్స్, ఆరోగ్య మందిర్‌లను, సిహెచ్‌సి కేంద్రాలను, ఏరియా ఆసుపత్రులను, జీజీహెచ్‌లకు అనుసంధానం చేస్తున్నామన్నారు, ఆర్ఎంపి, పిఎంపిలకు గతంలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం వారికి శిక్షణ ఇవ్వటం పై ఐఎంఏ, తెలంగాణ డాక్టర్స్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించటంతో న్యాయపరమైన అంశాలు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆర్ఎంపి, పిఎంపిల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ సభకు తెలిపారు. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ బుద్ధవనం, వాడపల్లి దేవాలయం దగ్గర యాత్రికులు అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో అక్కడ సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా? అని కాంగ్రెస్ సభ్యుడు కేతావత్ శంకర్ నాయక్ ప్రశ్నించారు. ఇందుకు రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమాధానమిస్తూ.. వాడపల్లి దేవాలయానికి సంబంధించిన ప్రతిపాదనలను రూపొందించడానికి సాధ్యాసాధ్యాల కోసం సర్వేను నిర్వహించనున్నట్టు తెలిపారు. బిఆర్ఎస్ సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్ రావు నిమ్స్ ఆసుపత్రిలోని సర్జికల్ విభాగంలో డాక్టర్ల కొరత ఉందా? అని గత 2 సంవత్సరాల్లో అవుట్ పేషంట్లు ఎంత మంది, ఇన్ పేషంట్లు ఎంత నమోదయ్యారని, దాంతోపాటు ఎన్ని శస్త్రచికిత్సను నిర్వహించారని ప్రశ్నించారు. ప్రశ్నకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానమిస్తూ.. నిమ్స్ ఆసుపత్రిలో వైద్యుల కొరత లేదని స్పష్టం చేశారు. గత రెండేళ్లల్లో నిమ్స్‌లోని సర్జికల్ విభాగంలో అవుట్ పేషంట్లు 4,77,459 మంది, ఇన్ పేషంట్లు 36,711 మంది నమోదు చేసుకోగా .. 49,144 మందికి సర్జికల్ విభాగంలో శస్త్ర చికిత్సలను నిర్వహించినట్టు తెలిపారు. బిఆర్ఎస్ సభ్యుడు వంటేరు యాదవ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత రెండేళ్లల్లో కంటి వెలుగు ద్వారా ఎంత మందికి స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారని ప్రశ్నించారు. ఈ పథకాన్ని కొనసాగించే ఆలోచన ఉందా? అని ప్రశ్నించారు. దీనికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానమిస్తూ. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా డే కేర్ కేన్సర్ సెంటర్లు ప్రారంభించామని, కేన్సర్ స్క్రీనింగ్, డయాగ్నసిస్, కీమోథెరపీ వంటి సేవలు ఈ క్లినిక్‌లలో అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. కేన్సర్ పేషెంట్లు కీమో థెరపీ కోసం హైదరాబాద్ వరకూ రావాల్సిన అవసరం లేకుండా, జిల్లా కేంద్రాల్లోని డే కేర్ కేన్సర్ సెంటర్లలో సేవలు అందిస్తున్నామన్నారు. దీంతో ఎంఎన్‌జె హాస్పిటల్ మీద పేషెంట్ లోడ్ కూడా తగ్గిందని మంత్రి తెలిపారు. కేన్సర్ కేర్ సెంటర్ల తరహాలోనే, ప్రజలకు నిరంతర కంటి వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఐ కేర్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత జీవనశైలి, స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో కంటి సమస్యలు అధికమవుతున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని కంటి వెలుగు తరహాలో తాత్కాలిక శిబిరాలకు పరిమితం కాకుండా, శాశ్వత ప్రాతిపదికన వైద్యం అందించేలా 'ఐ కేర్ క్లినిక్స్'ను ఏర్పాటు చేస్తున్నాం. ఈ క్లినిక్‌ల నిర్వహణలో సరోజినీ దేవి కంటి ఆసుపత్రి 'హబ్'గా వ్యవహరిస్తుంది. హబ్ క్లినిక్‌ల మధ్య సమన్వయం కోసం, స్క్రీనింగ్, సర్జరీలను పర్యవేక్షించడానికి ఒక ఆప్తాల్మాలజీ నిపుణుడిని 'నోడల్ ఆఫీసర్'గా నియమించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కంటి వ్యాధుల తీవ్రతను అధ్యయనం చేయడానికి, సరైన చికిత్సా విధానాలను సిఫార్సు చేయడానికి ఇప్పటికే ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణుల కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా ఐ కేర్ సెంటర్ల పనితీరుపై, విధి విధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. 2018లో తొలి విడత, 2023లో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించినట్టు మంత్రి వెల్లడించారు. స్క్రీనింగ్, కండ్లద్దాల పంపిణీకే కార్యక్రమాన్ని పరిమితం చేశారని మంత్రి గుర్తు చేశారు. 9.3 లక్షల మందికి కంటి ఆపరేషన్లు అవసరం అని డాక్టర్లు గుర్తించినప్పటికీ, ఆపరేషన్లు చేయించకుండానే కార్యక్రమాన్ని ముగించారని మంత్రి తెలిపారు. బిజెపి సభ్యుడు ఏవిఎన్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని మలక్‌పేట వద్ద ఐటీ టవర్ నిర్మాణానికి సంబంధించి మూడేళ్లక్రితం శంఖుస్థాపన చేశారని.. ప్రస్తుతం దాని పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అందుకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు సమాధానమిస్తూ.. 2023 అక్టోబర్ 2న మలక్‌పేటలో ఐటీ టవర్ కోసం శంఖుస్థాపన చేశారని.. ఆ తరువాత సమ్మతి పత్రాన్ని రద్దు చేసి, బిడ్డర్ల ద్వారా ఆర్ఎఫ్‌సి క్లాజ్‌లను నెరవేర్చని కారణంగా బిడ్ ప్రక్రియను నిలిపివేసినట్టు తెలిపారు. తాజాగా టెండర్‌ను ఆహ్వానించే పనిలో ఉన్నామని త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు శాసనమండలిలో ప్రకటించారు.

## రూ. 3,593 కోట్లు గృహజ్యోతి లబ్ధిదారుల తరపున చెల్లించాం

### ప్రశ్నోత్తరాల సమయంలో జవాబు ఇచ్చిన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** మహాలక్ష్మీపథకం అమలులో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200యూనిట్లలోపు మాత్రమే విద్యుత్ వినియోగించిన 52లక్షల82వేల నాలుగు వందల తొంబై ఎనిమిది కుటుంబాలకు చెందిన విద్యుత్‌బిల్లులు మార్చి 2014నుంచి డిసెంబరు 2025వరకు 3593 కోట్లరూపాయలు ప్రభుత్వం చెల్లించిందని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సభలో ప్రకటించారు. శనివారం ప్రశోన్నత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, మేడిపల్లిసత్యం, కూచుమల్ల రాజశ్వర్‌రెడ్డి, గవినోళ్ళ మధుసూధన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ రాష్ట్రంలో ఒక కోటి 15లక్షల కరెంటు కనెక్షన్ కలిగిన కుటుంబాలు ఉంటే అందులో 52.82లక్షల కుటుంబాలకు లబ్ది కలుగుతోందని ఉపముఖ్యమంత్రి తెలిపారు. 200యూనిట్లు మించి కరెంటు వినియోగం చేసిన వారికి ఈ పథకం వర్తించదని ఏదైనా నెలలలో 200 యూనిట్లు మించితే బిల్లు కట్టుకోవాలని, తరువాత నెలలలో రెండు వందల రూపాయల లోపు వస్తే ఎంపిడివో, పురపాలక సంఘం కార్యాలయంలో ప్రత్యేకంగా నియామకం చేసిన ప్రజాపాలన అధికారి వద్దకు వెళ్ళి దరఖాస్తుచేసుకొని లబ్దిపొందవచ్చని సూచించారు. ఇళ్ళు మారినవాళ్ళు, కొత్త ఇళ్ళు కట్టుకొన్నవాళ్ళు కూడా గృహజ్యోతి పథకం లబ్దిపొందేందుకు ప్రజాపాలన అధికారి వద్ద దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. వ్యవసాయంకు ఉచిత కరెంటు కోసం సాలీనా రూ.13,499కోట్లు విద్యుత్‌సంస్థలకు చెల్లిస్తున్నామని భట్టి తెలిపారు. ఈ పథకం ద్వారా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 45,995 కుటుంబాలు, అచ్చంపేట నియోజకవర్గంలో 40,555 కుటుంబాలు, ఆది ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్ లో 65,862 సిద్దిపేట నియోజకవర్గంలో 50,398 కుటుంబాలు గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే గవినోళ్ళ మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ అద్దె ఇంటి నుంచి మారిపోతే గృహజ్యోతి పథకం వర్తింప చేయడానికి కనీసం ఆరునెలల సమయం పడుతోందని వెంటనే గృహజ్యోతి పథకం వర్తింపచేయాలని సూచించారు.

## బిసిలకు ప్రత్యేకంగా 'బిసి రక్షణ చట్టం తీసుకురావాలి'

### ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని రెండున్నర కోట్ల మంది బిసిలకు ప్రభుత్వం బిసి రక్షణ చట్టం అమలు చేయాలని రాజ్య సభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సిఎం చంద్రబాబునాయుడు బిసిరక్షణ చట్టంకు ముసాయిదా చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు ఉన్న అట్రాసిటి చట్టం మాదిరిగానే బిసిలకు ప్రభుత్వం చట్టం తీసుకువస్తే వారిపై జరుగుతున్న దాడులు, హింసలు, వివక్షలు అరికట్టవచ్చునని చెప్పారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్. కృష్ణయ్య మాట్లాడారు. రాష్ట్రంలో బిసిలు అత్యధిక సంఖ్యలో ఉన్నప్పటికి వారిపై అన్యాయాలు, దాడులు జరుగుతున్నాయని, ఇందుకు కారణం ఎస్సీ, ఎస్టీలకు ఉన్న మాదిరిగా రక్షణ చట్టం లేక పోవ డమేనన్నారు. ఎపిలో రక్షణ చట్టం తీసుకువస్తున్న చంద్రబాబునాయుడుకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

## ఆదిలాబాద్‌లోనే సిఎం, నేను సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షిస్తాం

### ప్రశ్నోత్తరాల సమయంలో బిజెపి సభ్యులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానం

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** సదర్‌మాట్ బ్యారేజి కమ్ బ్రిడ్జ్ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నేను వస్తున్నామని అదే రోజు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పనుల పురోగతిపై సమీక్ష చేస్తామని సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామిఇచ్చారు. చనాక కోరాట ప్రాజెక్ట్ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే భూములకు లక్షల రూపాయలే పరిహారం ఇస్తామన్నారని గుర్తు చేశారు. పదేళ్లు అయ్యిందన్నారు. నీళ్లు రాలేదని పరిహారం రాలేదని ఆదిలాబాద్ రైతులు పాద యాత్రగా హైదరాబాద్‌కు వచ్చారని శంకర్ తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి వెంటనే భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగన్నాథ్ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కోరారు. 135కోట్ల రూపాయలు కేటాయిస్తే హెడ్‌వర్క్ అవుతోందని నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రిని కలిసినా ఫైళ్లు కదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రెండు మండలాల్లో సాగునీరు అందుతుందన్నారు. రైతులకు భారీ లాభం చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

## మధ్యస్థంగా టెట్ ప్రశ్నల సరళి

### నేటి నుంచి ఉదయం 8.50 గంటలకు గేట్లు మూసివేత

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో శనివారం నుంచి ప్రారంభమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు టెట్ పరీక్షల ప్రశ్నల సరళి మధ్యస్థంగా ఉన్నట్టు అభ్యర్థులు చెబుతున్నారు. శనివారం ఉదయం పేపర్-2 పరీక్ష 69 పరీక్షా కేంద్రాల్లో జరగగా.. 17,605 మందికి గానూ 14,089 మంది అభ్యర్థులు హాజరయ్యారు. నేడు(ఆదివారం) ఉదయం 85 కేంద్రాల్లో, మధ్యాహ్నం 91 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. నేటి నుంచి పరీక్షలకు 10 నిమిషాల ముందుగా గేట్లను మూసివేయనున్నట్టు అధికారులు ప్రకటించారు.

## మహిళలకు స్ఫూర్తిదాయకం సావిత్రీబాయిపూలే జీవితం

### పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జనవరి 3, ప్రభాతవార్త :** భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు, సమాజ సంస్కర్త, స్త్రీలకు విద్యాప్రదాత సావిత్రీబాయి పూలే జీవితం మహిళందరికీ స్ఫూర్తిదాయకమని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడాశాఖల మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమశాఖ సౌజన్యంతో సావిత్రిబాయిపూలే ఫౌండేషన్, సావిత్రిబాయి ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ, సావిత్రిబాయి మహిళా సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధానమందిరంలో ప్రభుత్వపరంగా శనివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మణిమంజరి సభాధ్యక్షతన జరిగిన సావిత్రిబాయిపూలే 195వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి శ్రీహరి తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమశాఖ అధికారులు సైదులు, మల్లయ్యభట్టు తదితరులు, విశిష్ట అతిథులు పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, ఆర్.కృష్ణయ్య, గౌరవ అతిథులు హర్యాన రాష్ట్ర మాజీ గవర్నరు బండారు దత్తాత్రేయ, మాజీ రాష్ట్రమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ మాజీసభ్యుడు వి.హనుమంతరావు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బిసి నాయకులు కులకచర్ల శ్రీనివాస్, గుజ్జకృష్ణ, బెల్లం మాధవి, గోపి బోయ తదితరులతో కలిసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులు అర్పించి ప్రసంగించారు. సావిత్రిబాయి తన భర్త జ్యోతిబాపూలే ప్రోత్సాహంతో చదువుకుని సమాజంలోని స్త్రీలకు విద్యాబోధన కావించి భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా గుర్తిం పు పొందారని గుర్తుచేశారు. ఆమె ఆలోచనలు, జీవిత చరిత్రను మహిళలంతా స్ఫూర్తిగా తీసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. త్వరలో పూలే విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ నేడు మహిళలను ఉన్నత విద్యావంతులై అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, రాబోయే రోజుల్లో చట్టసభల్లో 33 శాతం ప్రజాప్రతినిధులు కాబోతున్నారని ఆనం దాన్ని వ్యక్తపరిచారు. ఆర్.కృష్ణయ్య సావిత్రి బాయి పూలే చదువుల తల్లి అని అభివర్ణించారు. బండారు దత్తాత్రేయ మహిళా సాధికారతే సావిత్రిబాయి జయంతి అన్నారు. మహిళలు అన్నిరంగాల్లో గొప్పగా రాణించాలని ఆకాంక్షిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు తక్కువ వడ్డీలకు ఋణాలు అందించి వారు ఆర్థికంగా ఎదగడానికి విశేషకృషి చేస్తున్నారని గుర్తుచేశారు. మహిళలు ఆమె ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతి రోజును మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నానని అన్నారు. ప్రతీ జిల్లాలో ఆమె ప్రతిభాపాటవాలతో పోటీలు నిర్వహించడంతో పాటు పూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బడుగు బలహీన అణగారిన వర్గాల హక్కులు అభ్యున్నతి కోసం, అంటరానితనానికి వ్యతిరేకంగా అహర్నిశలు పోరాటం చేశారని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.




సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పిస్తున్న మంత్రి శ్రీహరి, మణిమంజరి, వి.శ్రీనివాస్‌గౌడ్, వి.హనుమంతరావు, జాజుల శ్రీనివాస్‌గౌడ్, బెల్లంమాధవి, గుజ్జకృష్ణ తదితరులు

## 'నా అన్వేషణ' చానెల్‌పై రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదులు

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 3, ప్రభాతవార్త :** రాష్ట్ర మహిళా కమిషన్‌కు 'నా అన్వేషణ' అనే యూ ట్యూబ్ ఛానల్‌పై అనేక ఫిర్యాదులు అందాయని తెలంగాణా రాష్ట్ర మహిళా కమీషన్ సెక్రటరీ ఒక ప్రకటనలో తెలియజేసారు. సంబంధిత ఇన్‌ఫ్యూయర్ మహిళలపై అవమానకరమైన, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ మహిళలను వస్తువుల్లా చూపించే విధంగా కంటెంట్‌ను ప్రసారం చేస్తున్నాడని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. అదే విధంగా ఆ ఛానల్ లో ప్రసారం చేసిన కొన్ని వీడియోలలో చట్ట విరుద్ధ అంశాలు, ముఖ్యంగా బాలల హక్కులకు భంగం కలిగించేలా ఉన్న కంటెంట్ ఉందని, సంబంధిత చట్టాల ప్రకారం నేరాలకు దారితీసే అంశాలు ఉన్నాయని ఆరోపణలు వచ్చాయి. ఈ విషయాలకు సంబంధించిన వీడియో లింకులు ఖాతా వివరాలను కమీషన్ పరిశీలన కోసం సేకరించింది. మహిళలతో పాటు హిందూ దేవతలపై కూడా అత్యంత అభ్యంతరకరమైన, అసభ్యమైన, భావోద్వేగాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజా నైతికతను, సామాజిక సమతుల్యతను దెబ్బతీసేలా ఉన్నాయని కమీషన్ అభిప్రాయపడుతుందన్నారు. ఆ ఇన్‌ఫ్యూయర్ ప్రస్తుతం భారతదేశం బయట నివసిస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని కేంద్ర స్థాయి ఉన్నత అధికార సంస్థ అయిన జాతీయ మహిళా కమీషన్ (ఎన్‌సీడబ్ల్యు)కు తెలంగాణా రాష్ట్ర మహిళా కమీషన్‌కు పంపించినట్లు తెలిపారు. చట్టపరంగా అవసరమైన చర్యలు తీసుకోవడం, సంబంధిత వ్యక్తిని హాజరు పర్చే అధికారం జాతీయ మహిళా కమిషన్‌కు ఉన్నందువల్ల ఈ అంశాన్ని అక్కడికి పంపినట్లు కమీషన్ తెలిపింది. మహిళల గౌరవం ప్రజా నైతికత సామాజిక విలువలను పరిరక్షిం చాల్సిన అవసరం దృష్ట్యా, ఈ వ్యవహారంపై అత్యంత సీరియస్‌గా పరిగణించి అవసరమైతే కఠినమైన, చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణా రాష్ట్ర మహిళా కమీషన్ ఈ అంశాన్ని జాతీయ మహిళా కమీషన్‌కు పంపినట్లు తెలిపింది.


## గడువు ముగిసిన ఎల్ఐసి పాలసీల పునరుద్ధరణ

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త :** గడువు ముగిసిన పాలసీలను పునరుద్ధరిం చుకోవడానికి ఎల్ఐసీ ఆకర్షణీయమైన ఆఫర్‌తో ముందుకు వచ్చింది. వ్యక్తిగత గడువు ముగిసిన పాలసీల కోసం ఈ నెల 1వ తేదీ నుండి మార్చి 2వ తేదీ వరకు ఒక ప్రత్యేక పునరుద్ధరణ ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో ఈ పథకం కింద పునరుద్ధరణకు అర్హత ఉన్న అన్ని నాన్‌లింక్డ్ బీమా ప్లాన్‌లకు ఆలస్య రుసుములో రాయితీ అందించబడుతోంది. ఈ రాయితీ గరిష్టంగా రూ.5 వేల వరకు, ఆలస్య రుసుములో 30 శాతం వరకు ఉంటుందని అందులో పేర్కొంది. ఆలస్య రుసుముపై గరిష్ట రాయితీఅనుమతించబడిందని వెల్లడించింది. రూ.1 లక్ష వరకు 30 శాతం, రూ.1 లక్ష నుండి 3 లక్షల వరకు 30 శాతం, రూ.3 లక్షలు, అంతకంటే ఎక్కువ 30 శాతం చొప్పున రూ. 5 వేల వరకూ, మైక్రో ఇన్సూరెన్స్ ప్లాన్‌లు 100 శాతం పూర్తిగా రాయితీ ఉంటుందని వివరించింది. ఈ ప్రత్యేక పునరుద్ధరణ ప్రచారం కింద, పాలసీ నిబంధనలు మరియు షరతులను సంతృప్తిపరిచిన తర్వాత, మొదటి చెల్లించని ప్రీమియం తేదీ నుండి 5 సంవత్సరాలలోపు పాలసీలను పునరుద్ధరించుకోవచ్చని స్పష్టం చేసింది.

## హామీల అమలుకు ఆటోడ్రైవర్లు చలో అసెంబ్లీ ప్రదర్శన

### డ్రైవర్లను అరెస్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 3, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ వందలాది మంది ఆటో డ్రైవర్లు శనివారం 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. అరెస్టుల సందర్భంగా ఆడో డ్రైవర్లు రోడ్డు మీద బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులకు, డ్రైవర్లకు వాగ్వివాదం జరిగింది. తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఏసి ఆధ్వర ంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ నుంచి వందలాది మంది ఆటో డ్రైవర్లు అసెంబ్లీ వైపు వెళుతుం డగా పోలీసు లు అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జెఏసి రాష్ట్ర కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డ్రైవర్లను మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వల్ల ఆనేక మంది డ్రైవర్లు తీవ్రంగా, ఆర్థికంగా కుంగిపోయారని, వంద శాతం పెరిగన ధరలతో మరింతగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో మీటర్ చార్జి మినిమం 20 నుంచి 50 రూపాయలకు పెంచాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి 12 వేలు ఆర్థిక సహాయం అందించాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



ఆటో డ్రైవర్లను అరెస్టు చేస్తున్న పోలీసులు

# దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే

## - సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా ఘన నివాళి అర్పించారు. మహిళలను విద్యావంతులుగా చేయాలనే లక్ష్యంతో ఆనాడు సమాజ కట్టుబాట్లను ధిక్కరించి ఆమె చేసిన సాహసం నేటి ఆధునిక మహిళా శక్తికి బలమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం మహిళల విద్యకే పరిమితం కాకుండా, పురుషులకన్నా మిన్నగా అవకాశాలను సద్వినియోగం చేసుకునే స్థాయికి మహిళలను తీసుకొచ్చిందని చంద్రబాబు తెలిపారు. ఆమె చూపిన దారిలోనే నేటి మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తున్నారని అభిప్రాయపడ్డారు. సమాజంలో సగభాగమైన మహిళల విద్యాభివృద్ధిలో సావిత్రిబాయి పూలే కీలక పాత్ర పోషించారని సీఎం గుర్తు చేశారు. అందుకే ఆధునిక మహిళలు ఆమెకు సదా కృతజ్ఞతలు తెలపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా విద్యకు వెలుగులు నింపిన సావిత్రిబాయి పూలేకు మరోసారి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ట్వీట్‌లో తెలిపారు. దేశ మొట్టమొదటి మహిళా టీచర్ సావిత్రిబాయి పూలే .. లోకేశ్ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే మన దేశ మొట్టమొదటి మహిళా టీచర్ అని, స్త్రీ విద్య, హక్కుల సాధన కోసం జీవితాంతం కృషిచేశారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిని సమాజ మార్పునకు శక్తిమంతమైన సాధనంగా భావించారన్నారు. సామాజిక వ్యతిరేకత, అవమానాలు ఎదురైనా బాలికల విద్య కోసం ధైర్యంగా ముందుకు సాగారని, నేటి మహిళా ఉపాధ్యాయులకు ఆమె మార్గదర్శి అనీ అన్నారు. సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆమెకు మనం అర్పించే నిజమైన నివాళి అని లోకేశ్ పేర్కొన్నారు.

# కూటమి పాలనలో నగదు రహిత వైద్యసేవల్లో భారీ పురోగతి

## మంత్రి సత్యకుమార్ యాదవ్

**సచివాలయం,జనవరి 3,ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణలో ప్రజలకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత వైద్యసేవలు అందించడంలో సానుకూలమైన మార్పు స్పష్టంగా కనిపిస్తుందని వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టంచేశారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల అమలును, 108 మరియు 104సేవలను శనివారం వర్చువల్‌గా సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. ననపెరిగిన లబ్దిదారలు,వ్యయం గత వైసీపీ ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రొసీజర్ల సంఖ్యను 3257కు పెంచి పూర్తిస్థాయిలో అమలు పరిచిన 2022న23 మరియు 2023న24కాలంలో ఫలితాలను,గత 19నెలల కూటమి పాలనలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద మరియు సాధించిన ఫలితాలను మంత్రి తులనాత్మకంగా విశ్లేషించారు. 2022-24 కాలంలో ఆరోగ్యశ్రీ కింద మొత్తం 23,08,930మంది లబ్దిపొందారు. దీని ప్రకారం సగటున నెలకు 96,205మందికి ఆరోగ్యశ్రీ సేవలందాయి. కూటమి ప్రసభుత్వ పాలనలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఈ ఏడాది డిసెంబర్ వరకు మొత్తం 24,49,117లబ్దిదారులకు వైద్యసేవలందాయి. ఈ మేరకు సగటున నెలకు 1,16,624 మందికి నగదు రహిత వైద్య సేవలు అందడంతో లబ్దిదారుల్లో 21శాతం వృద్ధి నమోదైందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. --104వాహనాల ద్వారా విస్తృత ప్రయోజనాలు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు 104వాహనాల ద్వారా త్వరలో ప్రతి ఒక్కరికి 41రకాల వైద్యపరీక్షలు చేసే ప్రక్రియను చేపడతామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈమేరకు జరుగుతున్న సన్నాహకాల గురించి మంత్రి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ,108 మరియు 104 వాహన సేవలు ఎంతో కీలకమైనవని, వీటి అమలు,నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నాణ్యమైన సేవల్ని అందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

# వైసిపి పాలనలో డ్రగ్స్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్

### అభ్యుదయం సైకిల్‌యాత్రలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

### ఇచ్ఛాపురంలో డ్రగ్స్ వద్దు బ్రో ఫైలాన్ ఆవిష్కరించిన హోం మంత్రి అనిత



ఫైలాన్‌ను ఆవిష్కరణ

**ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), జనవరి 3 ప్రభాతవార్త:** గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో డ్రగ్స్ రాకెట్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దారని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్ర ముగింపు ఇచ్ఛాపురంలో జరిగింది. డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నవంబర్ 12న అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రారంభించిన సైకిల్‌యాత్ర 1300 కిలోమీటర్లు మేర సాగి ఇచ్ఛాపురంలో ముగిసింది. ఇందుకు చిహ్నంగా స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఫైలాన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫైలాన్‌ను రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ గతంలో దేశంలో ఏ మూలన డ్రగ్స్ దొరికినా దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండేవని అన్నారు. రాష్ట్ర ఐటి శాఖామంత్రి నారా లోకేష్ అప్పటి పాదయాత్రలో గంజాయి దుస్థితి తెలుసుకుని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గంజాయిపై ఉక్కుపాదం మోపారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపడమే సంకల్పమని అన్నారు. పంజాబ్‌లో యువత డ్రగ్స్‌కు బానిసై రాష్ట్రం చిన్నాభిన్నమైందని అటువంటి దుస్థితి రాష్ట్రానికి రాకూడదని ఈగల్ టీం ఏర్పాటు చేసి డేగ కళ్లతో పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గంజాయి వ్యాపారులతో కూడా కమిషన్‌కు మాట్లాడుకుని ఒరిస్సా నుంచి గంజాయి రవాణాకు ప్రోత్సహించేవారని అన్నారు. డ్రోన్ వ్యవస్థ ద్వారా గంజాయి పంటలను నాశనం చేసి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించామని అన్నారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ గంజాయి పేరెత్తితే మొక్క తేవాలన్నా భయపడే విధంగా వ్యవస్థ పని చేస్తోందని ఇది గంజాయి రవాణాకు గేట్‌వే కాదని నిరూపించాలని అన్నారు. ఇండిగో సంక్షోభం సమయంలో రామ్మోహన్‌నాయుడు విమర్శలను ధీటుగా ఎదుర్కొని వారంలోగా సమన్వయంతో గాడిలో పెట్టి పూర్వ వైభవం తీసుకొచ్చారని అన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే వాక్యం లోకేష్ ఆలోచన నుంచే వచ్చిందని అన్నారు. బోర్డర్‌లో చెక్‌పోస్టులు లేకుండా, సీసీ కెమెరాలు లేకుండా గతంలో పాలన సాగిందని, సున్నా నుంచి మొదలు పెట్టి డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తున్నామని అన్నారు. అమ్మాయిలకు కూడా గంజాయి అలవాటు చేశారని అన్నారు. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటే ఉపాధి అవకాశాలు ఉంటాయని కోరారు. ఈ సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఈగల్ ఐజీ రవికిషన్, విశాఖ రేంజ్ ఐజీ గోపినాధ్ జెట్టి, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే బెందాళం అశోక్, పలాస, నరసన్నపేట, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, నడికుడితి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 'గోవింద'రాజ ఆలయంలో భద్రతా వైఫల్యం!

## - ఏకాంతసేవ ముగిశాక ఆలయం గోడదూకి లోపలికి..

## - ఆలయగోపురంపైకి వెళ్లి కలశాలు చోరీకి తెలంగాణవాసి యత్నం

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామికి అన్నగా పిలువబడే తిరుపతినగరం నడిబొడ్డున కొలువైన శ్రీగోవిందరాజస్వామి ఆలయం గోపురంపైకి ఓ వ్యక్తి రాత్రివేళ ఎక్కి కలశాలు లాగడానికి చేసిన విఫలయత్నం తిరుమల తిరుపతిదేవస్థానం పెద్దలనేగాక తిరుపతివాసులను భయభ్రాంతులకు గురిచేసింది. శుక్రవారం రాత్రి తొమ్మిదిగంటల సమయంలో ఏకాంతసేవ ముగిసిన తరువాత ఆలయ అధికారులు, అర్చకులు భద్రత సిబ్బంది ఆలయ ప్రధాన ద్వారం తలుపులు, మహద్వారం తలుపులు మూసివేశారు. అంతా వారివారి ఇళ్ళకు చేరుకున్నారు. సరిగ్గా అదే సమయంలో భక్తుడి రూపంలో ఓ వ్యక్తి అప్పటికే మద్యంసేవించిన మత్తులో ఆలయం గోడపైకి ఎగబడి లోపలకు వెళ్ళాడు. ఆలయ మహద్వారం దాటుకుని ఏకంగా గోపురంపైకి రాత్రి 11గంటల ప్రాంతంలో చేరుకున్నాడు. అక్కడ బంగారుపూతతో ఉన్న కలశాలను మూడింటిని లాగడానికి ప్రయత్నించాడు. కొంతసేపటి తరువాత చిన్నపాటి శబ్దాలు రావడంతో స్థానికులు గమనించి భద్రత సిబ్బందికి తెలిపారు. అప్రమత్తమైన భద్రత సిబ్బంది ఆలయంలోపలకు చేరుకుని గోపురంపైన కూర్చున్న వ్యక్తిని గుర్తించారు. వెంటనే తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, ఈస్ట పోలీసులు, అగ్నిమాపకశాఖసిబ్బంది, టిటిడి విజిలెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని గోపురంపై కూర్చున్న వ్యక్తిని క్రిందకు దించేందుకు చేసిన ప్రయత్నాలు, మంచిమాటలు ఫలించలేదు. తనకు 90ఎంఎల్ మద్యంసీసా తీసుకువస్తే క్రిందకు దిగుతానని పోలీసులతో వాదనలకు దిగాడు. తీరా రెండుగంటల తరువాత అగ్నిమాపక సిబ్బంది బలమైన త్రాళ్ళ సాయంతో గోపురంపైకి చేరుకుని అక్కడ ఉన్న వ్యక్తిని క్రిందకు దించారు. తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతా ఊపిరిపీల్చుకున్నారు.



**- సినిమా ఫక్కీలో ఆలయంలోపలకు:** తిరుమలతిరుపతిదేవస్థానంకు అనుబంధంగా ఉన్న తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో భద్రత వైఫల్యం మరోసారి ప్రస్ఫుటమైంది. నిత్యం ఇరవైవేలమంది నుండి ముప్పైవేలమందివరకు భక్తులు ఆలయాన్ని సందర్శిస్తుంటారు. ఉదయం నుండి రాత్రి 9గంటల వరకు ఆలయంలో భక్తులకు నిరంతరయంగా దర్శనం కల్పిస్తున్నారు. రాత్రి ఏకాంతసేవ తరువాత ఆలయంలోపల భక్తులు ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాత ఆలయం తలుపులు మూసివేస్తారు. అలాంటిది శుక్రవారం రాత్రి కట్టుదిట్టమైన భద్రత ఉండే గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి 11గంటల ప్రాంతంలో భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్లు బయటపడింది. ఆలయం గోడ దూకి గోపురంపైకి చేరుకున్నా భద్రత సిబ్బందిగానీ, సిసికెమెరాలద్వారా టిటిడి కమాండ్ కంట్రోల్ కేంద్రం సిబ్బందిగానీ గుర్తించలేకపోవడం పనితీరు వైఫల్యం తేటతెల్లం చేసింది. పైకి ఎగబడిన వ్యక్తిని తెలంగాణ నిజామాబాద్ జిల్లా కూర్మవాడ పెద్దమల్లారెడ్డి కాలనీకి చెందిన "కుతడి తిరుపతి"(43)గా పోలీసులు తేల్చారు. యాత్రికులతో కలసి ఆలయంలోపల ఉన్న టెంట్‌కొయ్యలమీదుగా గోపురంపైకి ఎక్కినట్లు తెలిపాడు. మతిస్థిమితం లేని వ్యక్తిగా, మద్యం మత్తులో ఉన్నట్లు అతనిని పోలీసులు అదుపులోకితీసుకున్నట్లు టిటిడి వర్గాల ప్రకటన . తిరుపతినగరం నడిబొడ్డున ఉన్న టిటిడి గోవిందరాజస్వామి ఆలయం ఒక పవిత్రమైన క్షేత్రం. ఈ ఆలయానికి ఆనుకుని ముందుభాగంలో దుకాణాలు ఉన్నాయి. అయినా రాజగోపురంపైకి మద్యం మత్తులో ఎలా వెళ్ళాడనేది ఇతి అత్యంత దారుణమైన సంఘటనగా ప్రజలు, దుకాణాదారులు, ప్రజా సంఘాలు, నేతలు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయంపైన వెళ్ళినా భద్రతా సిబ్బంది ఎందుకు గమనించ లేదనేది సందిగ్ధత.

# ప్రణాళికలతో రికార్డుస్థాయిలో వైకుంఠదర్శనాలు

## - శుక్రవారంరోజే 83వేలమంది భక్తుల దర్శనం

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు పటిష్టవ్యూహంతో ముందస్తు ప్రణాళికలతో చక్కగా అమలుచేస్తున్న టిటిడి అధికారులు తొలిమూడురోజులు సఫలీకృతులయ్యారు. ఆ తరువాత సామాన్యభక్తులకు సర్వదర్శనాలు అమలుచేయడంతో నాల్గవరోజు శుక్రవారం ఏకధాటిగా 83,032మంది భక్తులకు వైకుంఠద్వార దర్శనం చేయించడం దశాబ్ధకాలంలో టిటిడి రికార్డు సృష్టించింది. శుక్రవారం శ్రీవారికి అభిషేకసేవ జరుగుతుంది. అయినా సర్వదర్శనంలో భక్తులను ఆ సేవ నిర్వహించే సమయంలో కూడా అనుమతించడంతో తమజన్మధన్యమైందని చూసినవాళ్ళు పునీతులయ్యారు. కాగా ఐదవరోజు శనివారం తిరుమలలో సాధారణ సర్వదర్శనంలో భక్తులు ఎటువంటి టోకెన్, టిక్కెట్ లేకున్నా కృష్ణతేజ కూడలి నుండి క్యూలైన్లలోనికి ప్రవేశిస్తున్నారు. రాత్రి 7గంటల వరకు 43వేలమంది భక్తులకు వైకుంఠద్వార దర్శనాలు చేయించడంలో టిటిడి పూర్తిస్థాయిలో విజయవంతమవుతోంది. గత ఏడాది జనవరిలో జరిగిన వైకుంఠద్వార దర్శనాలు కల్పించడంలో పెద్ద పొరబాట్లు, నిర్లక్ష్యంతో ఈ ఏడాది టిటిడిలో బోర్డు సభ్యుల నుండి ఉన్నతాధికారులు, క్రిందిస్థాయి అధికారులు వరకు ప్రతి ఒక్కరి బాధ్యతను, భద్రతను గుర్తుచేసేలా పక్కా వ్యూహంతో సాఫీగా చేస్తున్నారు. తమిళనాడు, కర్నాటక,మహారాష్ట్ర, కేరళ తెలుగురాష్ట్రాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. టిటిడి ఉన్నతాధికారులు ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఒ కెవి మురళీకృష్ణ, ఎక్కడా చిన్నపాటి పొరబాట్లు, తప్పిదాలు జరగకుండా ఎవరికివారే అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు బాధ్యతతో ఆలయ మాఢవీధులు, వెలుపల క్యూలైన్లలో సకల సౌకర్యాలు భక్తులకు కల్పిస్తూ క్యూలైన్లను చక్కగా తోపులాటకు అవకాశం లేకుండా నిర్వహిస్తున్నారు. భక్తులు కూడా సంతోషం వ్యక్తం చేయడం టిటిడి అధికారుల పనితీరుకు నిదర్శనం, భక్తులు ప్రశాంతంగా,సాఫీగా క్యూలైన్లలోనికి చేరుకునేలా,ఆలయంలోపలకు చేరుకునే వరకు తిరుమల పోలీసులు, టిటిడి విజిలెన్స్, ఆక్టోపస్, ఎస్‌పిఎఫ్ బలగాలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. లక్షమందికిపైగా భక్తులు చేరుకున్నా వైకుంఠమ్ 1లోని ఇంటిగ్రేటెడ్‌కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరాయంగా ఏఐ విధానంలో పర్యవేక్షిస్తూ క్యూలైన్లను కదిలేలా చూస్తున్నారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, కాఫీ,టీ,పాలు అందించేలా అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్వయంగా పరిశీలిస్తున్నారు. పదిరోజుల వైకుంఠ దర్శనాలను మరో ఐదురోజులు కూడా మరింత ప్రశాంతంగా, భక్తులు ఆనందించేలా విజయవంతంగా నిర్వహించేలా అధికారులు నిమగ్నమయ్యారు. వైకుంఠద్వార దర్శనాల్లో తొలిరోజు డిసెంబర్ 30న 67,053మంది భక్తులు, 31న 70,256మంది భక్తులు, జనవరి 1న 65,225మంది భక్తులు, నాల్గవరోజు శుక్రవారం 83,032మంది భక్తులకు దర్శనాలు చేయించడం టిటిడి అధికారుల సమిష్టికృషికి నిదర్శనం,



# తిరుమల సమాచారం

## ముందస్తు ప్రణాళికలతోనే ఆలయాల్లో సమయానికి కైంకర్యాలు, వాహనసేవలు

### - టిటిడి ఇఒ ఎకె సింఘాల్



**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం అనుబంధంగా ఉన్న ఆలయాలు,స్థానిక ఆలయాల విశిష్టతను భక్తులకు అందించేందుకు అసవరమైన చర్యలు తీసుకోవాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఆలయాల్లో క్యూలైన్లు, సిసిటివిలు, సెక్యూరిటీ, రవాణా, ట్రాఫిక్ తదితర అంశాలపై ,సరైన సమయానికి కైంకర్యాలు, వాహనసేవలకు సంబంధించి ,ప్రధాన ఉత్సవాలు నిర్వహణకు ముందస్తు ప్రణాళికలు ఉండాలన్నారు. టిటిడి స్థానిక ఆలయాలు, అనుబంధ ఆలయాల ప్రాశస్త్యం, శిల్ప సౌందర్యం ప్రధాన అంశాలను భక్తులకు చేరవేసేందుకు అవసరమైతే నిజమైన పారదర్శకతకు కృత్రిమ మేధ సాంకేతికతను సాయం తీసుకోవాలన్నారు. శనివారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మాం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎఫ్ఎసిఎఒ బాలాజీ, సిఇ టివి సత్యనారాయణ, డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఇఒ సింఘాల్ పలు అంశాలపై సమీక్షించారు. భక్తులకు వైద్యసేవలు, శ్రీవారిసేవకుల సేవలు, పుష్కరిణిని శుభ్రంగా ఉంచేలా చర్యలు, బడ్జెట్, వ్యర్థాలనిర్వహణపై ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అన్నప్రసాదాల కోసం ఉన్న అన్ని అకౌంట్లను ఉపయోగించుకోవాలని, ఆలయాల్లో అన్నదానం పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు., టిటిడి ఆలయాల్లో విశిష్టతను భక్తులకు మరింతగా అందించేందుకు అవసరమైతే ఎస్వీబిసి ఆధ్వర్యంలో మరో ఛానెల్ తీసుకువచ్చే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఇఒ సింఘాల్ తెలిపారు.

## రిలయన్స్‌సంస్థ టిటిడికి రూ.3కోట్లు విరాళం



**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం కు రిలయన్స్ సంస్థ పలు పథకాలకు మూడుకోట్ల రూపాయలు విరాళం అందించింది. ఆ సంస్థ సిఇఒ ,ఇడి పిఎంఎస్ ప్రసాద్ శనివారం ఉదయం టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్‌కు డిడిని అందజేశారు. రిలయన్స్ సంస్థ పలు దఫాలుగా పలు రకాలుగా టిటిడికి ఇతోధిక సేవలందించడమే గాక విరాళాలు అందిస్తోంది.

## ప్రాణదానం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు దాత విరాళం అందించాడు. ఒడిశ్శాకు చెందిన శివకాండీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు డిడిని ఆ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందించారు.

## సూర్యజయంతికి విస్తృత ఏర్పాట్లు

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిథి ఘడియల్లో ఈనెల 25వతేదీ సూర్య జయంతి (రథసప్తమి) వేడుకలు అంగరంగ వైభ వంగా జరిపించేందుకు టిటిడి అధి కారులు సన్నాహాలు చేస్తున్నారు. 25న ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఒకేరోజు ఏడు వాహ నాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు. ఆరోజు ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోబాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దు చేసింది. ఈ మినీబ్రహ్మోత్సవం కోసం అన్ని రకాల ఏర్పాట్లు, మాఢవీధుల్లో గ్యాలరీలు, ప్రవేశ నిష్క్రమణ మార్గాలు,జర్మన్ షెడ్డు ఏర్పాట్లు చేస్తున్నారు.

## అందరికీ శుభాలు కలగాలి: ప్రముఖులు

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిథి ఘడియల్లో ఈనెల 25వతేదీ సూర్య జయంతి (రథసప్తమి) వేడుకలు అంగరంగ వైభ వంగా జరిపించేందుకు టిటిడి అధి కారులు సన్నాహాలు చేస్తున్నారు. 25న ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఒకేరోజు ఏడు వాహ నాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు.

## పరశురామేశ్వరాలయంలో మొదటిసారి ఆరుద్ర పూజలు

**శ్రీకాళహస్తి,జనవరి 3 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో మొదటి సారి అరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకాభిషేకాలు ఏర్పాటు చేసారు. ఆలయానికి పాలక మండలి నియమించిన తరువాత ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తలగిరి నాయుడు వారి సహాచరులు ఆలయంలో వచ్చిన మొదటి పూజా కార్యక్రమాలను పౌర్ణమి సందర్భంగా నూతన సేవను ఏర్పాటు చేసారు. శనివారం జరిగిన కార్యక్రమాలకు ప్రజల నుంచి భక్తుల నుంచి విశేష స్పందన వచ్చిందని చైర్మెన్ గిరినాయుడు ప్రభాత వార్తకు వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత శాసనసభ్యుడు సుధీర్ రెడ్డి ఈ ఆలయాభివృద్ధి, పూజలకు సంబంధించి స్పందించారు. ఈ నేపధ్యంలో శివయ్య జన్మనక్షత్రం సందర్భంగా మొదటి సేవా కార్యక్రమాలకుశ్రీకారం చుట్టటానికి ఎంఎల్‌ఏతో చర్చించినట్లు వివరించారు.



**నూతనంగా వస్త్ర సేవ ప్రారంభం:** గుడిమల్లంలోని పరశురామేశ్వరాలయంలో కొత్త పూజలు చేపట్టాని భావించి శివయ్య జన్మనక్షత్రం సందర్భంగా 'వస్త్ర సేవను' ప్రవేశ పెట్టారు. మొదటి ఉభయదారులుగా సహస్ర ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ శబరి, డాక్టర్ శారద, కేఆర్ గ్రూప్ తిరుపతి యాజమాన్యం కందిశెట్టి యువకిషోర్ ధర్మపత్ని వైష్ణవి కోయిలమ్మలు వస్త్రసేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలతో పాటు పూజా సేవ లకు అవసరమైన సుగంధ ద్రవ్యాలను అందించారు. అంగరంగ వైభవంగా స్వామి వారికి అభిషేకాలు జరిపి నూతన వస్త్రాలతో అలంకరించారు. దాతలు తెచ్చిన వస్త్రాలతో పాటు పూలతో ముస్తాబు చేసారు. కాగా ప్రదోష కాలంలో నిర్వహించిన 'వస్త్ర సేవకు' గంగయ్య యాదవ్ వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ సేవకు టిక్కెట్లు ఖరారు చేసిన రూ.5వేల టిక్కెట్లును జారి చేసారు. ఈ సేవలను ప్రతి మాసం ఆరుద్ర నక్షత్రం రోజున నిర్వహించుటకు నిర్ణయించినట్లు ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి ప్రభాతవార్తకు వివరించారు.

# సంక్రాంతి పండుగ దృష్ట్యా - విజయవాడ వెస్ట్ బైపాస్‌లో కాజ నుంచి గొల్లపూడి వరకు ఒకవైపే వాహనాలకు అనుమతి



**విజయవాడ,జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ దృష్ట్యా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో కాజ నుంచి గొల్లపూడి వరకు ఒకవైపు వాహనాలకు అనుమతినిచ్చింది. తొలుత కార్లు, ద్విచక్ర వాహనాలను ఈ మార్గంలో వెళ్లేందుకు అవకాశం కల్పిస్తారు. దీంతో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఈ బైపాస్ మీదుగా నేరుగా గొల్లపూడి, అక్కడి నుంచి చిన్నఅవుటపల్లి మీదుగా ఏలూరు వైపు వెళ్లవచ్చు. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాక్షి కంగా ఒక వైపు వాహనాలు వెళ్లేందుకు అనుమతినిచ్చే దిశలో ఆలోచన చేస్తున్నారు. వెస్ట్ బైపాస్‌లో భాగంగా కాజ- గొల్లపూడి మధ్య 17.88 కి.మీ, గొల్లపూడి- చిన్నఅవుటపల్లి మధ్య 30 కి.మీ. ఆరు వరుసల హైవే నిర్మాణం చేపట్టారు. గొల్లపూడి- చిన్నఅవుటపల్లి మధ్య నిర్మాణం పూర్తికాగా నవంబరు నుంచి ఇందులో అన్ని వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నారు. ఇప్పుడు కాజ- గొల్లపూడి మధ్య కూడా ఒకవైపు వాహనాలను అనుమతించనున్నారు. కాజ నుంచి గొల్లపూడి వైపు (ఒకవైపు) మార్గాన్ని సంక్రాంతికి సిద్ధం చేస్తున్నారు. చెన్నై- కోల్‌కతా హైవేకు ఈ వెస్ట్ బైపాస్‌లోకి అనుసంధానం అయ్యే పనుల్లో ఒకవైపు పూర్తయ్యాయి. దీంతో చెన్నై, ఒంగోలు, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలను కాజ సమీపంలో వెస్ట్ బైపాస్‌లోకి వెళ్లి గొల్లపూడి చేరుకొని, అక్కడ విజయవాడ- హైదారాబాద్ హైవేలో కలవవచ్చు. ఏలూరు వైపు వెళ్లే వాహనాలు గొల్లపూడి వద్ద దిగకుండా నేరుగా చిన్నఅవుటపల్లి మీదుగా ఏలూరు రోడ్డుపైకి చేరుకోవచ్చు. దీనివల్ల గుంటూరు వైపు నుంచి వచ్చే కార్లు విజయవాడ నగరంలోకి రావాల్సి అవసరం లేకుండానే బైపాస్‌లో ఒకవైపు ప్రయాణించి హైదరాబాద్ వైపుగాని, ఏలూరువైపు వెళ్లవచ్చు. ఇందుకు వీలుగా సంక్రాంతి నాటికి అధికారులు పనులు పూర్తి చేయనున్నారు. వెస్ట్ బైపాస్‌లో అటు ఏలూరు, గొల్లపూడి వైపు నుంచి వచ్చే కార్లు, బైకులు తదితర వాహనాలను ప్రస్తుతం రాష్ట్ర సచివాలయం, హైకోర్టులకు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ వాహనాలు కృష్ణా నది వంతెన, సీడ్ యాక్సెస్ రోడ్డు దాటిన తర్వాత వచ్చే టోల్‌ప్లాజా సమీపంలో మంగళగిరి మండడం రోడ్డులోకి చేరుకొని, అక్కడి నుంచి సచివాలయం ఎ ఎ వెళ్తున్నాయి. ఇలా గొల్లపూడి వైపు నుంచి వాహనాలను ఈ నెలాఖరుకు హాయ్‌ల్యాండ్ రోడ్డు వరకు అనుమతించేలా బైపాస్‌లో రెండో వైపు కూడా పనులు పూర్తి చేయనున్నారు. వెస్ట్ బైపాస్ నుంచి హాయ్‌ల్యాండ్ రోడ్‌లో దిగే వాహనాలు చెన్నైకోల్‌కతా హైవే సర్వీస్ రోడ్డులోకి వెళ్తాయి. మార్చి నెలాఖరులోపు వెస్ట్ బైపాస్‌లో పెండింగ్ పనులన్నీ పూర్తి చేయనున్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి చెన్నై- కోల్‌కతా హైవేపై వెళ్లే అన్ని వాహనాలను వెస్ట్ బైపాస్ మీదుగా ఇరు వైపులా పూర్తిస్థాయిలో రాకపోకలు సాగించేలా అనుమతిస్తారు. అధికారికంగా ఆనాటి నుంచే వెస్ట్ బైపాస్ పూర్తిగా తెరిచినట్లు అవుతుందని, అప్పటి వరకు చిన్న వాహనాలను ప్రయోగాత్మకంగానే

# గ్యాస్ సమస్యల్ని తగ్గిస్తాయి !

మహిళల్లో వివిధ దశల్లో ఏర్పడే హార్మోన్ల అసమతౌల్యత, గ్యాస్ సమస్యల్ని తగ్గించుకోవడానికి ఆహారమూ కొంతమేర సాయపడుతుంది. అదెలాగంటే.. ప్రొటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి, ముఖ్యంగా పాలకూర, ముల్లంగి ఆకు, యాపిల్, దోస, బొప్పాయిల్లో ఎక్కువగా పీచు ఉంటుంది. వీటిల్లోని ఫైబర్ జీర్ణ సమస్యల్ని తగ్గిస్తుంది. ఇందులోని పోషకాలు హార్మోన్ల పనితీరునీ క్రమబద్ధీకరిస్తాయి. సంప్రదాయ ఆహారంగా, సుగంధ ద్రవ్యాల్లో ఒకటిగా పిలిచే జీల కర్రకు జీర్ణ వ్యవస్థ పనితీరుని మెరుగుపరి చేశక్తి ఎక్కువట. ఇందులోని ఐరన్ రక్తహీనత సమస్య ను రానివ్వదు. జీలకర్ర లో ప్లాంట్ బేస్డ్ కాంపౌండ్స్ అధికం. ముఖ్యంగా ఫైటో ఈస్ట్రోజన్లు... మహిళల్లో మెనోపాజ్ దశలో కనిపించే మూడ్ స్వింగ్స్, వేడి ఆవిర్లను తగ్గిస్తాయి. హార్మోన్ల అసమతౌల్యతను సక్రమంగా చేసే సహజ మూలికగా అల్లానికి పేరు. ఇందులోని జింజిరోల్స్ జీర్ణశక్తిని మెరుగు పరిచి హార్మోన్ల పనితీరుని బాగు చేస్తాయి.



# హస్త కళలకు కొత్త ఊపిరి

ఏ ప్రాంతమైనా తీసుకోండి.. మన పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చే కొన్ని సంప్రదాయాలు, కళలు ఉంటాయి. తరవాతి తరాలు వాటిని కొనసాగిస్తే అవి బతుకుతాయి. లేదంటే కనుమరుగవుతాయి. తన బామ్మ నుంచి నేర్చుకున్న కళ అలా అంతరించి పోవద్దు అనుకున్నారు రీతా! ఆమె ప్రయత్నం విదేశీయులను ఆకర్షించ డమే కాదు.. వందలమందికి ఉపాధినీ కల్పిస్తోంది.


రీతా ఆదివాసి మహిళ. ఈమెది ఉద్దమ్ నగర్. తరవాత వారణాసిలో స్థిరపడ్డారు. అప్పట్నుంచీ ఆమె ప్రయత్నం ఒక్కటే తన హస్త కళను బతికించుకోవడం! ఈమె 'ముంజ్' అనే క్రాఫ్ట్‌ను సాధన చేసేవారు. ఇది తన పూర్వీకుల కళ. రీతా తన అమ్మమ్మ, నానమ్మల నుంచి దీన్ని నేర్చుకున్నారు. ఈ కళ దాదాపు అంతరించిపోయే దశకు చేరుకుందట. తనూ వదిలేస్తే తరవతి తారలకు అంద దన్న ఉద్దేశంతో కొనసాగిస్తూ వచ్చారు. ముంజ్ అనే ఒక గడ్డిని అల్లుతూ బుట్టలు, బొమ్మలు, గృహాలంకరణ వస్తువులు చేస్తారు. 'ఇది ఉత్తరాది రాష్ట్రాల్లో నదీ ప్రాంతాల్లో మాత్రమే దొరికే గడ్డి రకం. పర్యావరణహితం ఎక్కువ కాలంపాటు మన్నుతాయి. మా తెగల వేడుకలు, పండుగ లేవైనా ఈ గడ్డితో చేసిన వస్తువు లు ఉండాల్సిందే. వీటిని శుభప్రదంగానూ భావిం చాం. కాబట్టే పూజ వస్తువులను ఈ గడ్డితో చేసిన బుట్టల్లో పెట్టుకుని మరీ తీసుకెళతాం. వీటి తయారీకి నదుల వద్దకు వెళ్లి ఈ గడ్డిని సేకరిస్తాం. శుభ్రపరిచి ఒక్కొక్కటిగా విడదీసి ఎండ బెడతాం. ఈ క్రమంలో పాడవకుండానూ, కుళ్లిపోకుం డానూ చూసుకోవాలి. ఒక్కో వస్తువు తయారవడానికి 23 రోజులు పడుతుంది అంటారు రీతా. తొలిరోజుల్లో ఈమె ఒక్కరే. క్రమంగా మరికొందరిని చేర్చుకుని నేర్పించి, ఉపాది కల్పించడం మొదలు పెట్టారామె. ప్రభుత్వం, ఎన్‌జిఓలు సాయంగా నిలవడంతో వీటి ఉత్పత్తులకు మార్కెటింగ్ ఏర్పడింది. దీంతో వీళ్లూ ఆధునికతను అందిపుచ్చుకున్నారు. గృహాలంకరణ వస్తువులు, పిల్లల ఆట వస్తు వులు, ఆభరణాలు, పెన్ హోల్డర్లు.. ఇలా ఎన్నింటినో తీసుకొచ్చారు. గత ఏడాది ఈ మహిళలు ప్రధాని మోదీని కలిసినప్పుడు వీరికి అండగా ఉంటామని మాటనిచ్చారట. దీంతో ఎక్కడ ఎగ్జిబిషన్లు జరిగినా వీరికి స్టాల్స్ పెట్టుకునే అవకాశం కల్పిస్తు న్నారు. ఫలితంగా 500 మంది మహిళలు ఉపాధి పొందు తుండటమే కాదు .. నెలకు రూ.15-20 వేలు సంపాదించుకోగలుగుతున్నారు. అంతే కాదు, వీరి ఉత్పత్తులకు విదేశాల నుంచీ ఆర్డర్లు వస్తున్నాయి. జర్మనీలో వీటికి ఎక్కువ గిరాకీ ఉందట. ఒకప్పుడు డబ్బులు అవసరమైతే ఇంట్లో మగవాళ్లనీ అడిగేవాళ్లం. ఇప్పుడు మా కాళ్ల మీద నిలు బడుతున్నాం. ఇంటి స్థితిగతులనీ మార్చుకు న్నాం అంటారీ మహిళలు. వార సత్వ కళని ముందుకు తీసుకెళ్లడమే కాదు.. వాటితో తమ జీవితాల్నీ మార్చుకుంటున్న రీతానీ ఆమె బృందాన్నీ అభినందించాల్సిందే కదూ!





# తిరుప్పావై

## 20వ పాశురము



ముప్పత్తుమూవర్
అమరర్కుమున్ శెన్ఱు,
కప్పమ్ తవిర్కుమ్ కలియే!
తుయిలెళాయ్,
శెప్పముడై యాయ్ ! తిఱలుడై
యాయ్! శెత్తార్కు
వెప్పం కొడుక్కుమ్ విమలా !
తుయిలెళాయ్
శెప్పన్న మెన్ములైచ్చెవ్వాయ్ చ్చిఱు
మరుఙ్గుల్
నప్పిన్నై నఙ్గాయ్! తిరువే !
తుయిలెళాయ్
ఉక్కముమ్ తట్టొళియుమ్ తన్దున్
మణాళనై
ఇప్పోతే యెమ్మై నీరాట్టేలో
రెమ్బావాయ్ .

ముప్పది మూడుకోట్ల దేవతలకు ఆపద వచ్చు నేమో యని, వారి భయమును పోగొట్టుటకై శత్రువులను భయపెట్టువాడు, మనోవాక్కాయ కర్మలచేత ఆశ్రితశత్రు వులకు భయజ్వరము కలిగించువాడు. బలముగల వాడు అయిన ఓ కృష్ణా మేల్కొనుము". "బంగారు చెండులవంటి మరియు సుకుమార మైన స్థానసౌందర్యముకల ఎర్రని పెదవులు సన్నని నడుము కల లక్ష్మీ సంపన్నురాలా ! నీలా ! నిద్ర మేల్కొని నడిచిరావమ్మా ! విసనకర్ర మీద అద్దము ఇవ్వవమ్మా ! నీ వల్లభుని మాతో స్నానమాడుటకు ఒప్పించవమ్మా ! " అని వెలుపలికి వెళ్ళ

ఫలం: "అన్యోన్య దాంపత్యం"

# పండుగ తీపి రుచులు

ఏ ప్రత్యేక సందర్భం వచ్చినా ఏవేవో వంటలు చేస్తుంటాం. మళ్లీ పండుగ వరకు గుర్తిండిపోవాలి. ఆత్మీయులతో కబుర్లు చెబుతూ పసందైన మిఠాయిలు తింటుంటే.. అంతకంటే మజా ఏముంటుంది? అందుకే మీ కోసం ఈ స్పెషల్ రెసిపీలు.

## యాపిల్ డిలైట్

**కావలసినవి:** మైదా అర కప్పు, మిల్క్ మెయిడ్ 200 గ్రాములు, చిక్కటి పాలు ముప్పావు కప్పు, యాపిల్స్ 3, బాదం, జీడిపప్పు పలుకులు కప్పు, బటర్ 50 గ్రా, దాల్చినచెక్క పొడి అర చెంచా, బేకింగ్ పౌడర్ చెంచా టాపింగ్ కోసం: మైదా, బటర్, పంచదార పొడి 2 టేబుల్స్పూన్ల చొప్పున **తయారీ:** యాపిల్ పండ్ల చెక్కు, విత్తనాలు తీసి ముక్కలుగా కోసుకోవాలి. మిక్సింగ్ బౌల్లో మైదా, మిల్క్ మెయిడ్, పాలు, బటర్, బేకింగ్ పౌడర్, దాల్చినచెక్క పొడి, యాపిల్ ముక్కలు, బాదం, జీడిపప్పు పలుకులు వేసి కలపాలి. బేకింగ్ డిష్‌లో వెన్న రాసి.. యాపిల్ మిశ్రమాన్ని సమంగా సర్దాలి. ఒక ప్లేటులో పంచదార పొడి, బటర్, మైదాలను కలిపి.. యాపిల్ మిశ్రమం పైన చల్లాలి.



అవెన్‌లో 180 డిగ్రీ వద్ద ప్రీహీట్ చేసి.. అరగంట బేక్ చేయాలి. అంతే.. బంగారు రంగులో నోరూరించే యాపిల్ డిలైట్ సిద్ధం.

## సోహాల్ హాల్వా



**కావలసినవి** గోధుమపిండి, పురా, మిల్క్ పౌగర్ 4 టేబుల్‌స్పూన్ల చొప్పున, పంచదార కప్పున్నర. నెయ్యి కప్పు, పిస్తా బాదం, జీడిపప్పు పలుకులు కప్పు **తయారీ** ఒక పాత్రలో గోధను పిండి, మైనా, మిను కలపాలి. ఫ్యాన్‌లో నెయ్యి, పంచదార . గోధుమపిండి, మైదా, మిల్క్ పౌడర్ల మిశ్రమం చేసి కలియ తిప్పుతూ రెండు నిమిషాల తర్వాత దించాలి. చిన్న బౌల్స్ నెయ్యి రాసి, డ్రైఫ్రూట్స్ పలుకులు వేయాలి. వాటి మీద హల్వా వేసి సమంగా సర్దాలి. అంతే.. రుచికరమైన మిఠాయిని ఆస్వాదించండి.

## ధార్వాడ్ పేడా



**కావలసినవి:** తరిగిన పనీర్ 2 కప్పులు, ఖోయా కప్పు, పంచదార ఒక కప్పు 2 టేబు ల్స్పూన్లు, నెయ్యి 2 చెంచాలు, పాలు 6 టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి పావుచెంచా **తయారీ:** కడాయిలో స్పూన్ నెయ్యి వేడిచేసి పన్నీరు లేత గోధుమ రంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో పంచదార, 2 టేబుల్ స్పూన్ల పాలు జతచేసి కలుపుతుండాలి. పనీర్ క్రిస్పీ అయ్యాక దించాలి. చల్లారాక 2 టేబుల్స్పూన్ల పాలు జతచేసి గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో నెయ్యి, మిగిలిన పాలు, యాలకుల పొడి కూడా వేసి కలపాలి. మిశ్రమంలో తడి ఇంకిపోయి కడాయి అంచులకు అంటుకోకుండా విడిపోతున్నప్పుడుసెగ తీయాలి. మిశ్రమం కాస్త చల్లారాక.. పేడా చేసుకుని పంచదారలో ముంచి తీస్తే.. తియ్యటి ఖిధార్వాడ్ పేడఖి రెడీ. కర్నాటక వారి ఈ స్వీటు 175 ఏళ్ల చరిత్ర ఉంది.



## రాజ్ భోగ్


**కావలసినవి:** పాలు లీటర్, పంచదార కప్పున్నర, యాలకుల పొడి అర చెంచా, కుంకుమపువ్వు కొద్దిగా, నిమ్మరసం చెంచా, రోజ్ వాటర్ కొన్ని చుక్కలు, గుల్కంద్ చెంచా, బాదం, పిస్తా పలుకులు చారెడు**తయారీ:** మరుగుతున్న పాలలో నిమ్మరసం వేయాలి. విరిగిన పాలను వడకట్టాలి. అందులో చల్లటి నీళ్లు పోసి మరోసారి వడకడితే పులుపు వాసన పోతుంది. ఈ పన్నీరు పావుగంట పక్కనుంచాలి. ఈలోగా పంచదారలో యాలకుల పొడి, కుంకుమపువ్వు, 4 కప్పుల నీళ్లు పోసి మరిగించాలి. ఇప్పుడు పన్నీర్ ను నాలుగైదు నిమిషాలు చపాతీపిండిలా కలపాలి. బాదం, పిస్తా పలుకుల్లో గుల్కంద్, రోజ్వాటర్, కొంచెం పంచదార సిరప్ కలిపి.. చిన్న బాల్స్ చేసుకోవాలి. పనీర్ను చిన్న అప్పల్లా చేయాలి. మధ్యలో డ్రైఫ్రూట్స్ బాల్ ఉంచి గుండ్రంగా కప్పేయాలి. అన్నీ అయ్యాక పంచదార సిరప్ లో వేసి సన్న సెగ మీద పది నిమిషాలు ఉడికించి సెగ తీయాలి. చల్లారాక ఏడెనిమిది గంటలు ఫ్రిజ్లో ఉంచాలి. బయటకు తీసి మిగిలిన బాదం, పిస్తా పలుకులతో్ గార్నిష్ చేస్తే వహ్వా అనిపించే "రాజ్‌భోగ్ రెడీ.

## నెయ్యప్పమ్

**కావలసినవి:** బియ్యప్పిండి కప్పు, మైదా, మొక్క జొన్న పిండి అర కప్పు చొప్పున, బెల్లం పావు కిలో, కొబ్బరి ముక్కలు 2 టేబుల్ స్పూన్లు, నల్ల నువ్వులు, నెయ్యి టేబుల్ స్పూన్ చొప్పున, యాలకుల పొడి అరచెంచా, ఉప్పు, బేకింగ్ సోడా చిటికెడు, నూనె వేయించేందుకు సరిపడా
**తయారీ:** బెల్లంలో కొన్ని నీళ్లు పోసి మరిగించి ఆ నీటిని వడకట్టాలి. అందులో బియ్యప్పిండి, మైదా, మొక్క జొన్న పిండి, యాలకుల పొడి, ఉప్పు, బేకింగ్ సోడా వేసి మళ్లీ మళ్లీ కలపాలి. కొబ్బరి ముక్కలు, నువ్వులను నేతిలో వేయించి.. వాటిని కూడా పిండిలో కలపాలి. ఈ పిండిని కాగుతున్న నూనెలో గరిటెడు చొప్పున వేసి.. రెండు వైపులా వేయించుకోవాలి. అంతే తియ్యటి 'నెయ్యప్పమ్' తిని ఆనందించడమే తరువాయి.



# రంగవల్లి



- ధనలక్ష్మి
నెల్లూరు

16 చుక్కలు,
2 వరుసలు
2 వరకు
సరి చుక్క



**ముగ్గులకు ఆహ్వానం:**

**మా చిరునామా:** ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు

# తెర

## 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సాంగ్ లాంచ్

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఖచ్చితంగా మీ అందరికీ నచ్చుతుంది: సాంగ్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ కిషోర్ తిరుమల మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఖిభర్త మహాశయులకు విజ్ఞప్తి. ఈ చిత్రంలో రవితేజ సరసన డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. మొదటి రెండు పాటలు ఇప్పటికే అద్భుతమైన స్పందనను పొందాయి. ఇప్పుడు, మేకర్స్ మూడవ ట్రాక్ వామ్మో వాయ్యో ను వరంగల్ లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్ లో లాంచ్ చేశారు. భీమ్స్ సిసిరోలియో మరోసారి మాస్ ఆడియన్స్ కట్టిపడేసే సాంగ్ కంపోజ్ చేశారు. 'వామ్మో వాయ్యో' ఫుల్ జోష్‌తో సాగే ఫోక్ ట్రాక్‌గా నిలుస్తూ, వినగానే ఎనర్జీని ఇస్తుంది. రవితేజ తన ట్రేడ్‌మార్క్ ఎనర్జిటిక్ డాన్స్ తో మరోసారి అభిమానులను అలరించారు. ఆశికా రంగనాథ్, డింపుల్ హయతి ఇద్దరూ గ్లామర్‌తో పాటు డ్యాన్స్ సినిమాకు ప్రసాద్ మురెళ్ల సినిమా టోగ్రఫీ అందిస్తుండ గా, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ తిళీ ప్రకాశ్. ఈ సంక్రాంతికి జనవరి 13న వస్తున్న భర్త మహాశయులకు విజ్ఞప్తిఖి తప్పకుండా చూడాల్సిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. సాంగ్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ కిషోర్ తిరుమల మాట్లాడుతూ.. హాయ్ వరంగల్. భద్రకాళి అమ్మవారు, రుద్రమదేవి పుట్టిన నేల ఇది. ఇక్కడికి వస్తే చాలా ధైర్యంగా అనిపించింది. భర్త మహాశయులకు విజ్ఞప్తి జనవరి 13న రిలీజ్ అవుతుంది.



## 'మన శంకర వర ప్రసాద్ గారు' ట్రైలర్ రిలీజ్




మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి హైలీ యాంటిసిపేటెడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు', విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్, ఆకట్టుకునే ప్రచార కార్యక్రమాలతో భారీ సంచలనం సృష్టిస్తోంది. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. 'మీసాల పిల్ల' పాట 100 మిలియన్లకు పైగా వ్యూస్ దాటగా, 'శశిరేఖ' పాట దాదాపు 40 మిలియన్ల వ్యూస్ తో ట్రెండింగ్‌లో కొనసాగు తోంది. చిరంజీవి, వెంకటేష్ నటించిన పాట 'సంక్రాంతి అదిరి పోది' ఒక ఫెస్టివల్ సాంగ్ లా మారింది. అనిల్ రావి పూడి ఇప్పటికే ఇది హైవోల్టేజ్ మాస్ ఎలిమెంట్స్‌తో పాటు క్రైమ్ డ్రామా షేడ్స్ కలిగిన ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఉండబోతుందని హింట్స్ నేపథ్యంలో ట్రైలర్ కోసం ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. మన శంకర వర ప్రసాద్ గార్ను సంక్రాంతి పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా జనవరి 12, 2026న థియేటర్లలోకి గ్రాండ్‌గా విడుదల కానుంది.

## 'సంకుటుంబానాం' సక్సెస్ మీట్



హెచ్ ఎన్ జి సినిమాస్ ఎల్ ఎల్ పి బ్యానర్ పై ఉదయ్ శర్మ రచన దర్శకత్వంలో మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మాతలుగా నేడు ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సఃకుటుంబానాం. రామ్ కిరణ్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో నటకిరీటి రాజేంద్రప్రసాద్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్, సత్య, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు కీలకపాత్రలో పోషిస్తున్నారు. మణిశర్మ ఈ సినిమాకు సంగీతాన్ని అందించగా మధు దాసరి డిఓపిగా పనిచేశారు. ఎడిటర్ గా శశాంక్ మలి చేశారు. సఃకుటుంబానాం చిత్ర బృందం సక్సెస్ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నట కిరీటి రాజేంద్ర ప్రసాద్ గారు మాట్లాడుతూ... "నా తెలుగు ప్రేక్షకులు అందరికీ పేరుపేరునా నమస్కారాలు తెలియచేసుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాను. నేను 48 సంవత్సరాలుగా అందరికీ ఒక కుటుంబ సభ్యుడిలా ఉన్నాను. ఇటువంటి మంచి సినిమాను ఆదరించి సఃకుటుంబానాం చిత్రాన్ని హిట్ చేశారు. కుటుంబం అంటే తెలుగు ప్రేక్షకులు ఆదరించడానికి ముందుంటారు.

## 'గోదారి గట్టుపైన' టీజర్ లాంచ్



గోదారి గట్టుపైన సినిమా టికెట్ కొని థియేటర్లో కూర్చుంటే గోల్డెన్ అవర్ లో గోదారి పడవ ఎక్కినట్టుగా ఉంటుంది. చాలా ఎంజాయ్ చేస్తారు: టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో సుమంత్ ప్రభాస్ మేమ్ ఫేమస్ తో స్ట్రాంగ్ డెబ్యు చేసిన న్యూ ఏజ్ యాక్టర్ సుమంత్ ప్రభాస్ ఖిగోదారి గట్టుపైనఖి సినిమాతో అలరించబోతున్నారు. ఈ చిత్రం రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ కు ఫస్ట్ వెంచర్. లీళి ప్రొడక్షన్స్ షార్ట్ ఫిల్మ్‌లతో పాపులరైనా సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నిధి ప్రదీప్ కథానాయికగా అరంగేట్రం చేస్తుండగా, జగపతి బాబు, రాజీవ్ కనకాల కీలక పాత్రలు పోషిస్తున్నారు. గోదారి గట్టుపైన ప్రపంచాన్ని పరిచయం చేస్తూ ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ ఈరోజు లాంచ్ చేశారు. గోదావరి తీర ప్రాంతం నేపథ్యంగా రూపొందిన ఈ చిత్రం, గ్రామీణ జీవితంలోని ఉత్సాహాన్ని ఆస్కార్స్బ్బ్బు గ్యాంగ్‌గా పాపులరైన ఫ్రెండ్స్ గ్యాంగ్ ద్వారా ఆకట్టుకునేలా చూపించారు. సుమంత్ ప్రభాస్ రాజు పాత్ర సరదా మనస్తత్వం కలిగిన యువకుడిగా కనిపించారు. అతని జీవితంలో మాయ (నిధి ప్రదీప్) రావడంతో మొదలయ్యే ప్రేమకథ జాలీగా, హ్యూమర్, స్నేహం-పండుగ వాతావరణాల మధ్య ఆహ్లాదంగా సాగుతుంది..సుమంత్ ప్రభాస్ సహజంగా రాజు పాత్రలో ఒదిగిపోయాడు. అతని కామిక్ టైమింగ్ ఆకట్టుకుంటుంది. నిధి ప్రదీప్ అందంగా కనిపించింది. సాయి సంతోష్ సినిమాటోగ్రఫీ గోదావరి ప్రాంతాన్ని సహజత్వంతో, కళ్లకు విందుగా చూపిస్తే, నాగ వంశీ కృష్ణ సంగీతం సినిమాకు పర్ఫెక్ట్ లైట్ బ్రీజీ గ్రామీణ వాతావరణాన్ని అందిస్తుంది. సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ.. అందరికి నమస్తే. అందరికీ హ్యాపీ న్యూ ఇయర్. చాలా రోజుల తర్వాత ఈ స్టేజ్ పైకి రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా షూటింగ్ కోసం ఫస్ట్ టైం గోదావరి వెళ్ళాను. ఆ ప్రాంతానికి వెళ్ళినప్పుడు అర్థమైంది

## 'స్కై' లిరికల్ సాంగ్ రిలీజ్,



ఫిబ్రవరి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న మూవీ..మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా 'స్కై'. పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. "స్కై" సినిమా ఫిబ్రవరి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'నిను కసిరిన సమయాన...' అనే లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ పాటకు పృథ్వీ పెరిచెర్ల మంచి లిరిక్స్ రాయగా, వైష్ణవి ఆకట్టుకునేలా పాడారు. శివప్రసాద్ బ్యూటిఫుల్ ట్యూన్ తో కంపోజ్ చేశారు. 'నిను కసిరిన సమయాన' పాట ఎలా ఉందో చూస్తే ఖినిను కసిరిన సమయాన, నను మరచిన నా హృదయం, అడుగడుగున నిను వెతికి, అణువణువున నిను తలచి, ఆలోచనంతా నీ వెనకే, ఆరాధనంతా నీ కొరకే.. అంటూ లవ్ ఫీల్ తో ఆకట్టుకుంటోందీ పాట. "స్కై" సినిమా నుంచి ఇప్పటిదాకా రిలీజ్ చేసిన తపనే తెలుపగ.., పోయేకాలం నీకు.., నిన్ను చూసిన.. సాంగ్స్ ఛాట్ బస్టర్స్ గా మారి మిలియన్ వ్యూస్ రీచ్ అయ్యాయి. ఈ సాంగ్ కూడా మ్యూజిక్ లవర్స్ ఆదరణ పొందుతుందని మేకర్స్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు.

## తెలుగులో యాక్షన్ థ్రిల్లర్ 'ది టాస్క్'



డ్రామా, యాక్షన్ థ్రిల్లర్ ఇతివృత్తంతో కన్నడంలో రూపొందిన 'ది టాస్క్' చిత్రం అక్కడ ఘన విజయం సాధించింది. ఇప్పుడు అదే పేరుతో ఈ చిత్రం తెలుగులో రానుంది. జయసూర్య ఆర్.ఆజాద్, సాగర్ రామ్, శ్రీలక్ష్మి , రఘు శివమొగ్గ ప్రధాన పాత్రధారులు. రఘు శివమొగ్గ దర్శకత్వం వహించారు, కన్నడంలో ఇటీవలనే విడుదలై...అక్కడ విశేష ప్రేక్షకాదరణను చూరగొన్న ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకులు ముత్యాల సుబ్బయ్య తనయుడు ముత్యాల అనంత కిశోర్ తెలుగులో విడుదల చేయనున్నారు. గతంలో 'తల్లి మనసు' వంటి చక్కటి ఫ్యామిలీ కథా చిత్రం ద్వారా అభిరుచి గల నిర్మాతగా ముత్యాల అనంత కిశోర్ పేరు తెచ్చుకున్నారు. యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ చిత్రంలో అంతా కొత్త వారు నటించారని, తెలుగు ప్రేక్షకులకు కూడా ఈ చిత్రం ఎంతగానో నచ్చుతుందన్న అభిప్రాయాన్ని ముత్యాల అనంత కిశోర్ వ్యక్తంచేశారు. మిగతా వివరాలను త్వరలో అందజేస్తామని ఆయన తెలిపారు.

## షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల ఫైనల్లో
# అమీరా ఉత్కంఠ గెలుపు



**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల ఫైనల్‌లో అమీరా అర్షద్ ఉత్కంఠభరితంగా గెలవగా, పురుషుల ట్రాప్‌లో జుహైర్ ఖాన్ స్వర్ణం సాధించాడు. మధ్యప్రదేశ్ షూటింగ్ అకాడమీలో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల ఫైనల్‌లో అమీరా అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె రైల్వేస్‌కు చెందిన రాజశ్రీ అనిల్‌కుమార్ సాంచెటిని 0.1 పాయింట్ల తేడాతో ఓడించి 251.9 స్కోరుతో ముగించింది. సంచేటి 251.8తో రజతం, ప్రాంజు శ్రీ సోమాని 230.5తో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. తర్వాత న్యూఢిల్లీలోని డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన పురుషుల ట్రాప్‌లో జుహైర్ ఖాన్ 43 హిట్‌లతో స్వర్ణం సాధించాడు. షాట్‌గన్ రేంజ్‌లో జూనియర్ పురుషుల ట్రాప్ కాంస్య పతక విజేత జుహైర్ పురుషుల ట్రాప్ ఫైనల్‌లో 43 హిట్‌లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇక శపత్ భరద్వాజ్ 40 హిట్‌లతో రజతం, ఒలింపియన్ కైనన్ చెనాయ్ 33 హిట్‌లతో కాంస్య పతకాన్ని సాధించారు. పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో అహ్వార్ రిజ్వి, మొహమ్మద్ అసద్ సుల్తాన్ (118), రయాన్ రిజ్వి (107) సంయుక్తంగా 345 పాయింట్లతో స్వర్ణం గెలుచుకుంది. అలాగే 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్ మహిళల ఫైనల్లో తిలోత్తమ సేన్ ఫైనల్లో 253.1 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. సమీక్ష సుభాష్ పాటిల్ 250.0 స్కోరుతో రజతం, రమిత 230.0 స్కోరుతో కాంస్యాన్ని సాధించింది. యూత్ ఉమెన్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో తిలోత్తమ 251.6 పాయింట్లతో తన రెండో స్వర్ణాన్ని సాధించింది.

## టాటా స్టీల్ చెస్‌లో గుకేష్ ఔట్
### అతని స్థానంలో నిహాల్



**న్యూఢిల్లీ:** కోల్‌కతాలో జరుగుతున్న ప్రతిష్టాత్మక 2026 టాటా స్టీల్ రాపిడ్ మరియు బ్లిట్జ్ టోర్నమెంట్ నుండి ప్రస్తుత ప్రపంచ చెస్ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్ వైదొలిగాడు. వ్యక్తిగత కారణాల వల్ల, గుకేష్ ఈ సంవత్సరం టాటా స్టీల్ చెస్ ఇండియాలో పాల్గొవడం లేదు. దీంతో ఈ టోర్నమెంట్‌లో గుకేష్ స్థానంలో కోల్‌కతాలో జరిగిన రాపిడ్ ఈవెంట్ మాజీ విజేత నిహాల్ సరిన్ బరిలోకి దిగనున్నారు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ ఛాంపియన్ అయిన ఈ ప్రతిష్టాత్మక ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ ఈవెంట్‌లో జనవరి 7 నుండి 11 తేదీ వరకు కోల్‌కతాలో జరిగే ఈ ప్రతిష్టాత్మక ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ ఈవెంట్‌లో విశ్వనాథన్ ఆనంద్‌తో తలపడాల్సి ఉంది. ప్రమోషనల్ ప్రచారాలలో గుకేష్ విస్తృతంగా పాల్గొన్నాడు. అంతేకాకుండా డిసెంబర్ 18న విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ టోర్నీలో పాల్గొనేవారి జాబితాలో గుకేష్ పేరు ఉంది. అయితే ఈ సంవత్సరం మొదటి టాప్ ఈవెంట్ అయిన టాటా స్టీల్ రాపిడ్, బ్లిట్జ్ టోర్నీ ఏడవ ఎడిషన్‌లో ఆడటం లేదని తాజాగా వెల్లడైంది. గుకేష్ స్థానంలో నిహాల్ సరిన్ ఎంపికయ్యాడు. కాగా ఈ ఏడాది ప్రధాన ఆకర్షణగా ప్రముఖ సీనియర్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాడు. ఈ నేపథ్యంలో గుకేష్ టోర్నీ నుండి వైదొలగడానికి అధికారికంగా ఎటువంటి కారణం పేర్కొనబడనప్పటికీ, డిసెంబర్ 30న దోహాలో ముగిసిన వరల్డ్ రాపిడ్, బ్లిట్జ్‌లో టోర్నీలో ఆనంద్ చేతిలో గుకేష్ ఓటమిపాలయ్యాడు. ఈ సంవత్సరం మొట్టమొదటి ఎలైట్ క్లాసికల్ టోర్నమెంట్ టాటా స్టీల్ మాస్టర్స్‌లో ఆనంద్ పాల్గొంటుండటంతో దీని నుండి గుకేష్ వైదొలగినట్లు తెలుస్తోంది.





# పాక్‌తో భారత్ ఢీ
### మళ్లీ హై ఓల్టేజ్ మ్యాచ్‌లు
### ఉత్కంఠగా మూడు టోర్నీలు

**న్యూఢిల్లీ:** భారత్,పాక్ మ్యాచ్‌అనగానే మైదానంలో ఇరు దేశాల మధ్య జరిగే యుద్ధంలా భావిస్తారు. ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌పాక్ పోరుకు మరింత క్రేజ్ పెరిగింది. ఇరు దేశాలే కాకుండా యావత్ క్రికెట్ ప్రపంచం ఈ దాయాదుల పోరుపై ఆసక్తికనబరుస్తోంది. కొత్త ఏడాదిలోనూ పాకిస్థాన్‌తో భారత్ ఢీ కొట్టనుంది. ఈ దాయాది దేశాల మధ్య మూడు టోర్నమెంట్లలో హై ఓల్టేజ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. అండర్ 19 ప్రపంచ కప్‌తో పాటు, పురుషుల, మహిళల టీ20 ప్రపంచ కప్‌లు దాయాదీ మ్యాచ్‌లకు వేదికగా నిలవనున్నాయి. గతేడాది భారత్, పాకిస్థాన్ జట్లు పలుమార్లు తలపడ్డాయి. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఒక సారి తలపడగా, ఆసియా కప్‌లో మూడు సార్లు ఢీకొన్నాయి. మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఒకసారి ఆడగా, అండర్ 19 ఆసియాకప్‌లో రెండు సార్లు తలపడ్డాయి. అండర్ 19 ఆసియా కప్ ఫైనల్ మినహా ప్రతీ మ్యాచ్‌లోనూ భారత్‌నే విజయం వరించింది. ఇక 2026లో ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే అండర్ 19 ఐసీసీ పురుషుల ప్రపంచ కప్‌లోనూ భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి.అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఇరు జట్లు లీగ్‌దశలో తలపడటం లేదు. తొలిసారి భారత్, పాకిస్థాన్ జట్లు వేర్వేరు గ్రూపుల్లో ఉన్నాయి. భారత్ గ్రూప్ బీలో బంగ్లాదేశ్, న్యూజిలాండ్, యూఎస్‌ఏతో ఉండగా, పాకిస్థాన్ గ్రూప్ సీలో ఇంగ్లండ్,స్కాట్లాండ్, జింబాబ్వేలు ఉన్నాయి. వేర్వేరు గ్రూప్‌లో ఉన్నందున లీగ్ స్టేజితో పాటు సూపర్6లో తలపడే ఛాన్స్ లేదు. కానీ ఇరు జట్లు మెరుగైన ప్రదర్శన కనబర్చితే సెమీఫైనల్ లేదా ఫైనల్లో తలపడే ఛాన్స్ ఉంది.అలాగే ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా శ్రీలంక, కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా ఫిబ్రవరి 15 భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు దేశాలు తటస్థ వేదికగా మ్యాచ్‌లు ఆడాలనే ముందస్తు ఒప్పందంలో భాగంగా ఈ మ్యాచ్ శ్రీలంకలో జరగనుంది. ఇరు జట్లు మెరుగైన ప్రదర్శన చేస్తే సెమీఫైనల్, ఫైనల్లో మరోసారి తలపడనున్నాయి. ఇక మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో మాత్రం భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఇంగ్లండ్ వేదికగా జరిగే ఈ టోర్నీ భారత్, పాకిస్థాన్ మ్యాచ్ ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జూన్ 14న జరగనుంది. మెరుగైన ప్రదర్శన కనబర్చితే సెమీఫైనల్ లేదా ఫైనల్లో మరోసారి తలపడవచ్చు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదన్న సంగతి తెలిసిందే. కేవలం ఐసీసీ టోర్నీల్లో మాత్రమే భారత్, పాకిస్థాన్ జట్లు తలపడుతున్నాయి.

## యూత్ కంటెండర్ టోర్నీలో
## దివ్యాంశి, సిండ్రెలా
# శుభారంభం

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటీటీ యూత్ కంటెండర్ టోర్నీలో భారత యువ ప్లేయర్లు దివ్యాంశి భౌమిక్, సింద్రెలా దాస్ శుభారంభం చేశారు. ఈ టోర్నీలో బాలికల అండర్ 17 సింగిల్స్ లీగ్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ దివ్యాంశి 11-4, 11-1, 11-2తో నిజా కామత్‌పై అలవోక విజయం సాధించింది. గత ఏడాది ఇదే టోర్నీలో అండర్15 తో పాటు, అండర్17 టైటిళ్లు దక్కించుకున్న దివ్యాంశి ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచింది. ఇందులో భాగంగా ఈ టోర్నమెంట్‌లో వరుసగా మూడు గేముల్లో ప్రత్యర్థిని చిత్తుచేసింది.మరో సింగిల్స్‌లో సింద్రెలా 11-6, 11-6, 11-2తో తానియా కర్మాకర్‌పై ఘనవిజయంసాధించింది. జపాన్ టీటీ ప్లేయర్ మికు మత్సుషిమా 11-6, 11-3, 11-8తో అన్వి గుప్తాపై గెలిచి నాకౌట్‌లోకి ప్రవేశించింది. ఇక బాలుర అండర్17 విభాగంలో టాప్‌సీడ్ రిత్విక్ గుప్తా 11-9, 11-5, 11-5తో ధృవా మల్లిఖార్జున్‌పై గెలిచాడు. లోకల్ ప్యాడ్లర్ వేద్ పంచల్ వరుసగా రెండు గేముల్లో గెలిచి గ్రూపులో అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే సమయంలో బాలుర అండర్ 13 విభాగంలో శౌర్య గోయల్ 10-12, 11-9, 13-11, 7-11, 11-6తో సుచేత్ ధర్నెవార్‌పై గెలిచి ముందంజ వేశాడు.





ఆట




## ఉమెన్స్ హాకీ లీగ్‌లో రాంచీ రాయల్స్ విక్టరీ

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఇండియా లీగ్ 2025-26లో రాంచీ రాయల్స్ 2-0 తేడాతో సూర్మా హాకీ క్లబ్‌ను ఓడించింది. రుతుజా దాదాసో పిసల్ (30వ నిముషం), సాక్షిరాణా (54) రెండు గోల్స్ చేశారు. రాంచీ రాయల్స్ ప్రారంభంలో ఆధిక్యంలో ఉన్నా, సూర్మా దాడిని ప్రదర్శించి మొదటి 15 నిమిషాల్లోనే 10 సర్కిల్ చొచ్చుకుపోయింది. 12వ నిమిషంలో సూర్మా మొదటి పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కానీ పెన్నీ స్క్విబ్ కొట్టిన షాట్‌ను మొదటి రషర్ ఆపాడు. 18వ నిమిషంలో, రుతుజా దాదాసో పిసల్ తీసిన షాట్‌ను సవిత సేవ్ చేసింది, హన్నా కాటర్ రీబౌండ్‌లో బంతిని నియంత్రించలేకపోయింది మరియు ఆ అవకాశాన్ని రాయల్స్ వృధా చేసుకుంది. 25వ నిమిషంలో, రాంచీ రాయల్స్‌కు చెందిన ఇషిక సర్కిల్ లోపల ఫౌల్ చేసి, సూర్మా హాకీ క్లబ్‌కు పెనాల్టీ స్ట్రోక్ ఇచ్చింది, అయితే, మాధురి కిండో చేసిన అద్భుతమైన సేవ్ కారణంగా స్క్విబ్ తిరస్కరించబడింది. మరుసటి నిమిషంలో, సూర్మా పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, వారు ఒత్తిడిని పెంచుతూనే ఉన్నారు, కానీ స్క్విబ్ స్ట్రైక్‌ను మళ్ళీ మొదటి రషర్ ఆపాడు. ఇది కూడా చదవండి 202526 పురుషుల హాకీ ఇండియా లీగ్ గురించి మీరు తెలుసుకోవలసినవన్నీ మొదటి అర్ధభాగం ముగియడానికి కొన్ని సెకన్లు మిగిలి ఉండగా, రాంచీ రాయల్స్ జట్టు తొలి గోల్ సాధించింది. అగోస్టినా అలోన్సో మిడ్‌ఫీల్డ్ నుండి సర్కిల్‌లోకి శక్తివంతమైన పాస్‌ను అందించాడు, రుతుజా దాదాసో పిసల్ బంతిని పరిపూర్ణంగా పట్టుకుని, నెట్‌లోకి మళ్లించి గోల్ చేయడంలో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. మూడవ క్వార్టర్ ప్రారంభ నిమిషాల్లో, సూర్మాకు చెందిన ఒలివియా షానన్ అద్భుతమైన వ్యక్తిగత ప్రయత్నం చేసింది, ప్రమాదకరమైన స్థితిలో ఆమె బ్యాక్ హ్యాండ్ షాట్ కొట్టి బంతిని గెలుచుకుంది, దీనిని రాంచీ రాయల్స్‌కు చెందిన బిచు దేవి ఖరీబమ్ తిరస్కరించింది. 34వ నిమిషంలో, మరియా ఓర్టిజ్ ఆటపట్టించే విధంగా రాయల్స్‌కు ఆధిక్యాన్ని పెంచింది, ఆమె తన మార్కర్‌ను అధిగమించి గోల్ వైపు తక్కువ దూరం నుండి షాట్ వేయడంలో బాగా రాణించింది, కానీ బంతి పోస్ట్‌ను తాకింది. ఆట ముగియడానికి కేవలం రెండు సెకన్లు మిగిలి ఉండగా, రాంచీ రాయల్స్ మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, కానీ బంతిని సమర్థవంతంగా ట్రాప్ చేయకపోవడంతో అవకాశం చేజారిపోయింది. 54వ నిమిషంలో, రాంచీ రాయల్స్ మరో అద్భుతమైన ఫీల్డ్ గోల్‌తో తమ ఆధిక్యాన్ని పెంచుకుంది. రాయల్స్ తమ ఆధిక్యంలో కొనసాగుతుండగా, సాక్షిరాణా (54ఖి) గోల్‌పోస్ట్ యొక్క కుడి ఎగువ మూలలోకి గట్టి కోణం నుండి శక్తివంతమైన స్ట్రైక్‌ను విడుదల చేసింది. మ్యాచ్ చివరి నిమిషంలో సూర్మా హాకీ క్లబ్ కీలకమైన పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, స్క్విబ్ డ్రాగ్‌ఫ్లిక్‌ను బిచు దేవి ఖరీబమ్ తిరస్కరించడంతో ఆమె ఆట క్లీన్ షీట్‌తో ముగిసింది.

# వెండి, పసిడి మార్కెట్లలో అదే దూకుడు

**న్యూఢిల్లీ,** జనవరి 3: బులియన్ మార్కెట్‌లో గత ఏడాది కొనసాగిన ర్యాలీ 2026 కేలండర్‌సంవత్సరంలో కూడా కొనసాగుతుందని బులియన్‌రంగ నిపుణులు అంచనావేస్తున్నారు. పసిడి, వెండి రెండూ కూడా దేశీయంగాను, గ్లోబల్ మార్కెట్‌లోనూ ర్యాలీతీసాయి. అమెరికా ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లకోతతో పెట్టుబడులన్నీ బులియన్‌రంగం వైపు మళ్లడంతో ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. పసిడి 2025లో 80శాతం పెరుగుదల నమోదుచేసింది. రూ.71,500 నుంచి రూ.1.39 లక్షలవరకూ పెరిగింది. వెండిధరలు కూడా అదేస్థాయిలో పెరిగింది. కిలో వెండి 90,500 నుంచి రూ.2,32 లక్షలవరకూ గత ఏడాది ఎగబాకింది. భౌగోళిక ఉద్రిక్తతలతో ఈక్విటీ సూచీల్లో హెచ్చుతగ్గులు, ఒడిదొడుకులు నమోదుకావడంతో ఇన్వెస్టర్లు మొత్తం వెండి బంగారు మార్కెట్లపైకి పెట్టుబడులు కుమ్మరించారు. డాలర్‌కరెన్సీ ట్రేడింగ్‌కావడంతో అంతరాజతీయంగా కొనుగోలుదారులకు ఎంతో చీప్‌గా కనిపిస్తుండటం కూడా ఒక కీలకం. ఇక విద్యుత్ వాహనాలు, 5జి, సోలార్ ప్యానెళ్లలో వెండి వినియోగం భారీగాపెరిగింది. దీనితో భారీ ఎత్తున సరఫరా కొరత నెలకొనడంతో దరలు ఒక్కసారిగాపెరిగాయి. దీనికితోడు 2026లోకూడా ఫెడ్‌రిజర్వు వడీరేట్లను సవరిస్తుందని అంచనాలు భారీగా ఉన్నాయి. దీనితో బంగారం వెండిధరలు మరింతగా పెరుగుతాయని అంచనా. స్థిరమైన రాబడులకు ఇపుడు వెండి, బంగారం మార్కెట్లే ఇన్వెస్టర్లకు కనిపిస్తున్నాయి. ప్రపంచ పసిడిమండలి, గోల్డ్‌మానశాక్స్ వంటివి 2026లో కూడా ఈ రెండు విలువైన ఖణిజాలు 20 నుంచి 30శాతంపెరుగుతాయని అంచనావేసాయి. బంగారందరలు రూ.1.50 లక్షలనుంచి రూ.1.75 లక్షలవరకూ చేరుతుందని, వెండిధరలు కూడా కిలో ఒక్కొంటికి రూ.3 లక్షలవరకూ చేరుకునే ఛాన్స్ ఉందని చెపుతున్నాయి.



2026లో కూడా బంగారం తులం రూ.1.50 నుంచి 1.75 లక్షల వరకూ

వెండి కిలో ఒక్కొంటికి రూ.3 లక్షల వరకూ వెళ్లే అంచనా

## కార్పొరేట్ రాబడులు రూపీ చెలామణిలే కీలకం!
### ఈవారం మార్కెట్లతీరుపై అంచనాలు

**న్యూఢిల్లీ, జనవరి 3:** దేశీయంగా స్థూల ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా కనిపించడంతో పాటు వివిధ విభాగాల్లో ర్యాలీలు వంటివి 2026లో కూడా కొనసాగవచ్చని నిపుణులు అంచనా. ఆటో, మెటల్స్‌రంగాల్లో ఈవారం భారీ మద్దతు లభించగా వచ్చే వారం కూడా కార్పొరేట్ త్రైమాసిక పలితాలు కీలకం అవుతాయి. ఇక డాలర్‌తోరూపాయి చెలామణి కూడా మూలధన వనరుల రాకకు కీలకంగా మారుతుంది. 89.97 వద్ద చెలామణి జరిగిన సంగతి తెలిసిందే. ఇక హెచ్ఎస్‌బిసి సేవలరంగ పిఎంఐ డిసెంబరులో 59.1 పాయింట్లకుపడిపోయింది. అంతకుముందున వంబరులో 59.8 పాయింట్లువరకూ ఉంది. అయితేసేవలరంగ కార్యకలాపాలుజనవరినుంచి ఊపందుకుంటాయని అందువల్లవచ్చేవారం మరింత మెరుగవుతుందని అంచనాలున్నాయి. ఉత్పత్తి,సేవలరంగంలో కూడా సానుకూల వృద్ధి ఈక్విటీ మార్కెట్లకు లాభం కలిగిస్తుందనిన ఇపుణుల అంచనా. ఇక ఏడో తేదీ బుధవారం ఎం3 మనీ రఫరా గణాంకాలు విడుదలవుతాయి. డిసెంబరు 26తేదీనే ఈ డేటా విడుదలయింది. మనీ సప్లయి ఎం3 భారత్‌లో రూ.2,91,363.75 బిలియన్‌లకు పెరిగింది. అదే నవంబరులో




అయితే రూ,2,89,454.93 బిలియన్ రూపాయలుగా ఉంది. ఇక 9వ తేదీ బానయంకురుణాల్లోప్రగతి నివేదికలు ప్రకటిస్తారు. వార్షిక ప్రాతిపదికన గత ఏడాది డిసెంబరునాటి రుణాలవద్ధి 11.5శాతంగా ఉంది. అదేరోజు డిపాజిట్ల వృద్ధిగణాంకాలు కూడా విడుదలవుతాయి. భారత్‌లో బ్యాంకింగ్ డిపాజిట్లు 10.2శాతం పెరిగినట్లు ఇప్పటికే ఆర్బీఐ ప్రకటించింది. ఇక విదేశీ కరెన్సీ రిజర్వులు కూడా కీలకం అవుతాయి. భారత విదేశ ఈకరెన్సీ ఖజానా 696.61 బిలియన్ డాలర్లకుపెరిగింది. పసిడి నిల్వలుకూడా 2.956 బిలియన్ డాలర్లుపెరిగి మొత్తం 113.32 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక అమెరికా ఉత్పత్తిరంగ పిఎంఐ సూచీ గణాంకాలు సోమవారం విడుదలవుతాయి. నవంబరులో 48.2 పాయింట్లకు తగ్గిన సూచీ పెరుగుతుందన్న అంచనాలున్నాయి.అలాగే జనవరి9వ తేదీ అమెరికా వ్యవసాయేతరరంగ గణాంకాలు కూడా విడుదల చేస్తుంది. అమెరికా ఉపాధిగణాంకాలపరంగా 64 వేలు నవంబరులో పెరిగాయి. అయితే అమెరికా నిరుద్యోగతి రేటు 4.6శాతానికి పెరిగింది. అలాగే ముడిచమురుధరలు, పసిడి గ్లోబల్ ఫ్యూచర్స్ సెటిల్‌మెంట్లు కూడా ఈ వారం మార్కెట్లను ప్రభావితంచేస్తాయని అంచనా.



# 5% రూపాయి పతనం!
### పరిస్థితిలో మార్పు వస్తుందంటున్న ఎస్‌బిఐ ఫండ్స్!

**న్యూఢిల్లీ, జనవరి 3:** భారత రూపాయి 2025 ఏడాది మొత్తంగా ఐదుశాతం పతనం చెందింది. రెండేళ్లక్రితం చూపించిన వార్షిక పనితీరుతో సమానంగా పతనం చెందినట్లు తెలుస్తోంది. అయితే కొత్త సంవత్సరంలో డాలర్ రూపాయి చెలామణిలో కొంత మార్పులు రావచ్చని ఎస్‌బిఐ అంచనావేసింది. కొన్ని గ్లోబల్ కరెన్సీలతో పోలిస్తే డాలర్ కొంత క్షీణించిందని, ఇతర గ్లోబల్‌కరెన్సీలు కొంతమేరలబ్ధి పొందినా రూపాయి మాత్రం ట్రేడింగ్ అంతంతమాత్రంగానే జరిగింది. ఎస్‌బిఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ అంచనాల ప్రకారంచూస్తే కరెన్సీ విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ పెట్టుబడులు మందగించడం ప్రధాన కారణంగాచూస్తోంది. ఎగుమతుల స్థాయి కూడా ఎక్కువ ఉన్నప్పటికీ చెల్లింపులకు డాలర్ ప్రామాణికం కావడంతో డాలర్‌కు డిమాండ్‌పెరిగింది. భారత్ ఈక్విటీలనుంచి విదేశీ ఇన్వెస్టర్లు సుమారు 18 బిలియన్ డాలర్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. కార్పొరేట్ రాబడులు తగ్గుతాయన్న అంచనాలే ఇందుకు మూలం. ఎఐ ఆధారిత అంతర్జాతీయ వృద్ధి, వర్ధమాన మార్కెట్లకు మంచి అవకాశాలు కనిపించడంతో పెట్టుబడులు దారిమళ్లాయి. ఈపరిస్థితులమధ్య ఎస్‌బిఐ రూపాయి వచ్చే ఆర్థిక సంవత్సరంలోకూడా రెండుశాతం వరకూ క్షీణించవచ్చని అంచనావేసింది. డాలర్‌తో రూపాయి చెలామణి 92 రూపాయల చుట్టూనే తిరుగుతుందని కూడా స్పష్టంచేసింది. భారత్ కరెంటుఖాతాలోటు జిడిపిలో ఒకటిశాతంగానే ఉంది. సేవలరంగ ఎగుమతులు, ముడిచమురుదరలు తగ్గడం, ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ 4శాతం అంచనాలకు అనుగుణంగానే కొనసాగడంతో కొంత తీరు మారుతుందని చెపుతున్నారు. అలాగే ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను సడలిస్తుందన్న అంచనాలున్నాయి. వీటికి అదనంగా మూలధననిధులు ప్రవాహం కూడా పెరగవచ్చన్న అంచనాలున్నాయి. ప్రభుత్వ బాండ్లను గ్లోబల్ మార్కెట్లలో లిస్టింగ్‌చేయడం, కార్పొరేట్ రాబడుల్లో స్థిరత్వం, విదేశీ పోర్టుఫోలియో ఈక్విటీ పెట్టుబడులు మరింతగా రావడం వంటి అంచనాలతో రూపాయిపై ఒత్తిడి తగ్గుతుందని చెపుతున్నారు.

## ఐదు రాష్ట్రాలకు రూ.26.62 లక్షలకోట్ల పెట్టుబడులు!



**న్యూఢిల్లీ, జనవరి 3:** భారత్‌లో పెట్టుబడుల రాక గణనీయంగా పెరుగుతోంది. గత ఏడాది ఏప్రిల్‌నుంచి డిసెంబరు నెలలమధ్యకాలంలో రూ.26.62 లక్షలకోట్లు పెట్టుబడులు వచ్చినట్లు తేలింది. ప్రభుత్వం మూలధన వ్యయం పెంచడం, పన్నులరంగంలో సంస్కరణలు, మౌలికవనరులపై ఫోకస్ పెంచడం, పునరుత్పత్తి విద్యుత్, మెటల్స్ రంగాల్లో పెట్టుబడులు ఎక్కువ వచ్చాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాలు ఈ పెట్టుబడుల్లో అగ్రగామిగా నిలిచాయి. గత ఏడాదికంటే ఈసారి మరింతగా పెట్టుబడులు రావడానికి కారణం పటిష్టమైన మూలధన వ్యయం కేటాయింపులు పెరగడమే. గత ఏడాది తొమ్మిదినెలల్లో 23.88 లక్షలకోట్లు వస్తే ఈ ఏడాది తొమ్మిదినెలల్లో 26.62 లక్షలకోట్లు వచ్చినట్లు ప్రభుత్వ డేటా స్పష్టంచేస్తోంది. విద్యుత్ పునరుత్పత్తి 22.6శాతం, రసాయనాలు 21.8శాతం, మెటల్స్ 17.3శాతం, కన్స్యూమర్ రంగంలో మూడుశాతం కంటే తక్కువ పెట్టుబడులు వచ్చినట్లు తేలింది. మొత్తం పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్‌కు 25.3శాతం, ఒడిశాకు 13.1శాతం, మహారాష్ట్రకు 12.8శాతం, తెలంగాణకు 9.5శాతం, గుజరాత్‌కు 7.1శాతం పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయి. పెట్టుబడుల పరంగా మౌలికవనరుల రంగంలో కేటాయింపులు పెంచడం, పన్నులరంగంలో సంస్కరణలు ప్రత్యేకించి జిఎస్టీ 2.0, వడ్డీరేట్లు సరళీకరించడం వంటివి మూల కారణాలుగా తెలుస్తోంది. కీలక పరిశ్రమల రంగంలో పెట్టుబడులు పెరగడంతోపాటు హరిత ఇంధనంవైపు భారత్ ఫోకస్ పెంచడంతోపెట్టుబడులు కూడా పెరిగినట్లు స్పష్టం అవుతోంది.



## గ్లోబల్ ఇవి సేల్స్ లీడర్‌గా 'బివైడి'!

**న్యూఢిల్లీ, జనవరి 3:** బిలియనీర్ ఎలాన్ మస్క్ మానసపుత్రిక టెస్లా అమ్మకాల్లో వెనకబడింది. చైనా తయారీ బివైడి విద్యుత్ కార్లు 2025లో నంబర్‌వన్ ఈవీ సెల్లర్‌గా నిలిచింది. వార్షికపద్ధతిలో వాహణ డెలివరీల్లో మున్నెన్నడూ లేనివిధంగా టెస్లా వెనుకబడింది. అదే సమయంలో చైనా తయారీ బివైడి పటిష్టమైన వృద్ధిని నమోదుచేసింది. చైనా ఉత్పత్తి సంస్థ గ్లోబల్ ఈవిమార్కెట్ లీడర్‌గా నిలిచింది. టెస్లా గత ఏడాది 1.63 మిలియన్ల వాహనాలు డెలివరీచేసింది. వార్షిక వృద్ధి 8.6%గా ఉంది. కంపెనీ వార్షిక ఉత్పత్తి మాత్రం 6.7శాతం క్షీణించి 1.73 మిలియన్‌యూనిట్లకు పడిపోయింది. బివైడి, హుండై కంపెనీలనుంచి ఒత్తిడిని ఎదుర్కొనడమే కారణంగా కనిపిస్తోంది. బివైడి 2025లో 4.6 మిలియన్ యూనిట్లు డెలివరీచేసింది. అంతకుముందు ఏడాదికంటే 7.7శాతం వృద్ధిని నమోదుచేసింది. ఈ మొత్తంలో కేవలం విద్యుత్ వాహనాల వినరకయాలు 28శాతానికిపెరిగి 2.25 మిలియన్ యూనిట్లకు చేరింది. ఉత్పత్తి సామర్థ్యం పెరగడమే ఇందుకు కారణం. కంపెనీ రీసెర్చి డెవలప్‌మెంట్ విభాగంలో భారీ పెట్టుబడులు పెడుతోంది. కీలక టెక్నాలజీలన్నింటిని అందిపుచ్చుకుంటున్నది. చైనా ఉత్పత్తిరంగ బేస్, మౌలికవనరులు, పాలసీ విధానాలను బివైడి తనకు అనుకూలంగా మార్చుకుందని నిపుణుల అంచనా. చైనా కేంద్రంగా ఉన్న గిగాఫ్యాక్టరీ డెలివరీ టార్గెట్లను భర్తీచేయగలదన్న అంచనాలున్నాయి. పారిశ్రామికసరఫరా కూడా పెరుగుతోంది.చైనా ఇండస్ట్రియల్ సరఫరా నెట్‌వర్క్‌ను మరింత పటిష్టంచేసుకుంటున్నది. గ్లోబల్ డెలివరీల్లోకూడా నిర్ణీత వ్యవదిలోపే డెలివరీలు అందించేవిధంగా బివైడి ప్రణాళికలు అమలుచేస్తుండటంతో గ్లోబల్ లీడర్‌గా నిలిచింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.